SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 9
FEBRUARY - 2024 Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2024
వెల రూ. 20/-
పుటలు-56



వింత వింత విభవాల వేంకటేశుఁడిదె మా
అంతరంగమున నుండే అరచేతి దైవము - అన్నమయ్య

శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
(ఫిబ్రవరి 28వ తేదీ నుండి మార్చి 08వ తేదీ వరకు)

23-01-2024న **వైకుంఠఏకాదశి** పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల భక్తజన సముద్రమైంది. భక్తుల గోవింద నామస్మరణలతో ఏడుకొండలు మార్మోగాయి. 23వ తేదీ తెల్లవారుజామున 01-45 గంటలకు వైకుంఠద్వారాలు తెరుచుకున్నాయి. భక్తులు శ్రీవారిని వైకుంఠద్వారం నుంచి దర్శించుకుని పులకించారు. ఆరోజు ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు స్వర్ణరథంపై నాలుగుమాడవీథుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

















# గీతాశ్లోకార్థసారం

**శ్లో : దేహినోఽ స్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా**
**తథా దేహాన్తరప్రాప్తి ర్ధీరస్తత్ర న ముహ్యతి. ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-13వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** దేహినః= జీవునకు; అస్మిన్‌దేహే= ఈ శరీరంలో; కౌమారమ్= బాల్యం; యౌవనమ్= యౌవనం; జరా= వార్ధక్యం; యథా= ఎట్లుకలుగునో; తథా= అట్లే; దేహాన్తరప్రాప్తిః= మరొక శరీరాన్ని పొందడమూ (కలుగుతోంది); తత్ర= ఆ విషయంలో; ధీరః= జ్ఞాని, నముహ్యతి= మోహమునొందదు (శోకింపదు).

**భావం:** జీవునికీశరీరంలో బాల్య, యౌవన, వార్ధక్యాలనే అవస్థలెలా కలుగుతున్నాయో అట్లే మరణానంతరం మరొక శరీరాన్ని పొందడం కూడా తటస్థిస్తోంది. కావున ఈ విషయంలో జ్ఞానియగువాడెంతమాత్రమూ మోహాన్ని(శోకాన్ని) చెందడు.

---

## శ్రీవేంకటేశుచేరి సుఖము పొందిరి

నెరవాది సాహసులు నిత్యశూరులు
దురితవిదూరులు ధ్రువాదులు

తక్కక శ్రీహరిభక్తితాపలు సేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కట విష్ణుకథలు వోడసేసుక దాఁటిరి
పెక్కు సంసారజలధి భీష్మాదులు

కడువిరక్తియనేటికత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసుల పొఁజులు గూడుకొనిరి
సుడివడ కిహమందే శుకాదులు

పరమశాంతములనే పట్టపేనుగుల మీఁద
వరుసల నేఁగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవేంకటేశుఁ జేరి సుఖముఁ బొందిరి
బెరసి దాస్యమున విభీషణాదులు

(సం.01-సంకీర్తన 490)



*అనన్యమైన భక్తిప్రపత్తులతో ధ్రువుడు భగవంతుణ్ణి సేవించి శాశ్వతమైన తారగా ప్రకాశిస్తున్నాడు. సనకాదిమహామునులు, భీష్మాదులు, నారదాదులు, హరినామసంకీర్తన ద్వారా భవబంధవిముక్తులయ్యారు. శుకుడు, వ్యాసుడు, హరినామచింతన ద్వారా, శ్రీహరిచరిత్ర బోధనలద్వారా, విభీషణాదులు శరణాగతి ద్వారా సేవించి తరించారు. శాశ్వతకీర్తిని గడించారు. విష్ణువును సేవించి, నుతించి, తరించిన విష్ణు భక్తులను ఈ కీర్తనలో అన్నమయ్య సంభావించాడు.*



## లోకసంక్షేమంకోసం, స్వజన మనోభీష్టసిద్ధి కోసం

# శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ విశేషహోమం

తరతరాలుగా సనాతన హైందవ సంస్కృతిలో హోమానికి విశేషప్రాధాన్యత ఉంది. శ్రీవారి పాదపద్మాల వద్ద ఈ హోమ కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సంకల్పించింది. 23-11-2023 నుండి ఈ విశేషహోమాన్ని ప్రారంభించింది.

శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం వైఖానస ఆగమపండితుల ఆధ్వర్యంలో ఈ హోమం ఘనంగా నిర్వహింపబడుతోంది.



ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి 11 గంటల దాకా ఈ హోమం జరుగుతుంది.

ఆన్‌లైన్ ద్వారా 150 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 50మంది ఈ హోమం టిక్కెట్లు పొందవచ్చు. హోమంలో పాల్గొన్న భక్తులకు హోమభస్మం అందజేస్తారు. వేదపండితుల ఆశీర్వచనం ఉంటుంది.

**స్థలం :**
శ్రీవేంకటేశ్వరసప్తప్రదక్షిణ గోశాల ప్రాంగణం, అలిపిరి, తిరుపతి.

**హోమం టిక్కెట్టు ధర:**
రూ.1000/-

హోమంలో పాల్గొన్న ఇద్దరు రూ.300/- టిక్కెట్టు ప్రత్యేక ప్రవేశదర్శనం ద్వారా శ్రీవారి దర్శనానికి కూడా వెళ్లవచ్చు.

అలా వెళ్లదలచినవారు హోమంలో పాల్గొన్న రసీదు చూపించి, తిరుమలలో రూ.600/- చెల్లించి స్వామివారి దర్శనానికి వెళ్లవచ్చు.

**ఇతర వివరాలకు:** తి.తి.దే. అధికారిక వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in ను సంప్రదించండి.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 ఫిబ్రవరి, 2024 సంచిక : 09




**వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| **ప్రత్యేకవ్యాసాలు** | | |
| రథసప్తమి పర్వం-శ్రీనివాసుని అర్ధబ్రహ్మోత్సవాలు | శ్రీ భూమన కరుణాకరరెడ్డి, అధ్యక్షులు, తి.తి.దే పాలకమండలి | 07 |
| వేయిజపాలు, కోటి తపస్సుల విలువ ఒక్కనామం | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 10 |
| భగవంతుడే రప్పించుకున్నాడు | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 23 |
| ధర్మమే ముందు బంధుత్వం ఆ తర్వాత.. | శ్రీపద్మశ్రీ డా॥ గరికిపాటి నరసింహారావు | 31 |
| **ధారావాహికం** | | |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 14 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 15 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 22 |
| 108 దివ్యదేశాలు- 'తిరుఇందళూర్' | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య – మహామహోపాధ్యాయ కొంపెల్ల రామసూర్యనారాయణ | 38 |
| **బాలవికాసం** | | |
| కాలాన్ని గౌరవించాలి! (భాస్కరశతకం) | డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు | 46 |
| పలుకువిలువ (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| మనదంటూ ఏదీ లేదు (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్ చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 50 |
| దేనికైనా ధైర్యముండాలి (నీతికథ) | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |
| **వనితాలోకం** | | |
| జయ ఏకాదశి | శ్రీ భక్తికా దేవిదాసి | 19 |
| మార్గదర్శకమాసం | డా॥ సుబ్బలక్ష్మి మర్ల | 35 |
| చదువులమ్మకు వందనం! | శ్రీమతి డి.వరలక్ష్మి | 39 |
| **అందరికోసం** | | |
| వివాహం ఆలస్యమౌతుంటే? | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 17 |
| తెలుగుజాతి ఋణపడింది! | డా॥ సంగీతం కేశవులు | 18 |
| సూర్యుడి తొలికిరణాలలో ఈ స్వామిని చూస్తే... | శ్రీమతి రమా శాండిల్య | 21 |
| తిరుమంగళకుడి - సూర్యభగవానుడు | కుమారి ఆర్. జయశ్రీ కాశీకర్ | 33 |
| ఎంత దయామతివయ్యా! | శ్రీ బి.గురుకుమార్ రెడ్డి | 40 |
| తిరుమలకు 'తొలి గడప' | డా॥ నొస్సం నరసింహాచార్య | 41 |
| అడవిపుత్రుల ఆనందోత్సవం | డా॥ కప్పగంతు రామకృష్ణ | 42 |
| లాభాల గులాబీ.. (ఆయుర్వేదం) | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |


ముఖచిత్రం : శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారు, శ్రీనివాసమంగాపురం.
వెనుకచిత్రం : శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి రథోత్సవం, దేవునికడప.



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# ఇప్పుడే జాగ్రత్తపడదాం!

శ్లో॥ అర్థాగమో నిత్య మరోగితా చ ప్రియా చ భార్యా ప్రియ వాదినీ చ ।
వశ్యశ్చ పుత్రోఽర్థకరీ చ విద్యా షడ్ జీవ లోకస్య సుఖాని రాజస ॥

(మహాభారతం–ఉద్యోగపర్వం)

నిత్యం ధనం రావడం, రోగాలు లేకుండా ఉండడం, ఇష్టురాలైన భార్య లభించడం, ప్రియంగా మాట్లాడే భార్య లభించడం, చెప్పిన మాట వినే కొడుకు ఉండడం, ధనార్జనకు అనువైన విద్య ఉండడం–

ఈ ఆరూ మానవులకు సుఖాన్ని కలిగించేవని మహాభారతసూక్తి. ఈ ఆరింటిలోనూ రెండోదైన ఆరోగ్యం మనుషులకు ప్రధానమైంది. ఆరోగ్యముంటే మిగతా ఐదూ లేకపోయినా జీవించవచ్చును. ఆరోగ్యం లేకుంటే తక్కిన ఐదూ ఉన్నా లేనట్లే.

ముందురోజుల్లో ప్రజలు ఆజానుబాహులనీ, దృఢకాయులనీ, అరోగ్యవంతులనీ, దీర్ఘకాలం జీవించారనీ చెప్పుకోవడానికి మనకు గర్వంగా ఉంటుంది. అయితే ఈ మధ్యకాలంలో అనేక మార్పులు వచ్చి మానవజీవితాన్ని ప్రభావితం చేశాయి. ఈ మార్పులలో కనీవినీ ఎరుగని రోగాలు, ఒక్కసారిగా ప్రవేశించి, తిష్ఠ వేసుకుని కూర్చునే రోగాలు క్రమంగా ప్రవేశించి మానవజాతినే అస్తవ్యస్తం చేస్తున్నాయి. వేలకొద్దీ మహమ్మారులు, ఉత్పాతాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. అలాంటిదే 2019 సం॥లో వచ్చిన కరోనా మహమ్మారి. ఇది భూగోళంపై మానవాళి మనుగడను ప్రమాదంలోకి నెట్టింది. మహాసంక్షోభాన్ని సృష్టించింది. కంటిమీద కునుకు వేయని కాలమది. రెప్పవాల్చని కాలమది. ప్రపంచాన్ని నాలుగు గోడల మధ్య బంధించిన అమానవీయ కాలమది. ఊళ్లు, నగరాలు, దేశాలు మృత్యుఘోషతో విలపించిన కాలం, మనకాలపు మహావిషాదం ఇది. మహమ్మారి మొదటి దశ ముగిసింది. ముఖానికి మాస్క్ ధరించి అయినా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మన దేశంపై విరుచుకుపడ్డ రెండో ఉధృతి మరో మారణహోమాన్ని సృష్టించింది. భగవంతుడి దయవల్ల, నారాయణుడి స్వరూపాలైన వైద్యుల చికిత్సల వల్ల ఆ మహమ్మారులనుండి బయటపడ్డాం. అయితే కోవిడ్‌ను పూర్తిగా రూపుమాపడం అసాధ్యమని, దాని బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే పరిష్కారమార్గమని వైద్యవర్గాలు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నాయి. అది వాస్తవమని నిరూపిస్తూ కరోనావైరస్ తరచూ కలకలం సృష్టిస్తూనే ఉంది. ఆ క్రమంలోనే పలు రాష్ట్రాల్లో మళ్లీ కోరలు చాస్తోంది. కరోనా వైరస్ కొత్త వేరియంట్ జెఎన్.1 కేసులు బయటపడుతున్నాయి. ఈ వేరియంట్ మరీ ప్రాణాంతకమైనదేమీ కాదని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. అయినా అలాగని మనం అశ్రద్ధ చూపకూడదు, అజాగ్రత్తగా ఉండకూడదు. మాస్కుధారణ, చేతుల పరిశుభ్రత, సామాజిక దూరం పాటించడంలాంటి కనీసజాగ్రత్తలు పాటించడమే ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష!

జెఎన్–1 సబ్ వేరియంట్‌కు భయపడకుండా, ఆందోళన చెందకుండా సర్వాంతర్యామి అయిన శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించుకుంటూ, సర్వ ఆపన్నివారకమైన సుందరకాండను పఠిస్తూ, వింటూ మానసికధైర్యాన్ని, స్థైర్యాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఆకాంక్ష!

//కమలాకాంతుడే చింతలు దీర్చు దివ్య ఔషధం//



# రథసప్తమి పర్వం- శ్రీనివాసుని అర్ధ బ్రహ్మోత్సవాలు



- శ్రీ భూమన కరుణాకర రెడ్డి,
అధ్యక్షులు,
తి.తి.దే. పాలకమండలి

సనాతన సంస్కృతిలో సూర్యభగవానుని స్థానం, మహిమఅద్వితీయం. వేద, పురాణాదులు, ఇతిహాస, కావ్యాదులు సూర్యదేవుని మహిమను విస్తారంగా ప్రబోధిస్తున్నాయి. సూర్యభగవానుడు మనకు ప్రత్యక్షదైవం. సూర్యుని త్రికాలస్వరూపాలస్మరణతో కూడిన గాయత్రీమంత్ర ఉపాసన సమస్తదుర్దశలు తొలగిస్తుంది. 'సౌరశక్తి'కి చెందిన విజ్ఞానమెంతో వేదంలోని సూర్యమంత్రాలలో ఉందని పాశ్చాత్యులు కూడా గుర్తించి, పరిశోధిస్తున్నారు. సూర్యుడు ప్రతిరోజు ప్రత్యక్షంగా మన కళ్లయెదుట సాక్షాత్కరిస్తున్న పరబ్రహ్మం, సమస్తవిశ్వానికి ఆత్మ. సూర్యోపనిషత్తులోని 1-4ను అనుసరించి 'సూర్యుడు సమస్తప్రాణులను ఉత్పత్తి చేస్తున్నాడు, పోషిస్తున్నాడు. సూర్యుని శక్తిని తెలిపే "అరుణ" మంత్రాలవల్ల విజయప్రాప్తి, ఆరోగ్యలాభం, రోగనివారణ-సాధకులకు చేకూరుతాయి.

తన ఉదయం చేతనే లోకాన్నంతటిని నిత్యకర్మలకై ప్రేరేపించేవాడు సూర్యుడు. అందుకే సూర్యుడిని జగచ్చక్షువు, కర్మసాక్షి అన్నారు. సూర్యభగవానుడే మనం చేసే సమస్తశుభాశుభకర్మలకు సాక్షి. కనుక మనం మనసా- వాచా- కర్మణా చేసే పనులన్నీ పుణ్యప్రదాలై ఉండాలని పురాణాల ప్రబోధం. కనుక ఎల్లవేళల శుభకర్మల నాచరించే అదృష్టాన్ని ప్రసాదించమని మనం సూర్యుణ్ణి వేడుకోవాలని, సూర్యుడు సకల దేవతా స్వరూపుడని వేదశాస్త్రాలన్నీ ముక్తకంఠంతో ప్రబోధించాయి.

సూర్యుడే కాలచక్రానికి మూలం. సూర్యుని వల్లనే షడృతువులు ఏర్పడుతున్నాయి. సమస్తానికి కారణభూతుడైన పరమాత్మ సూర్యుడే. కనుక **'ఓం ఆదిత్యాయ విద్మహే సహస్ర కిరణాయ ధీమహి, తన్నఃసూర్యః ప్రచోదయాత్'** అనే సూర్య గాయత్రీ మంత్రంతో నిత్యం సూర్యుణ్ణి భారతీయులు ఆరాధిస్తున్నారు. అంతేకాక-

**ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ, శివః స్కంధః ప్రజాపతిః।**
**మహేంద్రో ధనదః కాలో, యమః సోమో హ్యపాం పతిః॥**

**ఏన మాపత్సు కృచ్ఛ్రేషు, కాంతారేషు భయేషు చ।**
**కీర్తయన్పురుషః కశ్చిత్, నావసీదతి రాఘవ ॥**

వాల్మీకి రామాయణంలో యుద్ధకాండలో ఆదిత్యహృదయస్తోత్రం రాముడికి అగస్త్యుడు ఉపదేశించాడు. సూర్యభగవానుని విరాట్స్వరూపాన్ని వివరిస్తూ బ్రహ్మ, విష్ణు, శివ, సుబ్రహ్మణ్య, ఇంద్ర, కుబేర, యమ, వరుణాది దేవతలందరూ సూర్యుడే. సూర్యుని వివిధరూపాలలో ఆరాధించడమే. ఆపదల్లో చిక్కినా, పాపాల్లో కూరుకుపోయినా, అరణ్యం మధ్యలో చిక్కుకొని దిక్కుతోచక తిరుగుతున్నా, భయంతో ఉన్నా, సూర్యభగవానుణ్ణి ఆరాధిస్తే సమస్తదుఖాఃలు తొలగిపోతాయి.

**"ఓం నమో నారాయణాయ"** అనే అష్టాక్షరీ మహామంత్రాన్ని స్మరిసస్తూ




## సప్తవాహనసేవలలో....

**కలియుగవైకుంఠమైన తిరుమల పుణ్యక్షేత్రంలో ఈ మాఘసప్తమి పర్వాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహిస్తున్నారు. శ్రీవారిని ఏడువాహనాలపై ఊరేగించి, చక్రస్నానం చేయడం ఆగమసంప్రదాయం. 1564 నుండి శ్రీవారికి అర్ధబ్రహ్మోత్సవాలుగా ఈ రథసప్తమి వేడుకలు జరుగుతున్నట్లు శాసనాలు వివరిస్తున్నాయి.**

**రథసప్తమినాడు సూర్యప్రభవాహనం ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుంది. చిన్నశేషవాహనం విషతుల్యమైన పాపాలను పటాపంచలుచేస్తుంది. గరుడవాహనం దాస్యభక్తిని కటాక్షిస్తుంది. హనుమద్వాహనం కార్యసిద్ధినిస్తుంది.**

అర్ఘ్యప్రదానం చేసి, మనస్సును పవిత్రంగా, ఏకాగ్రంగా నిలిపి భక్తిపూర్వకంగా ప్రతిరోజు ఉదయం 108సార్లు స్మరిస్తే సూర్య భగవానుని అనుగ్రహం లభిస్తుంది.

### రథసప్తమి

సూర్యభగవానుని కాంతికిరణాలు భూమికి అధికంగా లభించే రోజు. ఈ రోజు నుండి సూర్యగమనంలో మార్పు ప్రారంభమౌతుంది. సూర్యుడికి పుట్టుపండుగ (అవతార మహోత్సవం)గా భారతీయులు భావిస్తారు. రథసప్తమి రోజున సూర్యునకు పాయసాన్నం నివేదన చేసి (చిక్కుడు ఆకుల్లో) ఆరగిస్తారు. చిక్కుడు, జిల్లేడు సూర్యశక్తిని అధికంగా గ్రహించే దేవతావృక్షాలు, కనుక వాటి ద్వారా ప్రసాదనివేదనను సూర్యునికి ఈరోజున వినియోగించడం ఆరోగ్యకరం.

రథసప్తమి రోజున ప్రాతఃకాలంలో చేసే స్నానవిధిని మహర్షులు వైజ్ఞానికంగా ఉపదేశించారు. ఉదయాన్నే చన్నీటి స్నానం చేసే ముందు శిరస్సుపైన ఏడు జిల్లేడు ఆకులు, మూడు రేగు ఆకులు, మూడు రేగుపళ్లు, కొద్దిగా బియ్యం పెట్టుకుని సూర్యుని స్మరిస్తూ స్నానంచెయ్యాలి. పంచాంగకర్తలు రథసప్తమిని 'సూర్యజయంతి'గా తీర్మానిస్తూ, ఈ రోజు నుంచి సూర్యకాంతి ఉత్తరదిక్కున ఎక్కువగా ఉంటుందని, నక్షత్రాలన్నీ ఆకాశంలో రథాకృతిగా ఉంటాయి. కనుక సమస్త మానవాళికి సూర్యుని ఆరాధించడంవల్ల శుభాలు కలుగుతాయని ప్రబోధించారు.

సూర్యుడిని పన్నెండు పేర్లతో కీర్తించడం ప్రసిద్ధ సంప్రదాయం. ఆ పేర్లు సూర్యుడికి ఎందుకు వచ్చాయో మహర్షులు వివరించారు.

**01)మిత్రుడు-** సూర్యుడు లోకానికి మిత్రుడువంటివాడు. ప్రకృతిలో ప్రాణులన్నీ సూర్యదర్శనాన్ని కోరుకుంటాయి. కనుక సూర్యుని దర్శించి మానవులు సత్కార్యాలు చేస్తే సూర్యమైత్రి సిద్ధించి ఆరోగ్యం, మంచి కవిత్వం, బుద్ధిబలం, శరీరకాంతి, ఆయుర్దాయం, కీర్తి, ధనం చేకూరుతాయని మయూరకవి కొనియాడాడు.

**02)రవి-** అందరిచేత స్తోత్రం చేయబడుతున్నాడు కనుక రవి. నారాయణుడి నాభికమలంనుండి పుట్టిన బ్రహ్మకు వేదాలు ఉపదేశించిన వేదవ్యాపకుడు సూర్యభగవానుడు.

**03)సూర్యుడు-**సూర్యుడు సర్వప్రాణులను వారి వారి కర్మల యందు ప్రవర్తింపచేస్తున్నాడు. ప్రేరకత్వం, స్రష్టృత్వం సూర్యునికి స్వభావసిద్ధ గుణాలు.

# సప్తగిరీశుడు

**కల్పవృక్షవాహనం కోర్కెలన్నీ తీరుస్తుంది. అధికార సంపద లనిచ్చేది సర్వభూపాలవాహనం. ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికతాపాలను తొలగించేది చంద్రప్రభవాహనం. ఈ వాహనాలకు ఇంతటి శక్తినిచ్చేది వీటిని అధిరోహించే తిరుమల శ్రీనివాసుడే.**

**కనుక శ్రీవేంకటేశ్వరస్వామికి లేదా శ్రీమన్నారా యణుడికి అభేధాన్ని విశ్వసించే మహనీయులు సూర్య నారాయణుడిగా పరమాత్మను కొనియాడుతున్నారు. ఆ దేవ దేవుని సేవలో తరిద్దాం! రథసప్తమి పర్వాన్ని ఆచరించి కృతార్థుల మౌదాం!!**




**04)భానుడు-**అంతటా కాంతిని నింపేవాడు. జీవులు ఆరాధిస్తే కాంతిని ప్రసాదిస్తున్నాడు.

**05)ఖగుడు-** పరమాకాశంలో అధిష్ఠించి ఉన్నవాడు సూర్యుడు. ఈ సమస్తప్రపంచాన్ని శాసిస్తూ వైకుంఠంలో ప్రసిద్ధిగా ఉండే మహాత్ముడు సూర్యనారాయణుడు.

**06)పూష-**ఈ విశ్వమంతటిని తన కాంతితో పోషిస్తున్నాడు. అంటే ఈ విశ్వాన్ని, ప్రకృతిసంపదను, సృష్టించి దీని ద్వారా మనల్ని పోషిస్తున్నాడు. మానవులు జీవించడానికి అన్నం అవసరం, ఇది జీవనానికి కారణం. అన్నం ద్వారా జీవుల్ని వృద్ధి చేసి, అన్నం ద్వారానే వారిని సంహరిస్తాడు. కానీ వారిలోని తేజస్సుతో వారి వంశాన్ని ఏర్పరచి పోషిస్తాడు.

**07)హిరణ్యగర్భుడు-** ప్రళయకాలంలో జీవులను తన బంగారు వంటి రంగులోకి తెచ్చి జీవులందరినీ తన ఉదరంలో ఉంచుకుని, ప్రళయానంతరం తిరిగి విశ్వంలోకి తెస్తాడు.

**08)మరీచి-** మరీచిమాన్ అంటే కిరణపుంజాల సమూహం కలవాడు. అంధకారాన్ని, వ్యాధులనే శత్రువులను నాశనం చేసే సామర్థ్యం కలవాడు. శంఖపద్మచక్రగదాధరుడైన పరమాత్మ.

**09)ఆదిత్యుడు-** సూర్యుడిద్వారా సమస్తఫలాలు లోకం పొందు తోంది. అంటే లోకంలోని సమస్తం సూర్యునికి అధీనాలే. అంతేకాదు సమస్తవస్తువుల్ని ప్రకాశింపచేస్తున్న పుణ్యమూర్తి. సమస్తవస్తువులను లోకానికి ప్రదానం చేసేవాడు సూర్యుడే.

**10)సవితృడు-** సమస్త విశ్వాన్ని సృజించి, సర్వప్రాణులకు జీవనాధారమై ఉపాధిని, ఆనందాన్ని కలిగిస్తున్నాడు.

**11)అర్కుడు-** లోకంలో మొట్టమొదట స్తోత్రం చేయదగ్గవాడు సూర్యుడే. అందుకే సూర్యనమస్కారాలు సకలసంపదలు, ఆరోగ్యం, అనుభూతిని ప్రసాదిస్తున్నాయి.

**12)భాస్కరుడు-** సూర్యుని అనుగ్రహించే ఈ దృశ్యప్రపంచంలో మనం అన్నీ దర్శిస్తున్నాం. అంతేగాక సూర్యుని ఆరాధనవల్ల విశ్వంలోని నిగూఢ విషయాలు, గ్రహించగలుగుతున్నాం. ఇలా ఎంతో లోతైన అర్థాలు, అంతరార్థాలు కలిగిన సూర్యుని ఈ 12 నామాలు మహిమానిత్వమైనవి. కనీసం రథసప్తమి అనే శ్రీసూర్యజయంతి పర్వంనాడైనా వీటిని స్మరించాలి.

# వేయిజపాలు, కోటి తపస్సుల విలువ ఒక్కనామం

- డా॥ కంపల్లె రవిచంద్రన్,
98487 20478

గోవింద నామకోటిపై ప్రత్యేకకథనం

'గోవిందాది నామోచ్చారణ,
కొల్లలు దొరికెను మన కిపుడు'

అని పదకవితాపితామహుడైన అన్నమయ్య పదిహేనవ శతాబ్దంలో 'వీథుల వీథుల' పాడి జన సామాన్యానికి తరణో పాయం సూచించాడు. ఈనాడు పాడడం మాత్రమే కాదు, కానీ 'గోవింద నామకోటి' వ్రాసి తిరుమలేశుని దర్శనం చేసుకోండని నగారా మ్రోగించి చాటిస్తున్నది నేటి 'తిరుమల వేంకటేశ్వర సంస్థానం'.

భారతీయులు అంకెల గణనంలో 'కోటి'కి ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. వాడుకలో 'కోటికి పడగలెత్తినవాడు కోటీశ్వరుడు' లాంటివి ఉండనే ఉన్నాయి. తిరుమలలో పఠింపబడే గద్యలో 'అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకస్య' ప్రయోగముంది. శ్రీవైష్ణవులు నాలాయిరం సాయించడానికి ముందుగా మొదలు పెట్టే 'పల్లాండు పల్లాండు'లో 'పల **కోడి** నూరాయిరం'లోను కోటిశబ్దముంది. ఉత్కర్షను వ్యక్తం చేయడానికి 'కోటి' శబ్దం వాడబడుతుంది.

ఇహజీవితంలోనే కాదు ఆధ్యాత్మికజీవితంలోను సంఖ్యకు ప్రాధాన్యముంది. ముఖ్యంగా స్తోత్రాదులలో అష్టకం, దశకం, శతకం, సహస్ర సంఖ్యలకు ప్రత్యేకార్థాలున్నాయి. అలాగే 'కోటి' సంఖ్య. శ్రీరామనామాన్ని కోటిసార్లు జపించడం, వ్రాయడం ఒక వ్రతంగా చేపట్టిన వారున్నారు. నాదధేనువు పిండి నవనీత మందించిన త్యాగరాజస్వామి తమ ఇరవయ్యవ ఏడున 96 కోటి శ్రీరామనామజపదీక్ష పూనారని, తన 21 ఏడున 15వ రోజు ఆ దీక్ష ముగించారని, ఆ సందర్భంలోనే 'ఏల నీ దయరాదు' అనే అఠాణా రాగకృతి పాడారని పరంపర చెబుతోంది, క్రమంగా 'రామకోటి' వ్రాయడానికి దారి చూపింది. శ్రీరామనవమికే కాదు రామకోటి రాసిన పుస్తకాలను గుడిలో అర్పించే సందర్భంలో ఉత్సవాలు జరిపించడం తెలుగునేలపై నేటికీ ఉంది. ఆ ఉత్సవాలకు రామకోటి ఉత్సవాలని పేరు.

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరం
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనం।

అంటే 'రామ' అనే పేర్లు లక్షకోటి రాస్తే ఒక్కొక్క అక్షరమే మహాపాతకాలను నశింపజేస్తుందని స్వయంగా పరమ శివుడే పార్వతీదేవికి చెప్పినట్లు భవిష్యోత్తరపురాణంలోని ఉమా మహేశ్వరసంవాదంలో వివరింపబడింది.

రామకోటి వ్రాయడానికి ప్రత్యేకంగా పుస్తకాలు గడులతో అచ్చువేసి అమ్మడం, ఆ పుస్తకాలలో 'శ్రీరామ శ్రీరామ శ్రీరామ' అంటూ రోజుకి కొన్ని వందలలో భక్తులు శ్రీరామ వ్రాస్తారు. అలా వ్రాసి కోటి పూర్తయ్యాక పుస్తకాలను శ్రీరామ మందిరాలలో కట్టడాలు కట్టి వీటిలో వాటిని భద్రపరుస్తారు. శ్రీరామ శబ్దానికున్న ప్రాధాన్యం వ్రాయడానికి పుటలు చాలవు. అలాంటిదే 'గోవిందనామాలు'.

తిరుమలకు మెట్లమార్గంలో వెళ్లే భక్తులు 'ఏడుకొండల వాడ! వేంకటరమణా! గోవిందా! గోవిందా!!' అంటూ కొండ ఎక్కుతారు. తమిళులు 'ఏళుమలైయాన్, మలయప్పా! గోవిందా! గోవిందా!' అంటూ అడుగులు ముందుకు వేస్తారు. తిరుమలే శునికి 'గోవింద గోవింద సందడి వేల్పు' అని ఒక సంబోధన ఉంది.

'గోవింద' శబ్దం చాలా ప్రాచీనమైందే. శ్రీమహావిష్ణువు పేర్లలో 'గోవింద' ఒకటి. స్వామికి ఈ గోవిందనామం రావడానికి భాగవతంలో చక్కటి కథ ఉంది.

ఒకనాడు నందాది గోపాలురందరూ ఇంద్రయాగాన్ని నిర్వహించడానికి సన్నద్ధులు కావడాన్ని శ్రీకృష్ణుడు చూచి అతడు నందాదులతో "రజోగుణప్రేరణ చేతనే మేఘాలు భూమిపై వర్షిస్తున్నాయి. ఆ నీటివల్ల ఆహారోత్పత్తి జరుగుతోంది. ఇందులో ఇంద్రుని ప్రమేయం లేదు. కనుక, మనం ఇంద్రయాగం మాని మనకు జీవనాధారమైన గోవుల్ని, మనకు నివాసస్థానమైన గోవర్ధనగిరిని పూజిద్దామని" చెప్పాడు. నందాదులు అందుకు ఒప్పుకున్నారు. కృష్ణుడు చెప్పిన ప్రకారం ఇంద్రయాగం మాని

బ్రాహ్మణులు, గోవుల్ని పూజించారు. తర్వాత గోవుల్ని ముందుంచుకొని గోవర్ధనగిరికి ప్రదక్షిణలు చేశారు. గోపాలు రందరిలో నమ్మకం కలిగించడానికి శ్రీకృష్ణుడు గోవర్ధనపర్వతం పైకి చేరి ఒక మహారూపంలో కన్పించాడు.

శ్రీకృష్ణుని పర్యవేక్షణలో నందాది గోపాలురు అందరు తనను పూజించక, గోవర్ధనగిరిని పూజించినందుకు ఇంద్రుడు వాళ్ల పట్ల కోపించాడు. ఇంద్రుడు తానే త్రిలోకాధిపతినని భావించుకున్నాడు. అతడు బృందావనంపై జలప్రళయాన్ని సృష్టింపదలచాడు. అందుకోసం సంవర్తకనామమేఘాలను పిలిచి వ్రజభూమిపై అత్యంత అధికవర్షాన్ని కురిపించమని, గాలివాన లతో వారి గోవుల్ని హతమార్చమని ఆదేశించాడు. సంవర్తకాది మేఘాలు నందగోకులంపై విజృంభించి పిడుగులతో, మెరుపు లతో జడివాన ఎడతెరపి లేకుండా కురిపించసాగాయి. వ్రజ భూమి అంతా జలమయమైంది. కుంభవృష్టికి, పెనుగాలుల తాకిడికి తట్టుకోలేక గోవులు చెల్లాచెదరై వణికిపోసాగాయి. గోపాలురు, గోపికలు తీవ్రమైన చలిబాధకు తట్టుకోలేక శ్రీకృష్ణుని శరణుజొచ్చారు. శ్రీకృష్ణుడు ఇదంతా కోపించిన ఇంద్రుని నిర్వా హకమే అని తలంచాడు. తన యోగమాయ చేత, దీనికి ప్రతి క్రియ చేసి, తనకు తానే త్రిలోకాధిపతినని గర్విస్తున్న ఇంద్రునికి బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే శ్రీకృష్ణుడు ఒక చేతితో గోవర్ధనగిరిని అవలీలగా పైకెత్తి తన చిటికెన వ్రేలుపై నిలిపి, నందగోకులానికి రక్షణ కల్పించాడు.




ఇంద్రుడు శ్రీకృష్ణుని యోగమాయాప్రభావాన్ని చూచి ఆశ్చర్యపడి, తన సంకల్పం నెరవేరకపోవడంతో అహంభావాన్ని వదిలేసి సంవర్తాదిమేఘాల్ని పూర్తిగా నివారించాడు. వెంటనే ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఆకాశంలో మబ్బులు చెదరి పోవడంతో సూర్యదర్శనమైంది. దాంతో వ్రజవాసులందరూ స్వస్థానాల్ని చేరి సుఖంగా జీవించారు. అప్పుడు అందరు చూస్తుండగా శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని క్రిందికి దింపి యథా స్థానంలో నిలిపాడు.

ఇంద్రుడు తన అపరాధాన్ని క్షమించమని ప్రార్థించ డానికి వ్రజభూమికి వచ్చాడు. వర్షోపద్రవం నుండి గోవుల్ని రక్షించడం వల్ల శ్రీకృష్ణుని గోవిందుడని కీర్తించాడు.

మ॥ సురభిక్షీరములన్ సురద్విప మహాశుండాలతా నీత ని
ర్ఝర గంగాంబువులన్ నిలింప జననీ సన్మౌని సంఘంబుతో
సురనాథుం డభిషిక్తు జేసి పతికిన్ సొంపార గోవిందుడం
చరణాక్రాంత విపక్షు దోయజదళాక్షున్ సాధుసంరక్షణున్॥
(భాగ, 10, పూర్వ-948)

కామధేనువు యొక్క పాలతో, ఐరావతం తన తొండంతో తెచ్చిన ఆకాశగంగాజలంతో, అదితి మునుల సమూహంతో ఇంద్రుడు శ్రీకృష్ణుణ్ణి అభిషేకించి గోవిందుడని స్తుతించాడు. యుద్ధంలో ఆక్రమించబడ్డ శత్రువు గలవాడు, పద్మపత్రాల వంటి నేత్రాలు గలవాడు, సాధువులను రక్షించేవాడు అయిన కృష్ణుడు గోవిందుడనే పేరుతో పిలువబడ్డాడు. నాటి నుండి 'గోవింద'శబ్దం భగవద్వాచకమై ప్రసిద్ధమైంది. గోవింద నామం భూమిని ఉద్ధరించడంవల్ల వరాహవిష్ణుదేవునికి, గోవుల్ని రక్షించడం వల్ల శ్రీకృష్ణునకు రూఢి అయింది.

గోసంఘ సంరక్షకుడైన శ్రీకృష్ణునిగా జన్మించిన విష్ణు దేవుని అర్చామూర్తి శ్రీవేంకటేశ్వరుడు. వేంకటాద్రిపై చింతచెట్టు క్రింద పుట్టలో నివసించి ఉన్న శ్రీనివాసునికి బ్రహ్మదేవుడు గోరూపంలో పాలు పుట్టలోకి కార్చుతుండగా గోపాలుడైన శరభయ్య కోపంతో చేతి గొడ్డలిని ఆవుపై విసిరాడు. ఆ దెబ్బ ఆవుకు తగలకుండా శ్రీనివాసుడు పుట్టలో నుండి లేచాడు. ఆ గొడ్డలి దెబ్బ శ్రీనివాసుని తలపై తగిలింది. ఆవు రక్షించబడింది. ఇందువల్ల శ్రీనివాసుడు గోవిందుడని కీర్తింపబడుతున్నాడు. అందువల్లే 'వేంకటేశా! గోవిందా! గోవింద!' నామస్మరణతో నిరంతరం వేంకటాద్రి తిరుమల హోరెత్తుతుంటుంది.

శాస్త్రపాండిత్యం కలవారు 'గోవింద' శబ్దానికి ఏడు అర్థాలు చెప్పారు. 'గో' అంటే స్వర్గం. 'విందా' అంటే ఇచ్చేవాడు, మోక్షాన్ని ఇచ్చేవాడు. 'గో' అంటే వాక్కులు. 'విందా' అంటే తెలుసుకునేవారు. వేదరూపమైన వాక్కులతో తెలుసుకోబడేవాడు. 'గోవింద' అంటే ప్రపంచాన్ని గెల్చుకున్నవారు. గో అంటే కిరణం. విందా అంటే తెలుసుకొన్నవాడు. తానే స్వయంగా పరంజ్యోతి కావడంతో తనను తానే సంపూర్ణంగా తెలుసుకున్న వాడు కావడంతో గోవిందుడు. గోవు సాత్త్వికజీవి. సాత్త్వికతకు గుర్తు. అంటే ఆ స్వామి సాత్త్వికులను, సాత్త్వికతను పోషించి రక్షించేవాడు. ఆయనను ఆశ్రయించినవారు సాత్త్వికులే కనుక తమను పాలించమని, కాపాడమని 'గోవింద' అంటారు.

ఇక ఆగమశాస్త్ర సంప్రదాయాలపరంగా చూస్తే చతుర్వింశతి నామాలలో 'గోవింద' నాలుగవది. 'ఓం గోవిందాయ నమః' అనే మంత్రం స్వామికి మిక్కిలి ప్రియమైంది. గోవింద నామం శ్రీవేంకటేశ్వరస్వామికే చెల్లు.

అనుదినం తిరుమలలో సుప్రభాతసేవలో శ్రావ్యంగా పఠించే అణ్ణన్ గారి స్తుతిలో 'ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద' అనే సంబోధన ఉంది. శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో 'గోవిందాయ నమో నిత్యం శ్రీనివాసాయతే నమః' అని ఒక నామం. వీటికి తోడు తిరుపతిలో 'తిల్లై గోవిందరాజులు'న్నారు. ఇన్ని రకాల ప్రశస్తి ఉండడం వల్ల అన్నమయ్య–

*'గోవిందాశ్రిత గోకులబృందా/ పావన జయజయ పరమానందా'* అని మనసారా పాడాడు. 'గోవింద' మహావిష్ణువును, శ్రీరాముని, శ్రీకృష్ణుని శ్రీవేంకటేశ్వరస్వామిని తలపిస్తుంది కనుక విశిష్టం.

శ్రీరామకోటి, గోవింద నామకోటి వ్రాయడమేమిటి అన్నది కుతూహలం కల్గించే అంశం. నామకీర్తనకు 'జిహ్వ' ఒకటి చాలు. ఇతర ఇంద్రియాలు ఎలా ఉన్నా 'జిహ్వ' పలుకుతూనే ఇంది. 'నామస్మరణం' చాలా గొప్పదే. అజామిళాదులకు ముక్తి ప్రసాదించింది నామావళియే. కానీ, వ్రాతకు బుద్ధి, నేత్రం, చేయి, నిలకడ చాలా అవసరం. ఉచ్చారణలో నాలుక చేసే పనిని గోవిందకోటి రాయడంలో 'కలం' చేస్తుంది. కలంలోని సిరా మనసులోని భక్తి ప్రకటనకు సహకరిస్తుంది. నేత్రం ధ్యాన నిశ్చలత్వాన్ని పెంచుతుంది. వయసు పైబడ్డవారు వ్రాత కారణంగా ఆరోగ్యంగా ఉంటారనేది వైజ్ఞానిక సత్యం. వ్రాయ వ్రాయ వ్రాతకాడు, పాడపాడ పాటకాడు. అలాగే గోవింద కోటిని వ్రాసేవారు ఆయుష్మంతులై, ఆరోగ్యవంతులై ఉంటారనేది ప్రత్యక్షసాక్ష్యం.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రస్తుత పాలకమండలి అధ్యక్షులు శ్రీభూమన కరుణాకర రెడ్డి పై విషయాల్ని దృష్టిలో పెట్టుకుని మొదటిసమావేశంలోనే పలు కార్యక్రమాలకు శ్రీకారంచుట్టారు. యువతలో హైందవసనాతనధర్మవ్యాప్తికోసం శ్రీవారిఆలయం నుండే తొలిఅడుగు వేశారు.

ఇందులో భాగంగా రామకోటితరహాలో గోవిందకోటి పుస్తకాలను తి.తి.దే. అందుబాటులో ఉంచింది. 200 పేజీలు గల 'గోవింద నామకోటి' పుస్తకం ధర రూ.111/–గా నిర్ణయించింది. ఒక్కో పుస్తకంలో 39,600 వంతున, 26 పుస్తకాలలో 10 లక్షలా 1,116 సార్లు గోవిందనామం వ్రాసిన వారికి తిరుమల శ్రీవారి బ్రేక్‌దర్శనం, వసతిసౌకర్యం కల్పిస్తారు.

అదేవిధంగా 253 గోవిందకోటి పుస్తకాలలో కోటిసార్లు వ్రాసిన పాతికేళ్లలోపువారికి వారి కుటుంబసభ్యులు ఐదు మందితో కలిపి ఒకసారి తిరుమల శ్రీవారిబ్రేక్ దర్శనం, వసతిసౌకర్యం కల్పిస్తారు.



## గోవిందకోటి వ్రాయడానికి సాధారణ నియమాలు




**01)** గోవిందకోటి రాయడానికి ప్రతిరోజు ఒక సమయం పెట్టుకుని తూర్పుదిశగా కూర్చుని రాయాలి.

**02)** ప్రతిరోజు గోవిందకోటిరాసే ముందు మనసులోనే స్వామివారికి నమస్కరించాలి. అనుకున్నన్ని సార్లు గోవింద కోటిని రాసి పూర్తి చేశాక *'ఓం గోవిందాయ నమః'* అని ఉద్యాపన చెప్పుకోవాలి.

**03)** గోవిందకోటి రాయాలనుకున్నప్పుడు శ్రీవేంకటేశ్వరస్వామి పటం/ విగ్రహంవద్ద మానసికంగా సంకల్పం చేసుకోవాలి.

**04)** మంచిరోజు చూచుకుని పుస్తకానికి పసుపు, కుంకుమ రాసి దేవుని సన్నిధిలో ఉంచి పుష్పాలతో, శ్రీవేంకటేశ్వర స్వామివారి అష్టోత్తరశతనామావళితో పూజించాలి. తర్వాత పుస్తకం కళ్లకద్దుకుని వ్రాయడం ప్రారంభించాలి.

**05)** గోవిందకోటి రాసేటప్పుడు ఇతరవ్యాపకాలు, ఆలోచనలు పెట్టుకోగూడదు. మనస్సు స్థితిమితంగా 'గోవిందా!' అనుకుంటూ మనసును కేంద్రీకరించి వ్రాయాలి.

**06)** అనుకోకుండా మధ్యలో ఏదైనా పనిమీద వెళ్లాల్సి వస్తే ఒక సరిసంఖ్యలో వ్రాయడం ఆపి పుస్తకం మూసి నమస్కరించి వెళ్లాలి. పనైపోయిన తర్వాత కాళ్లు, చేతులు కడుక్కుని శుచిగా మళ్లీ రాయడం మొదలుపెట్టాలి.

**07)** గోవిందకోటి వ్రాసే పుస్తకం జాగ్రత్తగా భద్రపరచాలి. అందులో ఇతర విషయాలు ఏవీ రాయకూడదు. దీనికి ఉపయోగించే కలాన్ని కూడా విడిగా ఉంచుకోవడం శ్రేయస్కరం.

**08)** గోవిందకోటి వ్రాయడానికి ప్రత్యేకమైన సమయం అంటూ ఏదీ లేదు. కానీ శుచీ, శుభ్రత, పవిత్రత, ప్రశాంతత మాత్రం తప్పక పాటించాలి. ఒకవేళ ఎప్పుడైనా నిద్ర వస్తోంది అనుకుంటే నిద్రమానుకుని బలవంతంగా వ్రాయడం ఆపేయాలి.

**09)** ప్రతి లక్ష నామాలకు ప్రత్యేకపూజ, నివేదన చేసి ప్రసాదాన్ని పంచాలి. గోవిందకోటివ్రాయడం పూర్తయిన తర్వాత శక్త్యానుసారంగా పూజ, నివేదనలు సమర్పించి ఆరాధనం చేయడం మంచిది.

**10)** పూర్తయిన గోవిందకోటి పుస్తకాన్ని పసుపుబట్టలో కట్టి తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి సమర్పించాలి.

**11)** ఇలా గోవిందకోటిని నిష్ఠతో వ్రాస్తే భక్తులు, తాము అనుకున్నకార్యాలు కూడా దిగ్విజయంగా పూర్తవుతాయి.

**12)** ఏదైనా ఒక కార్యం పూర్తవ్వాలని సంకల్పించుకుని గోవిందకోటి వ్రాయడం ప్రారంభిస్తే అది తప్పక జరిగి తీరుతుంది.



**13)** శుచిగా లేని సమయాల్లోనూ, మైల సమయాల్లోనూ గోవింద కోటి వ్రాయకూడదు.

**14)** స్త్రీపురుష, వయసు, తారతమ్యాలు లేకుండా గోవిందకోటి వ్రాయవచ్చు.

**ప్ర) 'సంధ్యా కాలం' చాలా పవిత్రమైందని, ఆ సమయంలో భగవద్ధ్యానం మంచిదనీ అంటారు. సంధ్యాకాలం అంటే సరిగ్గా ఏ సమయం? 'సకాలం'లో సంధ్యావందనం చేయాలి కదా? ఆ 'సకాలం' ఏమిటి??**

**జ)** రోజుకి మూడుసంధ్యలు శాస్త్రంలో చెప్పబడ్డాయి. 1)ప్రాతఃసంధ్య, 2)మధ్యాహ్న సంధ్య, 3)సాయంసంధ్య. ఇవికాక కొన్ని ఉపాసనలకు చెప్పబడ్డ సంధ్య తురీయ సంధ్య. ఇది నాలుగవది. దీని సమయం అర్ధరాత్రి.

ఉదయానికి ముందు వచ్చేకాలం 'ప్రాతఃసంధ్య'. రాత్రికి ముందు వచ్చేది 'సాయంసంధ్య'. మధ్యాహ్నవేళ 'మధ్యాహ్నిక సంధ్య'.

ఉదయా ప్రాక్తనీ సంధ్యా
ఘటికా త్రయ ముచ్యతే ।
సాయంసంధ్యా త్రిఘటికా
అస్తాదుపరి భాస్వతః ॥

సూర్యోదయానికి ముందు దాదాపు 70 నిమిషాలకాలం ప్రాతఃసంధ్యకు ముఖ్యకాలం. సూర్యుడస్తమించడానికి ముందు ఇరవైనిమిషాలు మొదలుకుని, సూర్యుడస్తమించిన తరువాత 30 నిమిషాల కాలం సాయంసంధ్యకు ముఖ్యకాలం. ఇందులోనూ ఉత్తమ, మధ్యమ, అధమభేదాలున్నాయి.

1) ఉత్తమా తారకోపేతా
మధ్యమా లుప్త తారకా ।
అధమా సూర్యసహితా
ప్రాతఃసంధ్యా త్రిధామతా ॥

# సందేహాలు



# సమాధానాలు

-బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

తెల్లవారుఝామున నక్షత్రాలుండగా ప్రాతఃసంధ్యావందనానికి ముఖ్యకాలం. ఇదే సకాలం. తారకలు లేని ప్రాతఃకాలం మధ్యకాలం, సూర్యుడు ఉదయించిన తర్వాత సంధ్యావందనానికి అధమకాలం, సకాలంలో చేయడమే సర్వశ్రేష్ఠం. అలా కుదరనప్పుడు, మానేయడం మంచిది కాదు కనుక, "ముఖ్య కాలాతిక్రమణ దోష పరిహారార్థం" అధిక అర్ఘ్యప్రధానంతో సంధ్యోపాసన చేయాలి.

2) ఉత్తమా సూర్యసహితా
మధ్యమా లుప్త భాస్కరా ।
అధమా తారకోపేతా
సాయంసంధ్యా త్రిధామతా ॥

సాయంవేళ సూర్యుడుండగా చేసే సంధ్యావందనం ముఖ్యకాలం, సకాలం. సూర్యుడస్తమించినప్పుడు మధ్యమం. నక్షత్రోదయం తర్వాత చేయడం అధమం. కానీ 'సకాలం' దాటిపోతే, ప్రాతః సంధ్యకులాగానే, 'ముఖ్యకాలాతిక్రమణ దోషపరిహారార్థం' అధికఅర్ఘ్యప్రదానం చేయాలి. 'మధ్యాహ్నసంధ్య' అంటే మధ్యాహ్నం 11 గంటల తరువాత నుండి సాయంత్రం లోపలచేయాలి.

**ప్ర) నదుల్లో, సముద్రాల్లో పవిత్రస్నానాలు చేసేటప్పుడు ఎలాంటి నియమాలు పాటించాలి?**

**జ)** నిద్రించిన వస్త్రాలతో నదిలో మునుగ రాదు. ముందు నదీదేవతను, క్షేత్రదేవతలను స్మరించి, సంకల్పం చెప్పుకొని స్నానం చేయాలి. పుణ్యనదులలో పాపపరిహారార్థంచేసే పవిత్రస్నానాలలో కచ్చితంగా నియమాలు పాటించాలి. నదిలో వస్త్రాల్ని పిండరాదు. సర్ఫ్ లాంటివి ఉపయోగించ రాదు. ఉతకరాదు. అభ్యంగన స్నానాలు చేయరాదు. (తలంటుకోవడంవంటివి కూడదు. ఇంక- షాంపూలు, కుంకుడులు వంటివి కూడదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.)

పొరపాటున కూడా నదిలోగానీ, నదీతీరాల్లోగానీ మలమూత్ర విసర్జనలు మహాపాపం. ఉమ్మరాదు. నీళ్లను పుక్కిలించి ఉమ్మడం కూడా దోషమే. అవాచ్యాలు, కసురుకోవడాలు వంటివి కూడా చేయరాదు. సముద్రాన్ని కేవలం పర్వసమయాల్లోనే తాకాలి. సాన్నం చేయాలి. మామూలు సమయాల్లో తాకడం కూడా కూడదు. నదులనీ, సముద్రాలనీ దేవతా స్వరూపాలుగా భావించి తగిన మర్యాదలతో ప్రవర్తించాలి. స్నానసమయంలో సంకల్పాదులు చెప్పుకోవాలి.

## 'శ్రీవాణి' టిక్కెట్ కౌంటర్ మార్పు

**తిరుపతి విమానాశ్రయంలోని శ్రీవాణి దర్శన టిక్కెట్ల జారీ కేంద్రాన్ని 16-12-2023 నుంచి తిరుమలలోని 'గోకులం విశ్రాంతి భవనం'లోకి మార్చారు. బోర్డింగ్ పాస్ సమర్పించి భక్తులు శ్రీవాణి దర్శన ఆఫ్‌లైన్ టిక్కెట్లు పొందచ్చు. దేశవిదేశాల నుంచి శ్రీవారి దర్శనానికి వచ్చే విమాన ప్రయాణికుల సౌకర్యార్థం ఈ కేంద్రం ఏర్పాటు చేశారు.**

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

కొండల్లో ఒక గుహ కనిపించగానే వానరులు ఆశ్చర్యపడ్డారు. గుహలో ఏముందోనని కుతూహలంతో ప్రవేశించారు. ఆ గుహ చాలపెద్దది. నిడుపైంది. అంతేకాదు గుహఅంతా చీకటిమయం. అయినా, వానరులు కుతూహలంతో ముందుకు సాగారు. ఆగుహలో ఒక దివ్య జ్యోతిని దర్శించారు. ఆ జ్యోతి దగ్గరికి వెళ్లాలని ముందుకు అడుగులు వేశారు.

ఆ గుహ సామాన్యమైన గుహకానే కాదు. గబ్బిలాలు, పాములు, సాలె గూళ్లకు ఆవాసంకానే కాదు. ఆ గుహలో బంగారుమయమైన, నవరత్న ఖచితమైన గోపురప్రాకారాలతోడి గోడలు కనిపించాయి. కవాటాలన్నీ వజ్రాలే. మంటపాలన్నీ వైడూర్య, మాణిక్య, మరకత మౌక్తికాలే. అలాంటివే, ఉన్నతభవనాలు. అక్కడ చిత్రవిచిత్ర భవన సముదాయాలు. ఎక్కడచూసినా పచ్చతోరణాలతో బంగారు రథాలే. ఏనుగులు, గుఱ్ఱాలు యథేచ్ఛగా తిరగగలిగే ఘంటాపథాలే! అక్కడ శ్రవ్య సంగీతం వినబడుతూ, నృత్యవిలాసాలు కనిపిస్తూ ఉన్నాయి. రకరకాల వాద్య ఘోషలు మోగుతూనే ఉన్నాయి. ఎక్కడ చూచినా సుందరీమణుల సందడులే. అంతేకాదు అక్కడ చతుర్భుజులు, గదాధరులు, శంఖచక్రపాణులే తచ్చాడుతున్నారు.

ఆ గుహ భూతలంలోని గుహలా కన్పించలేదు. విలక్షణంగా ఉంది. మహా ప్రకాశవంతంగా ఉంది. అలాంటి గుహ మధ్యభాగంలో ఒక 'విమానం'. అక్కడ వానరవీరులకు లక్ష్మీశ్వరుడు శేషశయన రూపంలో కన్పించాడు. ఆ స్వామి ఎదలో లక్ష్మి. ఆ స్వామి ఇరువైపుల భూదేవి, నీళలు. అంతేకాదు శంఖచక్రగదా పాణులు శ్వేతాంబరాలతో, శ్వేతపుష్ప మాలికలు అలంకరించుకున్నవారై స్వామిని సేవిస్తున్నారు.

ఇలాంటి దృశ్యం చూస్తున్న కపివీరులకు ఏమి చేయాలో తోచలేదు. ఈ వానరగుంపును చూచిన ఒక కాపలాదారుడు కపులను తరుముతూ వచ్చాడు. వానరులు వేత్రహస్తుని చూచి భయపడ్డారు. గుంపు చిందరవందర అయింది. అయినా వీరి ఆందోళనను గుర్తించిన ఒక వేత్రహస్తుడు దయతో గుహనుండి బయటికి వెళ్లే మార్గం కపులకు చూపాడు. కపివరులు 'బ్రతుకు దేవుడా' అంటు గుహ బహిర్భాగానికి వచ్చారు. కాసేపు, ఊపిరి పీల్చుకొన్నాక తమలో తాము గుహలోని విశేషాల గురించి మాట్లాడుకోవడం మొదలెట్టారు.

'శ్రీరామునితో పోరాడలేక రావణుడు భయంతో ఈ గుహలో మాయావేషంతో ఉన్నాడేమో' అని చెప్పిన వీరుడొకడు.

'కాదు కాదు. ఇది రావణమాయ కాదు. నిజంగా హరిమాయ' అని గద్దించి చెప్పిన వాడొకడు.

'అయినా, వ్యర్థాలాపమెందుకు! మనం ఈసారి గుహలోకి వెళ్లివద్దామని ఉపాయం సూచించిన' వాడొకడు.

'మనం మాత్రం పోవడమెందుకు? మన సహచరులతో అందరం వెళదామ'ని సూచించిన వాడొకడు.

'వానరమిత్రులార! మీరేదో కల గన్నట్టున్నారు, ఇదంతా భ్రమ' అన్నవారు కొందరు.

'కాదు కాదు మనం చూసిందల్లా ముమ్మాటికి నిజమే' అని గట్టిగా బదులిచ్చినవారు మరికొందరు.

ఇలా పరస్పరసంభాషణలతో వాదించుకుంటూ ఉంటే వారి ముందు 'గుహ' కనబడలేదు. అందరు నిశ్చేష్టులయ్యారు.

తదనంతరం వానరవీరులు శ్రీరామపద సన్నిధికి చేరుకున్నారు. ఆ స్వామితో తమ అనుభవాలను విశదంగా చెప్పారు.

వానరవీరుల అనుభవాలను ఆలకించిన శ్రీరాముల వారు చిరునవ్వుతో ఇలా అన్నారు.



'వానరవీరులారా! ఏ అంశంలోనైనా సత్యం తెలుసుకోవడానికి సమగ్రపరిశీలన, అన్వేషణ అవసరమే. కాదనను. కానీ, దేవతల జన్మలు, రాజుల పుట్టుకలు, నదుల ఉత్పత్తి స్థానాల గురించి తలో మాట అనరాదు. రమామనోహరుడు ఈ ప్రదేశంలో లేడనరాదు. హరిగిరి మహిమలు హరికే తెలుసు. దేవతలు కూడా ఆ మహిమలను పసిగట్టలేరు. ఈ వేంకటాచలమహిమలు అనంతం. వీటి అంతు తెలుసుకోవాలని ఆరాటపడడం సరికాదు అయినా ఒక్క అంశం చెబుతాను. వినండి. మీరు ధన్యులు. మీరు గుహలో మాధవుణ్ణి దర్శించారు. స్వామిదర్శనంతో మీరు ధన్యులయ్యారు' అని వానరుల సందేహం తీర్చాడు.

ఆ పై వేంకటాద్రిలో ఒకరోజు గడిపి వానరులతో దక్షిణపు దిక్కు పయనమై సముద్రతీరం చేరుకున్నాడు. వానరవీరుల సహాయంతో సముద్రంలో సేతువు నిర్మించాడు. సునాయాసంగా, కపివీరులతో సేతుమార్గాన లంకకు చేరుకున్నాడు. రాక్షసబలాన్ని కాకావికలు చేశాడు. కుంభకర్ణుని సంహరించాడు. జానకిని చెరబట్టిన రావణుణ్ణి చంపాడు. ఆ పై సీతమ్మను పరీక్షించి చేబట్టాడు. తనకు సాయం చేసిన విభీషణునికి లంకారాజ్యం అప్పగించాడు. లంకాధిపతిగా పట్టాభిషిక్తుని చేశాడు. సీతాలక్ష్మణులతో తనకు సాయపడిన వానరవీరులతో పుష్పకవిమానమెక్కి సాకేతపురం చేరుకున్నాడు. భరతశత్రుఘ్నులు భక్తితో సేవిస్తుంటే సాకేతంలో పట్టాభిషిక్తుడయ్యాడు.

తదనంతరం ప్రజలు సంతోషించేలా రామరాజ్యమనుకునే రీతిలో పాలన కొనసాగించాడని సూతుడు కథ ముగించాడు.

ఈ కథ అంతా విన్న శౌనకాదులు కుతూహలంతో 'పౌరాణిక మునీ' మాకొక చిన్న సంశయం. గుహలో వానరులు దర్శించిన దివ్యమంగళవిగ్రహుండెవడని ప్రశ్నించారు. అందుకు సమాధానంగా సూతుడు–

'మీ సంశయాన్ని నివృత్తి చేయడం నా ధర్మం చెబుతాను.

వైకుంఠాన్ని వదలిన శ్రీమన్నారాయణుడు వేంకటగిరి వాసుడే. అతడే గుహలో వానరులకు కనబడినవాడు. తాను వైకుంఠవాసుణ్ణే అని వానరవీరులకు అవగతం కావడంకోసం అలా సాక్షాత్కరించాడు. సామాన్యులకు ఈ విచిత్రం తెలియదు వైకుంఠమే గుహలో సహజంగా సాక్షాత్కరించింది కనుక ఈ గుహకు 'వైకుంఠగుహ' అని పేరు. ఈ గుహప్రభావం విన్న వారికి కలిదోషం అంటదు. పుత్రపౌత్రాభివృద్ధి కలగడం తథ్యం. అంతేకాదు వారు సహజమహైశ్వర్య సంపన్నులుగా మనుగడ సాగించి చివరకు మోక్షం అందుకొంటారని సూతుడు సవివరంగా చెప్పి మునులసందేహాన్ని పటాపంచలు చేశాడు.

*(ప్రథమాశ్వాసం సమాప్తం)*

*(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి

### :: 97 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మ | ద | 2 న | పం | చ | మి | | 3 శి | 4 వ | రా | 5 త్రి |
| ధు | | ల | | | | 6 హో | | ర్ష | | శం |
| మా | | 7 కూ | ర్మా | 8 వ | తా | ర | ము | | | కు |
| సం | | బ | | సం | | ము | | 9 శి | వు | డు |
| | 10 గ | రు | త్మం | తు | డు | | | శ | | |
| 11 వి | | డు | | డు | | 12 శ | రీ | ర | జు | డు |
| 13 జ | య | | 14 అ | | 15 హో | | | ఋ | | |
| య | | 16 మా | ఘ | మా | స | ము | | 17 తు | షి | 18 త |
| | 19 ఖ | | ము | | ము | | 20 కా | వు | | క్ష |
| 21 హ | రు | డు | | | | | ళిం | | | కు |
| | డు | | 22 చౌ | ల్లం | గి | | 23 ది | లీ | పు | డు |



# వివాహం ఆలస్యమౌతుంటే?

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

**జగత్కల్యాణదంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు నేటికీ నిత్య నూతన వధూవరులై దర్శనమిస్తున్న నిత్యకల్యాణపురం శ్రీనివాసమంగాపురం! ఈ నెల 29వ తేదీ నుండి ఈ ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉన్నాయి కనుక, ఈ ఆలయ విశేషాలు పాఠకులకోసం...**

- తిరుపతి నగరానికి పశ్చిమంగా పదిమైళ్ల దూరంలో ఉన్న క్షేత్రం శ్రీనివాసమంగాపురం.
- శ్రీనివాసుడు పద్మావతీదేవిని పరిణయమాడిన తర్వాత కొంతకాలం ఇక్కడే నివసించారు.
- ఇక్కడ అర్చామూర్తి "కల్యాణ వేంకటేశ్వరుడు".
- ఈ స్వామిని దర్శించి ప్రార్థించిన వారికి కల్యాణపరం పరలు సంప్రాప్తిస్తాయి.
- తిరుమలకొండ మీది శ్రీవేంకటేశ్వరుడు, శ్రీనివాసమంగా పురంలోని స్వామివారు ఇద్దరూ ఒకే సరళరేఖపై తూర్పు ముఖంగా వక్షఃస్థలలక్ష్మితో స్థానకమూర్తులు.
- తాళ్లపాక అన్నమయ్య మనమడు చిన్నన్న (చినతిరు వెంగళ నాథుడు) శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వ రాలయాన్ని జీర్ణోద్ధరణ చేశాడు.
- 11-07-1940 నాటినుండి ప్రతిఏటా ఆషాఢశుద్ధసప్తమి నాడు "సాక్షాత్కారవైభవం" పేరుతో శ్రీనివాసమంగాపురంలో ఒక్కరోజు ఉత్సవం జరిగేది. ఈ ఉత్సవాన్నే తి.తి.దేవస్థానం 1980 సం॥ నుంచి మూడురోజులపాటు నిర్వహిస్తోంది.
- 26-04-1967న ఈ ఆలయాన్ని తి.తి.దే. అనుబంధ ఆలయంగా స్వీకరించింది.
- 1970 సం॥లో శ్రీనివాసమంగాపుర ఆలయజీర్ణోద్ధరణ జరిగింది.
- 1980 సం॥లో ఈ ఆలయ రాజగోపురంపైన, విమాన గోపురంపైన బంగారుతాపడం చేసిన కలశాలు ప్రతిష్ఠింప బడ్డాయి.
- ఆలయప్రధాన ప్రవేశద్వారానికి రెండువైపులా తాళ్లపాక అన్నమాచార్యులు, ఆయన కుమారుడైన పెదతిరుమలా చార్యుల శిల్పాలు కన్పిస్తాయి.
- ఆలయప్రాంగణంలో నైరృతిమూలలో శ్రీవారి కల్యాణ మండపం ఉంది. ఇక్కడ ప్రతిరోజు కల్యాణ వేంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.
- ప్రతినెలా శ్రవణనక్షత్రం రోజున సాయంత్రం ఉభయదేవేరు లతో కూడి ఉన్న స్వామివారికి ఊంజల్‌సేవ జరుగుతుంది.
- ఇక్కడి స్వామివారు తిరుమలలో లాగే చతుర్భుజుడు.
- తాళ్లపాక వంశీయులు సమర్పించిన ఇక్కడి 'భోగశ్రీనివాస మూర్తి'కి ప్రతిరోజూ పవళింపుసేవ జరుగుతుంది.
- సుప్రసిద్ధ సినీపరిశోధకులు, సాహిత్యవిమర్శకులు శ్రీ వి.ఏ.కె.రంగారావు ప్రతి సంవత్సరం సాక్షాత్కార వైభవోత్సవంనాడు ఇక్కడ నృత్య నివేదన చేసేవారు.
- 09-04-2004 నుండి ఈ ఆలయంలో వైఖానస ఆగమ శాస్త్రానుసారంగా పూజలు జరుగుతున్నాయి.
- 2007 అక్టోబరు 28 నుండి నవంబరు 1వ తేదీ వరకు ఈ ఆలయ మహాసంప్రోక్షణ జరిగింది.

❖ **నిత్యసేవలు–** సుప్రభాతం, తోమాలసేవ, సహస్ర నామార్చన, నిత్యకల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఏకాంతసేవ.

❖ **వారోత్సవాలు–** (1)స్వర్ణపుష్పార్చన (2)శతకలశాభిషేకం (3)తిరుప్పావడసేవ (4)నేత్రదర్శనం (5)పూలంగిసేవ (6)అభిషేకం (7)వస్త్రాలంకారసేవ (8)గ్రామోత్సవం

❖ **వార్షికోత్సవాలు–** (1)ఉగాది ఆస్థానం (2)శ్రీరామనవమి (3)వసంతోత్సవం (4)సాక్షాత్కారవైభవం (5)ఆణివర ఆస్థానం (6)పవిత్రోత్సవాలు (7)ధనుర్మాసం (8)బ్రహ్మోత్సవాలు (9)పుష్పయాగం.

❖ ఇక్కడ కల్యాణోత్సవం తర్వాత ఇచ్చే శ్రీవారి కల్యాణకంకణాలను అవివాహితులు ధరిస్తే వాళ్లకు ఆలస్యంకాకుండా త్వరగా పెళ్లవుతుందని భక్తుల విశ్వాసం!

❖ ప్రతి సంవత్సరం మాఘమాసంలో ఇక్కడ స్వామివారికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

ఫిబ్రవరి, 7న
శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి జయంతి

# తెలుగుజాతి ఋణపడింది!

– డా॥ సంగీతం కేశవులు,
90146 57722

07–02–1888న శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి కృష్ణాజిల్లా, పెదకళ్లేపల్లి గ్రామంలో శేషమ్మ, సుందరశాస్త్రిగార్లకు జన్మించారు. మద్దూరి రామావధానులు, చల్లపల్లి విద్వాంసులు అద్దేపల్లి సోమనాథశాస్త్రిగార్ల వద్ద తెలుగు, సంస్కృత గ్రంథాలు, పతంజలి యోగసూత్రాలు అధ్యయనం చేశారు.

వేటూరి ప్రభాకరశాస్త్రి అనేక తెలుగుప్రక్రియలలో రచనలు, పరిశోధనలు చేసిన యోగీశ్వరుడు. తెలుగు సాహిత్యాన్ని ఒక యజ్ఞంగా, తపస్సుగా భావించి నిరంతరం పరిశ్రమించారు. ముఖ్యంగా అన్నమయ్య సంకీర్తనలను పరిష్కరించి భావితరాలకు అందించిన పరిశోధనాపరమేశ్వరులు ప్రభాకరశాస్త్రిగారు.

## వీరి సారస్వతకృషి

**గ్రంథపరిష్కరణలు:** మనుచరిత్ర, బసవపురాణం, క్రీడాభిరామం, సుగ్రీవ విజయం, హరవిలాసం, రంగనాథరామాయణం, అన్నమచార్యసంకీర్తనలు, అన్నమాచార్యచరిత్ర, శ్రీవేంకటేశ్వరవచనాలు మొదలగునవి.

**సంకలనాలు:** చాటుపద్యమణిమంజరి, ప్రబంధరత్నావళి, శ్రీవేంకటేశ్వర లఘుకృతులు.

**వచనకృతులు:** నీతినిధి (ఆంగ్లం నుండి పరివర్తన), తెలుగు మెఱుఁగులు (వ్యాససంపుటి), మీగడ తఱకలు (వ్యాససంపుటి), సింహావలోకనము (వ్యాససంపుటి). ప్రజ్ఞప్రభాకరం (స్వీయచరిత్ర).



**చరిత్ర రచనలు:** తంజావూరి ఆంధ్రరాజులచరిత్ర, శృంగార శ్రీనాథము, అన్నమాచార్యచరిత్ర.

**కథలు:** కామధేనువుకథ, కలికిచిలుకవంటి కథలు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1910 సం॥లో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలో లేఖకుడుగా చేరినప్పటి నుండి విస్తృతపరిశోధనలు చేశారు.

1916–1917 సం॥లో తంజావూరు, సరస్వతీ గ్రంథాలయ పుస్తకాలకు వివరణ రాయడానికి నియమింపబడ్డారు. 1937 సం॥ మద్రాసు రాజధాని కళాశాలలో కొన్ని నెలలపాటు పండితులుగా పదవీబాధ్యతలు స్వీకరించారు. 1940లో తిరుపతి వచ్చి శ్రీవేంకటేశ్వరప్రాచ్యకళాశాలలో ఆంధ్రశాఖకు అధ్యక్షులుగా వ్యవహరించారు. 1945, మార్చి 21 శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థలో రీడర్‌గా సేవలు అందించారు. శ్రీవేంకటేశ్వర మ్యూజియానికి తమ వంతు కృషి చేశారు. 29–08–1950న శ్రీశాస్త్రిగారు యోగసిద్ధి పొందారు.

వీరిపేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రాజెక్టు నెలకొల్పి వీరి సాహిత్యాన్ని భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తోంది. ప్రతి ఏటా వీరి జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ, నివాళులర్పిస్తోంది.

# జయ ఏకాదశి

- శ్రీ భక్తికా దేవిదాసి

మాఘమాసం శుక్లపక్షంలో వచ్చే జయఏకాదశీ లేదా భైమీ ఏకాదశిమహిమ శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంగా భవిష్యోత్తరపురాణంలో వర్ణింపబడింది.

ఒకసారి ధర్మరాజు శ్రీకృష్ణుని- మాఘశుక్లపక్షంలో వచ్చే ఏకాదశీమహిమను చెప్పవలసినదిగా కోరాడు. అందుకు ప్రత్యుత్తరంగా శ్రీకృష్ణుడు "రాజోత్తమా! ధర్మరాజా! మాఘశుక్ల పక్షంలో వచ్చే ఏకాదశి, జయఏకాదశియని సుప్రసిద్ధమైంది. ఈ ఏకాదశీ వ్రతపాలన ద్వారా సమస్తపాపాలు నశిస్తాయి. ఈ ఏకాదశిని పాటించేవాడు ఏనాడూ దెయ్యంగా మారడు. రాజా! ముక్తిని ప్రసాదించడంలో, పాపనాశనంలో ఈ ఏకాదశికి మించింది లేదు.

దేవతలందరు దేవేంద్రుని రాజ్యంలో సుఖంగా జీవిస్తున్నారు. అక్కడ నందనవనం పారిజాతపుష్పసౌరభంతో నిండి ఉండేది. అప్సరసలు అక్కడ స్వేచ్ఛగా విహరించేవారు. ఇంద్రుడు కూడ ఆ అప్సరసలతో కలిసి నందనవనంలో విహరించేవాడు. ఒకసారి ఇంద్రుడు నందవనంలో ఐదుకోట్ల అప్సరసలతో నృత్యోత్సవాన్ని ఏర్పాటు చేశాడు. చిత్రసేనుడనే గంధర్వుడు తన భార్య మాలినితోను, కుమార్తెతోను, పుష్పవనుడితోనూ పుత్రుడు అక్కడకు వచ్చాడు. పుష్పవనుడి పుత్రుడు మలయవానుడు. పుష్పవతి అనే గంధర్వి మలయవానుని సౌందర్యానికి ఆకర్షితురాలైంది. మన్మథబాణపీడితయైన పుష్పవతి మలయవానుని ఆకర్షించడానికి, లోబరచుకోవడానికి అనేక రకాలుగా యత్నించింది.

ఇంద్రుని ప్రీత్యర్థం మలయవానుడు, పుష్పవతి ఇతర అప్సరసలతో కలిసి నృత్యోత్సవంలో నృత్యం చేయడం మొదలు పెట్టారు. కాని పరస్పరాకర్షణ వల్ల మలయవానుడు, పుష్పవతి చక్కగా నృత్యం చేయలేక పోయారు. తత్ఫలితంగా నృత్యకార్యక్రమంసజావుగా సాగలేదు. మన్మథబాణపీడితులై వారిద్దరు ఓర చూపులతో ఒకరినొకరు చూచుకోసాగారు. నృత్య గాన కార్యక్రమంలో జరుగుతున్న అవకతవకలను గమనించిన ఇంద్రుడు వారి మానసికస్థితిని అర్థం చేసుకున్నాడు. కార్యక్రమంలో నిరంతరం కలిగిన అంతరాయానికి అవమానితుడైన ఇంద్రుడు వారిని తీవ్రంగా శపించాడు; "మూర్ఖులు, పాపులు అయిన మీరిద్దరు నా ఆజ్ఞను ఉల్లంఘించిన కారణంగా స్త్రీ, పురుషదెయ్యాలుగా మారి భూలోకంలో మీ కర్మఫలాన్ని అనుభవించండి".

ఆ రీతిగా శపించబడ్డ మలయవానుడు, పుష్పవతి పిశాచాలుగా మారి హిమాలయపర్వతగుహలో ఘోరమైన జీవితాన్ని గడపడం మొదలుపెట్టారు. దెయ్యాలుగా మారిన వారికి తీవ్రమైన దుఃఖం, శోకం కలిగాయి. శాపకారణంగా వారికి సుఖం, నిద్ర కొరవడ్డాయి. హిమాలయప్రాంతంలోని దట్టమైన అరణ్యాలలో తిరుగుతూ ఒకసారి వారు ఒకచోట కూర్చొని బాధపడసాగారు. అపుడు పురుషదెయ్యం స్త్రీదెయ్యంతో "ఇంతటి ఘోరమైన పిశాచరూపాలు రావడానికి మనమెంతటి



ఘోరమైన పాపాలు చేశామో కదా” అని అంది. తీవ్రమైన దుఃఖంతో ఆ దెయ్యాలు పశ్చాత్తాపసాగరంలో మునిగి పోయాయి. దెయ్యాలరూపాలలో ఉన్న మలయవానుడు, పుష్పవతి ఆ రోజంతా పశ్చాత్తాపపడుతూ ఎలాంటి ఆహారం తీసుకోలేదు. అనుకోకుండా ఆ రోజు జయ ఏకాదశి అయింది. ఆకలిదప్పులతో పీడింపబడినప్పటికీ వారు ఏ జీవినీ ఆ రోజు చంపలేదు. కందమూలాలు గానీ, జలం గాని వారు తీసు కోలేదు. ఆ రీతిగా ఆ దెయ్యం జంట ఒక అశ్వత్థ వృక్షం క్రింద కూర్చొని ఉండగా సూర్యాస్తమయం అయింది. వణికే చలిలో, తీవ్రమైన ఆలోచనలతో వారు రాత్రంతా నిద్రలేకుండానే గడిపారు. మానసిక కలతవల్ల వారి హృదయాలలో ఇంద్రియ భోగభావనే కలుగలేదు.

ఆ విధంగా అనుకోకుండానే వారు జయ ఏకాదశీ వ్రతాన్ని చేయడం జరిగింది. వ్రతపాలన ప్రభావంగా మర్నాడే వారు దెయ్యాలరూపం నుండి ముక్తిని పొందారు. పుష్పవతి, మలయవానుడు ఇద్దరూ తిరిగి తమ రూపాలను పొంది విమా నాలలో స్వర్గలోకానికి వెళ్ళి దేవరాజైన ఇంద్రునికి అభివాదం చేశారు. అది చూచి ఆశ్చర్యపడిన ఇంద్రుడు వారితో “ఎంత అద్భుతం! ఏ పుణ్యప్రభావం వల్ల మీకు దెయ్యాల రూపం పోయింది? ఏ దైవం మీకు నా శాపం నుండి ముక్తిని ప్రసాదించాడు?” అని అన్నాడు. దానికి సమాధానంగా మలయ వానుడు ఇంద్రునితో “దేవదేవుని నిర్హేతుక కరుణ వల్ల, ఆతనికి పరమప్రియమైన జయ ఏకాదశీ వ్రతపాలన వల్ల మేము శాపవిముక్తుల మయ్యాం. ప్రభూ! కేవలం భక్తిప్రభావం వలననే మేము దెయ్యాలరూపంనుండి ముక్తులమయ్యామని పూర్ణ విశ్వాసంతో చెబుతున్నాను” అని అన్నాడు.

ఈ మాటలను విన్న దేవేంద్రుడు మలయవానునితో “ఏకాదశిని పాటించడం ద్వారా, విష్ణుపూజను చేసిన కారణం గానే మీరు పవిత్రులయ్యారు. కాబట్టి మీరు నాకు కూడ పూజ నీయులు. విష్ణువును పూజించేవారు నిశ్చయంగా పూజనీయులు, నాకు ఆదరణీయులు” అని అన్నాడు. తరువాత మలయవానుడు పుష్పవతి, స్వర్గంలో సుఖంగా జీవించారు.

ఈ ఏకాదశీవ్రతాన్ని ప్రతియొక్కరు పాటించాలి. జయ ఏకాదశి వ్రతపాలనం బ్రహ్మహత్యాపాతకాన్నైనా పరిహరిస్తుంది. దానం, యజ్ఞం, తీర్థాటనం వలన కలిగే పుణ్యం ఈ వ్రత పాలనచే అప్రయత్నంగానే లభిస్తుంది. ఈ ఏకాదశీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేసేవాడు వైకుంఠంలో శాశ్వతంగా నివసిస్తాడు.

ఈ ఏకాదశి మహిమను చదవడం, వినడంద్వారా మనిషి అగ్నిష్టోమ యాగఫలాన్ని పొందుతాడు.

## కుమారధారా మాహాత్మ్యం

**శ్రీవేంకటాచలంలో కుమారధారాతీర్థమనే లోకపావనియైన సరస్సు ఉంది. అక్కడ పార్వతీపుత్రుడు, అగ్నిసంభవుడైన కుమారస్వామి దేవసేనతో కూడి శ్రీనివాసుని అర్చిస్తున్నాడు. మాఘమాసంలో సూర్యుడు కుంభరాశిలో ఉండగా మఖా నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు మధ్యాహ్నసమయంలో నిర్మలమైన ఆ పవిత్రతీర్థంలో స్నానం చేసేవారికి గొప్ప పుణ్యం లభిస్తుంది. పన్నెండు సంవత్సరాలు గంగాది సర్వ తీర్థాలలో నియమంగా స్నానమాచరించే వారికి వచ్చే ఫలితాన్ని ఈ తీర్థస్నానం వలన పొందుతారు. ఈ తీర్థ తీరంలో తమ శక్తిననుసరించి విప్రులకు దక్షిణతో పాటు భోజనం పెట్టినవారికి ఈ తీర్థస్నానఫలం లభిస్తుంది.**



**కుమారధారా తీర్థమహాత్మ్యం వరాహ, పద్మ, వామన, మార్కండేయ పురాణాలలో చెప్పబడింది. శ్రీవేంకటేశ్వర సహస్రనామస్తోత్రంలో ఈ తీర్థం ప్రస్తా వించబడింది. శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామ స్తోత్రంలో కూడా ఈ తీర్థప్రస్తావన ఉంది.**

*– డా॥విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి*

# సూర్యుడి తొలికిరణాలలో ఈ స్వామిని చూస్తే...

– శ్రీమతి రమా శాండిల్య,
96187 66600

కర్ణాటకలోని, చిక్‌మంగుళూరు తాలూకాలోని, బెలవాడి అనే గ్రామంలోని, 'త్రికుటాచలం' గా పేరుగాంచిన శ్రీభూదేవి సమేత వీరనారాయణస్వామి ఆలయం గురించి తెలుసుకుందాము.

ఈ ఆలయాన్ని త్రికుటాచలం అనటానికి కారణం తూర్పుముఖంగా 'వీరనారాయణస్వామి' ఆలయం, ఉత్తర ముఖంగా 'వేణుగోపాలస్వామి' ఆలయం, దక్షిణముఖంగా 'యోగనారసింహ స్వామి' ఆలయం కొలువై ఉన్నాయి. త్రికోణా కారంగా ఉన్న శిఖరాలతో, మూడు అందమైన గాలిగోపురాలతో, చాలా అందమైన శిల్పకళతో అలరారుతోంది. త్రికోణరూపంగా ఉన్న మూడు వైష్ణవాలయాలు ఒకేచోట ఉన్న ఆలయం. కనుక, త్రికుటాచలంగా ఈ ఆలయం ప్రసిద్ధి గాంచింది.

ఈ ఆలయంలో ముఖ్యవిశేషం– సంవత్సరానికి ఒకసారి మార్చి ఇరవై మూడవతేదీన, సరిగ్గా సూర్యోదయం సమయంలో ఈ వీరనారాయణస్వామి పైన సూర్యుని తొలి (ప్రథమ)కిరణాలు స్వామి పైన పడి, సూర్యోదయంలో వీర నారాయణుడు, ప్రత్యక్షనారాయణుడిగా దర్శనమిస్తాడు. ఈ ఆలయద్వారం తూర్పు ముఖంగా ఉంటుంది.

ఆయన మీద సూర్యోదయపు మొదటి కిరణాలు పడి నప్పుడు మొదట స్వామి చేతివేళ్ల గోళ్లమీద, ఊదారంగులో పడిన ఆ తొలి కిరణాలు స్వామి శరీరమంతా తడిమి సప్త రంగులు సంతరించుకుంటాయి. ఈ అనుభవాన్ని చూసిన వారందరూ కూడా ఒక అలౌకిక అనుభూతిని పొందుతారు.

ఈ స్వామి మూర్తిని పదకొండవ శతాబ్దంలో, గండకీ నదినుంచి తీసుకువచ్చిన సాలిగ్రామంగా చెబుతారు.

ఈ స్వామి అందం వర్ణించటం మనతరం కాదు. స్వామి తన నాలుగు హస్తాలలో ఒక చేతిలో కమలం, రెండో హస్తంలో గద, మూడవహస్తంలో అభయ, వీరముద్రలు, నాలుగవహస్తంలో వ్యాఘ్రముద్రతోను దర్శనమిస్తాడు.

ఆ సూర్యకిరణాలు ఆలయంలో ఉన్న ఏడూ వాకిళ్లు దాటి, 108 స్తంభాలను దాటి స్వామి శరీరాన్ని ఆ ప్రత్యూష కిరణాలతో అభిషేకిస్తాయి.

## 2) వేణుగోపాలస్వామి ఆలయం

ఈ వేణుగోపాలుడు, ప్రపంచంలోనే అత్యంత సుందర మూర్తి అని ప్రపంచ యునెస్కో హెరిటేజ్ సంస్థవారు ఆర్కియా లజీ విభాగంవారు గుర్తించారు.

ఈ వేణుగోపాలస్వామిమూర్తి కూడా గండకీనది నుంచి తీసుకువచ్చిన సాలిగ్రామంతో మలచిన మూర్తి. హోయసల రాజుల శ్రీకృష్ణభక్తికి ఈ వేణుగోపాలస్వామి మూర్తిని











ప్రత్యక్షసాక్ష్యంగా చెప్పుకోవచ్చును. కల్ప వృక్షం క్రింద, దశావతార మకరతోరణంతో, అత్యంత సుందరమూర్తిగా ఈ స్వామి దర్శన మిస్తుంటాడు.

ఈ స్వామి సన్నిధిలో ఉండి దర్శించుకునే సమయంలో ఆ మూర్తి మనలోకి చూస్తున్నట్లు చెక్కిన ఆ శిల్పుల కళాచాతుర్యత దర్శించినవారికే అవగతమౌతుంది.

### 3) యోగనారసింహస్వామి ఆలయం

ఈ స్వామిమూర్తిని కూడా గండకీనదినుంచి తీసుకు వచ్చిన సాలిగ్రామంతో తయారు చేశారు. మొదట అతిక్రోధంతో ఇక్కడకు వచ్చిన నారసింహుడు తపస్సు చేసి శాంతి పొందినట్లు చెబుతారు. అందుకే ఇక్కడి విగ్రహ మూర్తి, యోగముద్రతో శాంతస్వరూపుడిగా భక్తు లకు దర్శనమిస్తాడు.

ఇది, 'హొయసల' రాజులకాలంలో అమరశిల్పి జక్కన కుమారుడు కట్టిన ఆలయం... వీలైతే ఒకసారి దర్శిస్తే మన జన్మధన్యమౌతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. అత్యంత సుందరమైన, శ్రీవైష్ణవాలయమిది.

## శ్రీకృష్ణామృతం..

కారుణ్య కమలాక్ష నీ
నీ కృపయున్న నరునికి కలికష్టముండదు
నీ కరుణే కవచమై వారల రక్షించు

కారడవి జగతిలో కష్టాల కడగండ్లు
కనుచూపుమేరల్లో కనపడని మార్గములు
కాటుకచీకటిలో భయముతో భ్రమియించ
నీ కరుణాకాంతులే వారల నడిపించు

కర్మల ఫలములే కఠినంపు శిల లవగా
మితిలేని భారమై భక్తుల బాధింప
ఆర్తితో వారలు నీ పేరు జపియింప
నీ కృపయే కూర్మమై భారమ్ము వహియించు

కనకంబు, కాంక్షలే కందూతి కలిగించ
క్షణమైన ఆగక శ్రమియించు జనులకు
నీ కరుణావీక్షణే స్వాంతన కలిగించు
క్షణికమౌ సుఖముపై మోహములు తొలగించు

కలకాలమూ కంజలోచనుని ధ్యానమ్ము
కలయందు ఇలయందు గిరిధరుని నామమ్ము
కైవల్యమీవయ్య కృష్ణయ్య వినవయ్య!
నీ కరుణే కాంక్షించు అనంతగీతికలు!!



–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,
99103 45794

# భగవంతుడే రప్పించుకున్నాడు

- శ్రీమతి నల్లాని రాజేశ్వరి,
99086 02443

పదకవితాపితామహుడైన తాళ్లపాక అన్నమాచార్యులు తన కాలంనాటివరకు శ్రీవారిని సేవించిన భక్తుల చరిత్రలు తెలుసుకుని తన సంకీర్తనలలో ఘనంగా కీర్తించినవాడు. అన్న మయ్య సంకీర్తనలలో సుప్రసిద్ధమైన 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు' సంకీర్తనలో వైష్ణవాచార్యులైన అనంతాళ్వాన్, తిరుమల నంబిలాంటి వారితో సమానంగా –

'కంచి లోననుండ తిరుక్కచ్చి నంబిమీద కరుణించి తన యెడకు రప్పించినవాడు'

– అని తిరుక్కచ్చి నంబిని కొనియాడాడు.

శ్రీవైష్ణవులకు శ్రీరంగం తరువాత కాంచీపురం సుప్రసిద్ధ దర్శనీయక్షేత్రం. పౌరాణికంగా, చారిత్రకంగా సుప్రసిద్ధ క్షేత్ర మిది. శిల్పకళలకు, గీర్వాణవిద్యకు, శైవ, వైష్ణవమతాలకు కేంద్రమైన నగరరాజం. స్థూలంగా ఈనాటి ప్రజలు శివకంచి, విష్ణుకంచి అనడం తెలిసిందే. విష్ణుకంచి వైష్ణవాలయాలకు నిలయం. ఈ క్షేత్రప్రాంతంలో 17 దివ్యదేశాలున్నాయి. వాటిలో సుప్రసిద్ధమైంది శ్రీవరదరాజస్వామిఆలయం. హస్తిగిరిమీద నిలిచి భక్తులను కటాక్షించే దివ్యాలంకారశోభిత మంగళమూర్తి. ఈ కాంచీపురస్వామిని సేవించి ఆ తరువాత శ్రీరంగం తరలిన ఆచార్యులు భగవద్రామానుజాచార్యులు.

సౌమ్యనామ సంవత్సరం తమిళమాసం మాసినెలలో మృగశీర్షానక్షత్రంలో చెన్నపట్టణానికి దగ్గర 'పూనమల్లి'లో 'గజేంద్రదాస' అంశంతో తిరుక్కచ్చినంబి జన్మించారని వైష్ణవ పరంపర విశ్వసిస్తున్నది. అంతేకాదు ఈ నంబి తిరుమళిశై ఆళ్వార్ వరానుగ్రహంతో జన్మించాడని తండ్రి తన కుమారునికి 'భార్గవప్రియ' అని నామకరణం చేశారని ప్రసిద్ధం. అంతేకాదు యామునాచార్యులకు తిరుక్కచ్చినంబి పరమశిష్యులు. కాంచీపుర నివాసం వల్ల ఈ వైష్ణవాచార్యులకు కాంచిముని. కాంచీపూర్ణ అని నామాంతరాలు. యామునాచార్యులు తన శిష్యుడైన 'తిరుక్కచ్చినంబి'కి 'పేరరులాల' దాసర్ అని పేరిడినట్లు ఐతిహ్యం.

శ్రీవైష్ణవంలో 'కైంకర్యానికి' ఎంతో ప్రాధాన్యం. స్వామికి చేసే షోడశోపచారాలలో 'వింజామర' సేవను తిరుక్కచ్చినంబి చేసేవారట. ఈ కైంకర్యం వల్ల స్వామికి దగ్గరయ్యారు. వరద రాజస్వామి తిరుక్కచ్చినంబితో సంభాషించేవారని ప్రసిద్ధి.

రామానుజులవారిని కాంచీపూర్ణులవారి దగ్గరికి వెళ్ల మని ఆదేశించినవారు. కాంతిమతి. తల్లి ఆనతిమేరకు రామానుజులవారు కాంచీపూర్ణులను కలుసుకొన్నారు. కాంచీ పూర్ణులు దేవాధిదేవునకు తోయకైంకర్యం చేయవలసిందిగా రామానుజులకు ఆనతిచ్చారు. అలాగే తోయకైంకర్యం కొనసాగిస్తున్న శ్రీరామానుజాచార్యులు తనకు కలిగిన సందేహాలను తీర్చమని కోరగా వారు హస్తిగిరివరదుని అడిగి చెబుతానని భరోసా ఇచ్చారు.

వైష్ణవోత్తములైన కాంచీపూర్ణులు రాత్రివేళ తాళవృంతంతో సేవిస్తూ రామానుజుల సందేహాలను మనవి చేశారు. అపుడా స్వామి –

'అహమేవ పరబ్రహ్మ జగత్కారణ కారణమ్' అని మొదలుపెట్టి

'పూర్వాచార్యం మహాత్మానాం సమాశ్రయ గుణాశ్రయమ్' అని ముగించారట. కాంచీపూర్ణులు రామానుజుల దగ్గరికు వెళ్లి స్వామి చెప్పిన ఆరు సమాధానాలను తెలియజేయడంతో నా సంశయం తీరిందని పరవశించినారట. ఆరు ప్రశ్నలలో వైష్ణవసిద్ధాంతాల సంగ్రహీకరణ ద్యోతకమౌతుంది.

స్వామి సెలవిచ్చిన విశిష్ట సమాధానాలు –

1) జగత్కారణమైన పరబ్రహ్మను నేనే.
2) ఇతరులు ఎవ్వరుకారు.
3) శరీరానికి శరీరికి తప్పక భేదం ఉంది.
4) ముముక్షువులకు ప్రపత్తిని మించిన మోక్షోపాయం మరోటి లేదు.
5) నా భక్తులకు అంతిమస్మృతితో నిమిత్తం లేదు.
6) నా భక్తులైనవారికి దేహావసాన సమయంలో మాత్రమే నేను పరమపదం ప్రసాదిస్తాను.

మహాత్ములైన మహాపూర్ణులను గురువుగా ఆశ్రయింపుము. ఆపై రామానుజాచార్యులు మహాపూర్ణుల దర్శనార్థం కదలినారు.

వరదరాజస్వామికి సన్నిహితులైన తిరుక్కచ్చి నంబి తనకు మోక్షం ప్రసాదించమని కోరితే ఆ స్వామి ఒక ఆచార్యులకు శిష్యులయ్యాక మోక్ష మన్నారట. ఈ ఆదేశంతో తిరుక్కచ్చినంబి తిరుకోట్టి యూర్‌కు వెళ్లి వారింట సేవలు చేసి తదనంతరం ముక్తి పొందారని పరంపర తెలియజేస్తోంది.

తిరుక్కచ్చినంబి 'దేవరాజ అష్టకమ్' పేరుతో ఒక లఘుకృతిని సంతరించారు. తిరుమళిశై ఆళ్వార్ రచనకు తనియన్ వ్రాశారట.

సుమారు 91 సంవత్సరాలు జీవించిన తిరుక్కచ్చినంబి తిరుమలలో శ్రీవారిని కొంతకాలం సేవించినవారే. అన్నమయ్య పరమభక్తాగ్రేసరుడైన 'నంబిని' చూడడానికి తానే రప్పించుకొన్నాడనడం ఆశ్చర్యం కలిగించే అంశం. స్వామి కురువరతి నంబిని, రంగదాసును అలాగే తిరుక్కచ్చినంబిని అనుగ్రహించడం స్వామి నిర్హేతుక దయావీక్షణమనక తప్పదు.






## శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, తిరుపతి

**2024, ఫిబ్రవరి 29 నుండి మార్చి 10 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 29-02-2024 | గురు | -- | మూషికవాహనంపై వినాయకస్వామి, అంకురార్పణం |
| 01-03-2024 | శుక్ర | (పల్లకీఉత్సవం) ధ్వజారోహణం | హంసవాహనం |
| 02-03-2024 | శని | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 03-03-2024 | ఆది | భూతవాహనం | సింహవాహనం |
| 04-03-2024 | సోమ | మకరవాహనం | శేషవాహనం |
| 05-03-2024 | మంగళ | తిరుచ్చిఉత్సవం | అధికార నందివాహనం |
| 06-03-2024 | బుధ | వ్యాఘ్రవాహనం | గజవాహనం |
| 07-03-2024 | గురు | కల్పవృక్షవాహనం | అశ్వవాహనం |
| 08-03-2024 | శుక్ర | రథోత్సవం | నందివాహనం (మహాశివరాత్రి) |
| 09-03-2024 | శని | పురుషామృగవాహనం | కల్యాణోత్సవం, తిరుచ్చిఉత్సవం |
| 10-03-2024 | ఆది | సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి త్రిశూలస్నానం | ధ్వజావరోహణం, రావణాసురవాహనం |

108 దివ్యదేశాలు

# తిరుఇందళూర్

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

పంచరంగం అని ప్రసిద్ధి చెందిన ఐదు క్షేత్రాలలో ఇదొకటి. ఈ క్షేత్రం తమిళనాడులో మాయవరం పట్టణంలో వెలసి ఉంది. మూడుప్రాకారాలతో, ఐదు అంతస్తులతో, అద్భుతమైన రాజ గోపురంతో, కావేరీనదీతీరంలో శోభాయమానంగా ఈ క్షేత్రం విరాజిల్లుతోంది. ఈ క్షేత్రాన్నే సుగంధవనం, పంచరంగం, పరిమళరంగం, ఇందుపురి అని కూడా పిలుస్తారు. ఈ దివ్యదేశంలో స్వామి పరిమళ రంగనాథుడుగా తూర్పుదిక్కును చూస్తూ చతుర్భుజాలతో, శంఖచక్రాదులతో దర్శనమిస్తాడు.

అలాగే మూలమూర్తి శిరస్సు సమీపంలో కావేరి నదీమతల్లి, పాదాలదగ్గర గంగామాత కూర్చున్న భంగిమలో దర్శనమిస్తారు. మూలవర్లసన్నిధికి ఎడమభాగంలో చంద్రుడు పడమర దిక్కును చూస్తూ, సూర్యుడు దక్షిణదిక్కును చూస్తూ భగవంతుడికి పరివారదేవతలుగా కైంకర్యం చేస్తున్నారు.

**స్వామివారు**

- **మూలవరులు** : పరిమళ రంగనాథుడు
- **ఉత్తరమూర్తులు** : సుగంధవన నాథుడు

**అమ్మవారు**

- **మూలవరులు** : చంద్రశాపవిమోచన నాచ్చియార్
- **ఉత్సవమూర్తులు** : పరిమళ రంగనాయకి

**పుష్కరిణి** : ఇందు పుష్కరిణి
**విమానం** : వేదామోద విమానం
**ప్రత్యక్షం** : చంద్రునికి
**క్షేత్రం** : పంచరంగక్షేత్రం
**ముఖస్థితి** : శయనం
**మంగళాశాసనం** : తిరుమంగై ఆళ్వారు (11)
**ఉత్సవాలు** : పంగుని మాసంలో 11రోజులపాటు బ్రహ్మోత్సవం.

## స్థలపురాణాలు

1) దక్షునిపుత్రికలు 27మందిని చంద్రుడు వివాహం చేసుకున్నాడు. కానీ, చంద్రుడు మాత్రం ఒక్క రోహిణియందే బద్ధానురాగుడై ఉండడం చూచి తక్కినవారు ఈ విషయాన్ని తండ్రి దృష్టికి తీసుకువెళ్లారు. దక్షుడు చంద్రుని "క్షయగ్రస్తుడవై క్షీణింతువు గాక!" అని శపించాడు. చంద్రుడు ఈ క్షేత్రానికి వచ్చి శ్రీమహావిష్ణువును గూర్చి తపస్సు చేశాడు. శ్రీమహావిష్ణువు ఎవరు చేసినా తప్పు తప్పేనని, శాపఫలం అనుభవించి తీరాల్సిందేనని చెప్పి, శాపాన్ని కొంత సవరించాడు. మాసంలో పదిహేనురోజులపాటు వృద్ధి, పదిహేనురోజులపాటు క్షయాన్ని పొందేటట్లు వరమిచ్చాడు. అంతట చంద్రుడు ఈ దివ్యదేశంలో ఒక పుష్కరిణి నిర్మించి, అందులో స్నానంచేసి, పరిమళ రంగనాథుణ్ణి, పరమళరంగనాయకిని అనునిత్యం సేవిస్తూ వారి అనుగ్రహంతో యథాస్థితి పొందాడు. చంద్రునికి శాపవిమోచనం కలిగిన క్షేత్రం కనుక ఈ క్షేత్రం ఇందలూరు అయింది.

(2) బ్రహ్మదేవుడి దగ్గరున్న వేదాలను రాక్షసులు అపహరిస్తే, శ్రీహరి, ఆ రాక్షసుల్ని సంహరించి, వేదాలను తెచ్చి తిరిగి బ్రహ్మదేవుడికిచ్చాడు. వేదాలు కొంతకాలం రాక్షసుల దగ్గర ఉన్న కారణంగా దుర్గంధభరితంగా ఉన్నాయి. ఆ







వాసనను పోగొట్టడానికి ఈ సుగంధారణ్యక్షేత్రానికి వచ్చి తపస్సు చేశాడు. నారాయణుడు మెచ్చి నిత్యం సుగంధాలను విరజిమ్మే టట్లు అనుగ్రహించాడు.

(3)దక్షిణదిక్కులో ఆనందంగా, అద్భుతంగా ప్రవహించే కావేరినదిని భగవంతుడు అనుగ్రహించాడు. గంగా నదికన్నా తనకే ఎక్కువ ప్రాశస్త్యం కావాలని కావేరినది కోరగా పరిమళ రంగనాథుడు "నీవు ఎక్కడెక్కడ ప్రవహిస్తావో అక్కడక్కడ నేను ఉంటాను" అని ఈ దివ్యక్షేత్రంలో విలసిల్లాడు. తులామాసంలో విష్వక్సేనుడు భగవంతుని ప్రతినిధిగా కావేరినదికి వేంచేసి ఆ నదిని అనుగ్రహిస్తాడు. మిగతా పదిరోజులు రంగనాథుడు ఒక్కోరోజు ఒక్కో అలంకారాన్ని ధరించి నాలుగు మాడవీథులలో వేంచేసి కావేరినదిని అనుగ్రహిస్తాడు. పవిత్ర గంగానది పాపాత్ములను కూడా తనలో స్నానం చేయిస్తుంది. కనుక ఆమెకు పవిత్రతను ప్రాప్తింపచేయడానికి భగవంతుడు "ముప్పైరోజుల పాటు నీవు తులామాసంలో ఈ దివ్యదేశంలోని కావేరీనదితో కలిస్తే నీ పాపమంతా తొలగిపోతుందని" చెప్పాడు. అందువల్ల గంగామాత ఈ క్షేత్రంలో కావేరీనదితో కలిసి పవిత్రురాలవు తోందని కథనం. పరిమళరంగనాథుణ్ణి సేవించినవారికి సకల సౌభాగ్యాలు కలుగుతాయి. మనసులోని మాలిన్యాలన్నీ తొలగి పవిత్రులై ఇహపరసౌఖ్యాలు పొందుతారు.



## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు,
### శ్రీనివాసమంగాపురం

**2024, ఫిబ్రవరి 28 నుండి మార్చి 8 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 28-02-2024 | బుధ | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 29-02-2024 | గురు | తిరుచ్చి ఉత్సవం,ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 01-03-2024 | శుక్ర | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 02-03-2024 | శని | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 03-03-2024 | ఆది | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 04-03-2024 | సోమ | పల్లకీలో మోహినీఅవతారం | గరుడవాహనం |
| 05-03-2024 | మంగళ | హనుమద్వాహనం | స్వా॥వసంతోత్సవం,గజవాహనం |
| 06-03-2024 | బుధ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 07-03-2024 | గురు | రథోత్సవం | అశ్వవాహనం |
| 08-03-2024 | శుక్ర | పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

# సూర్యాష్టకం



ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే॥

సప్తాశ్వరథ మారూఢం ప్రచండం కశ్యపాత్మజమ్
శ్వేత పద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

లోహితం రథమారూఢం సర్వలోకపితామహమ్
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

త్రైగుణ్యం చ మహాశూరం బ్రహ్మావిష్ణు మహేశ్వరమ్
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

బృంహితం తేజసాం పుంజం వాయు రాకాశమేవ చ
ప్రభుంస్త్వం సర్వలోకానాం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

బంధూకపుష్పసంకాశం హారకుండల భూషితమ్
ఏకచక్రధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

విశ్వేశం విశ్వకర్తారం మహాతేజఃప్రదీపనమ్
మహా పాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

శ్రీవిష్ణుం సూర్యం జగతాం నాథం జ్ఞాన విజ్ఞాన మోక్షదమ్
మహా పాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

సూర్యాష్టకం పఠేన్నిత్యం గ్రహపీడా ప్రణాశనమ్
అపుత్రో లభతే పుత్రం దరిద్రో ధనవాన్ భవేత్॥

ఆమిషం మధుపానం చ యః కరోతి రవేర్దినే
సప్త జన్మ భవేద్రోగీ జన్మ జన్మ దరిద్రతా॥

స్త్రీ తైల మధు మాంసాని యేత్యజంతి రవేర్దినే
నవ్యాధిశోక దారిద్ర్యం సూర్యలోకం చ గచ్ఛతి॥

*ఇది శివుడు బోధించిన సూర్యాష్టకం. సూర్యుడే విశ్వకర్త అని ఈ స్తోత్రం ప్రతిపాదిస్తోంది. సూర్యునికి ఎదురుగా నిలిచి, ప్రతి ఉదయవేళలోనూ సూర్యాభిముఖంగా ఈ స్తోత్రాన్ని పఠించాలి. ఈ స్తోత్ర పఠనంతో గ్రహపీడలు వదిలిపోతాయి. ఐశ్వర్యం, సంతానం సమకూరుతాయి. వ్యాధులు తగ్గుతాయి. శోకాలు పోతాయి. ముఖ్యంగా ఆదివారంనాడు నియమనిష్ఠలు పాటిస్తూ ఈ స్తోత్రంతో సూర్యుణ్ణి ప్రార్థిస్తే సమస్తమూ లభిస్తుంది.*

# ఆదిత్యహృదయం

## ధ్యానమ్

నమస్సవిత్రే జగదేకచక్షుషే జగత్ప్రసూతి-స్థితి-నాశ-హేతవే ।
త్రయీమయాయ త్రిగుణాత్మధారిణే విరించి-నారాయణ-శంకరాత్మనే ॥

## శ్లోకం

తతో యుద్ధపరిశ్రాంతం సమరే చింతయా స్థితమ్ ।
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్ ॥ 1

దేవతైశ్చ సమాగమ్య ద్రష్టు మభ్యాగతో రణమ్ ।
ఉపాగమ్యా బ్రవీ ద్రామ మగస్త్యో భగవాన్ ఋషిః ॥ 2

రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనమ్ ।
యేన సర్వానరీన్ వత్స సమరే విజయిష్యసి ॥ 3

ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రువినాశనమ్ ।
జయావహం జపేన్నిత్య మక్షయ్యం పరమం శివమ్ ॥ 4



సర్వమంగలమాంగల్యం సర్వపాపప్రణాశనమ్ ।
చింతాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్ ॥ 5

రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్ ।
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్ ॥ 6

సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః ।
ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః ॥ 7

ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః ।
మహేంద్రో ధనదః కాలో యమః సోమో హ్యపాంపతిః ॥ 8

పితరో వసవః సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః ।
వాయుర్వహ్నిః ప్రజాఃప్రాణ(ప్రజాప్రాణ) ఋతుకర్తా ప్రభాకరః ॥ 9

ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్ ।
సువర్ణసదృశో భానుః స్వర్ణరేతా దివాకరః ॥ 10

హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తిర్మరీచిమాన్ ।
తిమిరోన్మథనః శంభుస్త్వష్టా మార్తాండ అంశుమాన్ ॥ 11

హిరణ్యగర్భః శిశిరస్తపనోఽ భాస్కరో రవిః ।
అగ్నిగర్భోఽ దితేః పుత్రః శంఖః శిశిరనాశనః ॥ 12

వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః ।
ఘనవృష్టి రపాంమిత్రో వింధ్యవీథీప్లవంగమః ॥ 13

ఆతపీ మండలీ మృత్యుః పింగలః సర్వతాపనః ।
కవి ర్విశ్వో మహాతేజా రక్తః సర్వభవోద్భవః ॥ 14

నక్షత్రగ్రహతారాణా మధిపో విశ్వభావనః ।
తేజసా మపి తేజస్వీ ద్వాదశాత్మన్నమోఽ స్తుతే ॥ 15



నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరియే నమః ।
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః ॥ 16

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః ।
నమో నమః సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః ॥ 17

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః ।
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమో నమః ॥ 18

బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యా యాదిత్యవర్చసే ।
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః ॥ 19

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే ।
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః ॥ 20

తప్తచామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే ।
నమస్తమోఽభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే ॥ 21

నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః ।
పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః ॥ 22

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః ।
ఏష చైవాగ్నిహోత్రం చ ఫలం చైవాగ్నిహోత్రిణామ్ ॥ 23

వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ ।
యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః ॥ 24

**ఫలశ్రుతిః**

ఏన మాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ ।
కీర్తయన్ పురుషః కశ్చిన్నావసీదతి రాఘవ ॥ 25

పూజయస్వైన మేకాగ్రో దేవదేవం జగత్పతిమ్ ।
ఏతత్ త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి ॥ 26

అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వం వధిష్యసి ।
ఏవ ముక్త్వా తదాఽగస్త్యో జగామ చ యథాగతమ్ ॥ 27

ఏతచ్ఛ్రుత్వా మహాతేజా నష్టశోకోఽభవత్తదా ।
ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్ ॥ 28

ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వా తు పరం హర్షమవాప్తవాన్ ।
త్రిరాచమ్య శుచిర్భూత్వా ధనురాదాయ వీర్యవాన్ ॥ 29

రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధాయ సముపాగమత్ ।
సర్వయత్నేన మహతా వధే తస్య ధృతోఽభవత్ ॥ 30

అథ రవి రవద న్నిరీక్ష్య రామం
ముదితమనాః పరమం ప్రహృష్యమాణః ।
నిశిచరపతిసంక్షయం విదిత్వా
సురగణమధ్యగతో వచస్త్వరేతి ॥ 31

*ఈ స్తోత్రం సర్వశత్రు వినాశకరం. అంతఃశత్రువులు, బహిఃశత్రువులు, ప్రతికూలతలను పోగొట్టేశక్తి ఆదిత్య హృదయానికి ఉంది. ధర్మార్థ కామమోక్షాలను కూడా ఆదిత్యహృదయం ఇస్తుంది. గాయత్రీమంత్ర స్వరూపమే ఆదిత్య హృదయం. సంధ్యలలో ఈ ఆదిత్యహృదయాన్ని పఠించేవారు గాయత్రీమంత్ర జపఫలాన్ని పొందుతారు. ఆదిత్య హృదయాన్ని చదివినవారు లోకంలో స్థిరమైన సంపదను పొంది, జీవితచరమాంకంలో ముక్తిని కూడా పొందుతారు.*

శ్రీమతే రామానుజాయనమః

# శ్రీదేవరాజాష్టకమ్





శ్రీమత్కాఞ్చీమునిం వన్దే కమలాపతినన్దనమ్,
వరదాఙ్ఘ్రిసదాసఙ్గరసాయనపరాయణమ్.

దేవరాజదయాపాత్రం శ్రీకాఞ్చీపూర్ణముత్తమమ్,
రామానుజమునేర్మాన్యం వన్దేఽహం సజ్జనాశ్రయమ్.

నమస్తే హస్తిశైలేశ! శ్రీమన్నమ్బుజలోచనః
శరణం త్వాం ప్రపన్నోఽస్మి ప్రణతార్తిహరాచ్యుత. 1

సమస్తప్రాణిసన్త్రాణప్రవీణ! కరుణోల్బణ,
విలసన్తు కటాక్షాస్తే మయ్యస్మిన్ జగతాంపతే. 2

నిన్దితాచారకరణం నివృత్తం కృత్యకర్మణః,
పా పీయాంస మమర్యాదం పాహి మాం వరదప్రభో! 3

సంసారమరుకాన్తారే దుర్వ్యాధివ్యాఘ్రభీషణే,
విషయక్షుద్రగుల్మాఢ్యే తృషాపాదపశాలిని. 4

పుత్రదారగృహ క్షేత్రమృగతృష్ణామ్బుపుష్కలే,
కృత్యాకృత్యవివేకాన్ధం పరిభ్రాన్తమితస్తతః. 5

అజస్రం జాతతృష్ణార్తమనసన్నామక్షమమ్,
క్షీణశక్తిబలారోగ్యం కేవలం క్లేశసంశ్రయమ్. 6

సన్తప్తం వివిధైర్దుఃఖైర్దుర్వచై రేవమాదిభిః,
దేవరాజ! దయాసిన్ధో! దేవదేవ! జగత్పతే! 7

త్వదీక్షణసుధా సిన్ధువీచి విక్షేపశీకరైః,
కారుణ్యమారుతానీతైః శీతలై రభిషిఞ్చ మామ్. 8

ఈ వరదరాజాష్టకం అనే స్తోత్రాన్ని చదివినవారికి శ్రీవరదరాజస్వామి అనుగ్రహం వల్ల మానసికమైన ప్రశాంతత కలుగుతుంది. ఈ లోకంలో ఉన్నంత కాలం వారు కోరిన ఇహలోకసుఖాలు సిద్ధిస్తాయి. శరీరం తొలగిన తరువాత ఉత్తమపురుషార్థమైన పరమానందప్రాప్తి కలుగుతుంది.

# ధర్మమే ముందు బంధుత్వం ఆ తర్వాత..

– పద్మశ్రీ డా॥ గరికపాటి నరసింహారావు



భారతీయ జనజీవనంతో పెనవేసుకుపోయిన భగవద్గీత మహాభారతంలోని భీష్మపర్వంలోని ఒక భాగం అని కొంతమందికి తెలియకపోవడం విచిత్రం. ఎందుకంటే భగవద్గీత మూల గ్రంథాన్ని మించిన ప్రాముఖ్యాన్ని పొందగలిగింది. భీష్మపర్వానికే కాదు, యావన్మహాభారతగ్రంథానికే మకుటాయ మానమైంది భగవద్గీత. ఈ భగవద్గీతను గర్భంలో ఇముడ్చుకున్న భీష్మపర్వం మరెన్నో భౌతిక, ఆధ్యాత్మిక రహస్యాలను పాఠకులకందించింది.

భౌతిక విషయపరిజ్ఞానంలో యుద్ధవ్యూహాలకు, ఆయుధాలకు వాటి ప్రయోగాలకు సంబంధించి ఎన్నో విశేషాలను భీష్మపర్వం తెలియజేస్తుంది. వ్యూహాలకు ప్రతివ్యూహాలు పన్నడంలోనూ, శత్రువుల వ్యూహాలను ముందుగా కనిపెట్టడంలోనూ, వివిధఆయుధాలను ప్రయోగించడంలోనూ, ఉపసంహరించడంలోనూ పూర్వుల పరిజ్ఞానం ఈ పర్వంలో వ్యక్తమౌతుంది. అచలవ్యూహం, సూచీవ్యూహం, గరుడవ్యూహం, సర్పవ్యూహం, పద్మవ్యూహం మొదలైన వ్యూహాలు పన్ని ఒకరిపై ఒకరు విజిగీషువులై ప్రవర్తించిన విధానమంతా భీష్మపర్వంలో వర్ణింపబడింది. ఆనాటి సైనికుల, సేనాధిపతులు సూక్ష్మబుద్ధి, గ్రహణశక్తి, ధైర్యం మొదలైన విషయాలు ఈ పర్వంలో చదువుతూ ఉంటే ఆశ్చర్యం కలిగిస్తాయి.

ఇక ఆధ్యాత్మికంగా భీష్మపర్వం ఒక తాత్త్వికసందేశాన్ని అందిస్తుంది. మన సాహిత్యంలో ఆదికావ్యమైన రామాయణం ఆదర్శజీవనానికి ఆధారం. భాగవతం దివ్యజీవనానికి దీపముఖం. మహాభారతం నిజజీవితానికి నిక్కచ్చి అయిన ఉదాహరణ. నిజానికి మానవజీవితమే ఒక కురుక్షేత్రసంగ్రామం. ఏ వ్యక్తికావ్యక్తి తన దేహంతో తానే ఒక మహాభారతసంగ్రామం చేస్తున్నాడు. ఇందులో ధర్మరాజు జీవాత్మ. పవననందనుడైన భీముడు ప్రాణవాయువు. మనోబుద్ధ్యహంకారాలే అర్జున బాణాలు, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలే నకులసహదేవులు. జీవాత్మనావహించిన మహామాయ ద్రౌపది. అరిషడ్వర్గాలే కౌరవ సైన్యం. జీవుడు పొందిన పరమాత్మాశ్రయమే శ్రీకృష్ణసారథ్యం. ఈ విధంగా భవబంధాలతో పోరాడి జీవుడు పరమాత్మ సహాయం ద్వారా ఆత్మైక్యాన్ని పొందగలగడమే మహాభారత యుద్ధపర్వాలలోని ఆధ్యాత్మికరహస్యం. జీవిఆధ్యాత్మికసాధనలో చేసే ప్రయత్నమంతా భౌతికంగా యుద్ధరూపంలో మహాభారతంలో వర్ణింపబడింది. వివిధాయుధాలన్నీ వివిధప్రయత్నాలే. **యుద్ధవ్యూహాలన్నీ ఆధ్యాత్మికదృష్టితో పరిశీలిస్తే అంతర్గత శత్రువ్యూహాలుగానే కనిపిస్తాయి. యుద్ధంలో వ్యూహం అనేది తక్కువ సైన్యంతోనైనా ఎక్కువ ప్రయోజనం పొందడానికి చేసే ఏర్పాటు. వ్యూహాలన్నీ మానవప్రయత్నాలు. పరమాత్మానుగ్రహమే అంతిమంగా విజయసాధనం. ఆ దైవానుగ్రహం లేనప్పుడు ఎన్ని లక్షల సైన్యం ఉన్నా ఒక్కటే అనే విషయం కౌరవుల ఓటమి ద్వారా ఋజువైంది. దైవానుగ్రహం ఉంటే పగలు రాత్రిగాను, రాత్రి పగలుగాను మారుతుందనడానికి సైంధవవధ ఘట్టం ఉదాహరణ.**

## 2024, ఫిబ్రవరినెల ఉత్సవాలు, పర్వదినాలు

**09** శ్రీపురందరదాసు ఆరాధన
**10-18** దేవునికడప, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
**14** వసంతపంచమి
**16** రథసప్తమి, భీష్మాష్టమి
**20** భీష్మఏకాదశి
**24** కుమారధారతీర్థముక్కోటి
**28నుండి మార్చి 08వరకు** శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవం

ధర్మం అంతా పాండవులవైపు ఉందని అందరం అనుకొంటున్నాం కదా! పాండవులలో మహావీరులు ఎందరో ఉన్నారు కదా! పద్దెనిమిది రోజుల యుద్ధంలో పాండవసేనాధిపతి ధృష్టద్యుమ్నుడు మారకపోయినా, పాండవవీరులైన భీమార్జునాదులు యుద్ధంలో చేసిన అపూర్వసాహసఘట్టాలెన్నో ఉన్నాయి. ఆ వీరుల పేరు మీదగాని, ఆ కృత్యాల పేరు మీదగాని పర్వాలు ఏర్పడలేదు. భీష్మపర్వం, ద్రోణపర్వం అంటూ కౌరవసేనాధిపతుల పేర్ల మీద పర్వాలు ఏర్పడ్డాయి. నిజానికి ఇది ధర్మాధర్మాలకు సంబంధించింది కాదు. రచనాప్రణాళికకు సంబంధించింది.

యుద్ధపర్వాలలో మొదటిదైన భీష్మపర్వం భీష్ముని వ్యక్తిత్వం కారణంగా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మానవత్వం సంపూర్ణంగా పరిపక్వత చెందినపుడు భీష్మునివంటివాడు ఒకడు పుడుతూ ఉంటాడు. మహాభారతకథకు మూలస్తంభమైన భీష్ముని జీవితం విచిత్రమైన ప్రతికూల పరిస్థితుల్లో సాగింది. అతని త్యాగానికి అంతులేదు. తండ్రికి పెళ్లి చేయడం కోసం తాను శాశ్వతంగా బ్రహ్మచారి అయినవాడు ప్రపంచంలో భీష్ముడొక్కడే అయి ఉంటాడు. కౌరవులపక్షంలో ఉంటూ పాండవులతో యుద్ధం చేసి పాండవుల మీది ప్రీతి వల్ల బలైపోయినవాడు. పాండవుల మీద ప్రీతి అంటే ధర్మం మీద ప్రీతి. ఇలాంటి వ్యక్తిత్వం గలిగిన నైష్ఠికుని నాయకత్వం భీష్మపర్వానికి అమితమైన గౌరవాన్ని ఆపాదింపజేసింది.

ధర్మరాజు యుద్ధానికి ముందుగానే ఆశీర్వచనం వంకమీద భీష్ముని వద్దకు వచ్చి చాలా రాజకీయాలు చేశాడు. *"రారాజు పక్షమై రణము సేయుము, నాకు హితమగు కార్యంబు మది తలంపుము"* అని కోరడం రాజకీయం కాక మరేమిటి? అంతే కాకుండా *"నిన్ను బోర గెలుచు విధము బోధింపుము"* అని నేరుగానే ప్రశ్నించడం ధర్మరాజు అవకాశవాదానికి చిహ్నం. ఉన్నత వ్యక్తిత్వం గలిగిన భీష్ముడు దానికి సమధానమిస్తూ ఈవిధంగా చెప్పాడు.

చుట్టరికంబునన్ మనసు సొచ్చి ననుం గరగించి వేడినన్
దిట్టతనంబు వోవిడిచి తీవ్రరణంబు కడంక దక్కినే
బట్టినయాయుధంబు వెడబాసిన గాని వధింపబోల ద
ట్టిట్టన కేగు మిప్పరుస యింతక కాలము గాదు దానికిన్
(భీష్మ-1-159)

ధర్మరాజు దేబెరికం, భీష్మునియొక్క సాలప్రమాణమైన ఉన్నతవ్యక్తిత్వం ఈ సన్నివేశంలో వ్యక్తమౌతున్నాయి. భీష్మపర్వం ద్వితీయాశ్వాసంలో భీష్ముని పరాక్రమానికి తాళలేక అర్జునుడు అల్లల్లాడిపోతున్నప్పుడు శ్రీకృష్ణుడు చిగురించిన క్రోధంతో కుప్పించి దూకే సన్నివేశాన్ని వ్యాసుని కంటె సంరంభంగా వర్ణించి తిక్కన పోతనకు మార్గదర్శకుడయ్యాడు.

అంహోమర్దనుడా జనార్దనుడు మాద్యద్భీష్మకుంభీంద్రుపై
సింహోల్లాసవి లాసియై కవియు నుత్సేకంబు నాటోపమున్
రంహస్ఫూర్తియు దీప్తమూర్తియను సంరంభంబు జూడన్ జగ
త్సంహారోన్ముఖుడైన రుద్రుగతి రౌద్రప్రక్రియంబొల్చినన్
(భీష్మ-2-156)

ఇంతటి రౌద్రప్రక్రియతో దూకగలిగిన కవిబ్రహ్మ తిక్కన ఆ దూకడం దూకడం అచ్చతెలుగు మైదానంలోకి దూకేయగలడు. అందుకే ఆ తరువాతి పద్యంలో *"పులి బొదగన్న లేళ్ళ గమివోలె"* అని అందుకోగలిగాడు.

తృతీయాశ్వాసంలో భీష్ముని శరతల్పసన్నివేశం ఈ పర్వానికి పతాక సన్నివేశం. కీర్తిమంతుడైన భీష్ముడు తూర్పువైపున తల ఉండేలా పడిపోయాడట. అహర్పతి అస్తగిరిని చేరినట్లుగా పడిపోయాడట. ఆయన *"కాలగతి నాత్మ దలంచినవాడు"* స్వచ్ఛందమరణ వరం ఆయనకు జీవితాంతం శాపమై జీవితం అంతమయ్యేటప్పుడు వరమైంది. తత్త్వవేత్త అయిన భీష్ముని మాటలు, పద్ధతులు, ప్రవర్తన, ఆలోచన అన్నీ ఈ పర్వంలో ప్రధానస్థానాన్ని ఆక్రమించి భగవద్గీతా తత్త్వానికి ఉదాహరణప్రాయునిగా భీష్మపితామహుని జీవితాన్ని చూపిస్తున్నాయి.

# తిరుమంగళకుడి - సూర్యభగవానుడు

- కుమారి ఆర్. జయశ్రీ కాశీకర్, 90140 45853




నవగ్రహాలు మానవజీవితంపై విశేషప్రభావం చూపుతాయి. గగన మండలం నుండి భూమండలంపై భ్రమణ చేసే ఈ నవగ్రహాలను దర్శించే తమిళనాడులో ఎన్నో నవగ్రహక్షేత్రాలు వెలిశాయి.

తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని కుంభకోణం పట్టణానికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుమంగళ కుడి క్షేత్రంలో విరాజిల్లిన సూర్యభగవానుని మందిరానికి వెళ్లే మార్గంలో ప్రకృతిసౌందర్యం కనులవిందు చేస్తుంది.

ఇక్కడి సూర్యభగవానుని దర్శించేముందు ఈ "తిరుమంగళ కుడి" క్షేత్ర స్థలపురాణం తెలుసుకోవటం సమంజసం.



పూర్వం గాలవమహర్షి యొక్క జన్మకుండలిలోని గ్రహాల స్థితిగతులు సక్రమంగా లేనందున ఆయన అనేకకష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. వాటిని తొలగించు కోవడానికి ఆయన నవగ్రహాలను ప్రసన్నంచేసుకోవాలనే ఉద్దేశ్యంతో వింధ్యపర్వతంపై తపస్సు ఆచరించాడు. ఆయన తపస్సుకు మెచ్చి నవగ్రహాలు ప్రత్యక్షంకాగా గాలవ మహర్షి వారిని– "మీ సంచారము వల్ల నా ఏడుతరాలవారికి ఎలాంటి కష్టం కలుగ కుండా వరం ప్రసాదించమ"ని ప్రార్థించాడు." నవగ్రహాలు ఆయన కోరిన వరం ప్రసాదించారు. కానీ సాధారణంగా నవగ్రహాలను ప్రసన్నం చేసుకోవడానికి వారి అధిదేవతలైన శివుడు, విష్ణువు, సుబ్రహ్మణ్యస్వామి మున్నగు దేవతల నుద్దేశించి తపస్సు చేయటం పరిపాటి. కానీ గాలవుడు నేరుగా నవగ్రహాలను తన తపస్సుతో ప్రసన్నులనుజేసి వరం పొందటంతో దేవతలు ఆగ్రహం చెంది నవగ్రహాలను "వరం ప్రసాదించటం దేవతల కార్యం. మీకా అధికారం లేదు. మీరు మీ కార్యక్షేత్రాన్ని అతిక్రమించినందుకు మీరు రోగగ్రస్తులగుదురు గాక!" అని శపించారు.



భయకంపితులైన నవగ్రహాలు శాపవిమోచన మార్గం తెలియజేయాల్సిందిగా దేవతలను కోరారు. దేవతలు శాప విమోచనమార్గాన్ని సూచించారు– "చోళదేశంలో ఒక పుణ్యస్థలముంది. అక్కడ 9 తీర్థాలున్నాయి. అక్కడ తపమాచరించి, కార్తిక మాసంలో ఒక ఆదివారం రోజున వ్రతాన్ని ప్రారంభించండి. ఇలా పదకొండువారాలు శివ, పార్వతులను పూజించి ప్రతి సోమవారం దధి (పెరుగు) అన్నం మాత్రమే భుజించాలని చెప్పారు.



దేవతలు చెప్పిన విధంగ గాలవ మహర్షి ఆ కఠోర వ్రతాన్ని నిష్ఠతో ఆచరించి, సమీపంలోని పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పూజ, అర్చన చేసి నవగ్రహాలకు శాపవిమోచన గావించాడు.



పైన పేర్కొన్న ఈ సంఘటన జరిగిన పుణ్యక్షేత్రమే తిరుమంగళకుడి. ఇక్కడ సూర్యభగవానుని దేవాలయం వెలసియుంది. ఈ క్షేత్రంలో శివుడు ప్రాణనాథుడన్న పేరుతో ప్రసిద్ధి గాంచాడు. ఇక్కడి అమ్మవారి పేరు మంగళాంబిక, వినాయకుని పేరు మంగళవినాయకుడు. ఇన్ని మంగళకరాలైన దివ్యమూర్తులను ఒక్కచోట దర్శించటం కూడా ఒక మంగళమయ ఘటనే కదా! కనుక నవగ్రహాలను దర్శించడానికి ముందు ప్రాణనాథుని మరియు మంగళాంబికలను దర్శనంచేసుకోవటం సముచితమనిపిస్తుంది.

ఈ క్షేత్రంలో సూర్యభగవానుడు ప్రధానదేవతగా వెలసి, తన ఇరువురు భార్యలు- ఉషా మరియు ప్రత్యూషాలతోపాటు మనకు దర్శనమిస్తాడు. ఈ మందిరం యొక్క మరో విశేషం దేవగురువు బృహస్పతి సూర్యభగవానునిపై దృష్టిసారించి వారి ఎదుట ఆసీనులై ఉండటం చూడవచ్చు. ఈ మందిర ప్రవేశద్వారంలో ఎఱ్ఱని మరియు తెల్లని కమలపుష్పాలతో కూర్చబడ్డ మాలలు చూడముచ్చటగా ఉంటాయి. గర్భగుడి లోని సూర్యభగవానునిమూర్తి కమలపుష్పాలమాలలతో శోభాయమానంగా అలంకరింపబడి ఉంటుంది. సూర్యభగవానుని చేతులలో సహితం కమలపుష్పాల్ని చూడవచ్చు. సూర్యభగవానుడు ప్రసన్న వదనుడై తన కృపాకటాక్షాలను మనపై ప్రసరింపజేసిన భావన కలుగుతుంది. ఆ భగవానుని ముఖారవిందమనే కమలాన్ని చూచినప్పుడు మన హృదయకమలం పులకాంకితమౌతుంది. ఇక్కడ సూర్యుని అర్చన కూడా కమలపుష్పాలతోనే చేయబడుతుంది.




ఈ దేవాలయంలో నవగ్రహాలనిర్మాణం వైజ్ఞానికంగా నిర్మింపబడింది. సూర్యమందిరంనుండి ఎడమవైపుమెట్లు దిగినవెంటనే శని, బుధ, మంగళ, చంద్ర, కేతు, శుక్ర, రాహుగ్రహాల దర్శనం మనకు కలుగుతుంది. సూర్యుని రథాన్ని లాగే "సప్తా" అనే అశ్వాన్ని చూడవచ్చు. గ్రహదోషాలచే పీడింపబడ్డవారు ఈ సూర్యదేవాలయాన్ని దర్శించి భక్తిప్రపత్తులతో పూజించిన ఎడలవారు దోషముక్తులవుతారు. ఈ మందిరంలోని నవగ్రహాలలో శని భగవానుడు వరదహస్తంతో దర్శనమివ్వటం విశేషం. ఏలినాటి శని, అష్టమ శని మున్నగు వాటితో పీడింపబడేవారు ఈ దేవాలయంలో పూజ, అర్చన చేసుకుంటే కష్ట నివృత్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం!

పదకొండవశతాబ్దంలో కులోత్తుంగ చోళరాజు ఈ మందిర నిర్మాణం చేశాడు. మార్తాండదేవన్ అనే శిల్పి ఇక్కడి సూర్యభగవానునిమూర్తిని మలచినట్లు చెప్పబడుతుంది. ఈ ఆలయ పూజాకార్యక్రమాలు "తిరువాడుదురై" ధార్మికపీఠం వారి ఆధ్వర్యంలో జరుగుతాయి. ఈ మందిరానికి "భార్గవపురి" అని మరో పేరు కూడా కలదు.

అనేకానేక సంవత్సరాల పూర్వం ఈ తిరుమంగళకుడి క్షేత్రానికి శివానుగ్రహయోగి అనే గొప్పయోగి ధర్మాధికారిగా వ్యవహరించాడు. సంస్కృతం, తమిళభాషలలో అపారపాండిత్యం గడించిన ఈయన అనేకమంది విద్వాంసులను వాదప్రతివాదాలలో పరాజితుల్ని చేసి శైవధర్మాన్ని సుస్థిరపరిచాడు. ఈయన సంస్కృతం, తమిళభాషలలో అనేక గ్రంథాల్ని రచించాడు. అవి శైవధర్మ గ్రంథాలుగా ప్రశస్తి పొందాయి.

గృహలక్ష్మి

# మార్గదర్శకమాసం

- డా॥ సుబ్బలక్ష్మి మర్ల

ఉత్తరాయణ పుణ్యకాలం తరువాత వచ్చే మాసాలలో అతిపవిత్రమైన మాసం మాఘమాసం. హేమంతంవెళ్లి శిశిరం ప్రవేశించిన ఈమాసం వాతావరణరీత్యా కూడ ప్రత్యేకతని సంత రించుకుంది. హిమపాతంవల్ల కుంచించుకుపోయిన జీవజాల మంతా శిశిరంలో క్రొత్తమెరుగులు దిద్దుకోవడానికి సన్నద్ధ మౌతుంది. వృక్షాలు చివికి జీర్ణించిన ఆకులన్ని రాలిపోయి నూతనంగా చిగురించడానికి రంగం సిద్ధం చేసుకుంటాయి. అందుకే భీష్ముడు కూడ చివికి జీర్ణించిన తన దేహాన్ని త్యజించి తొల్లిటి వసువు రూపాన్ని పొందడానికి ఈ భువినుంచి మాఘశుద్ధ ఏకాదశిన నిష్క్రమించాడు. మలినాలను, వ్యర్థాలను త్యజించి నూతనోత్తేజాన్ని పొందడానికి తొలిమెట్టుగా నిలచేది ఈమాఘమాసం.

మాఘవ్రతం మూడువిధాలుగా ఆచరిస్తారు. పుష్యశుద్ధ ఏకాదశి మొదలు మాఘశుద్ధ ఏకాదశి వరకు చేసేది మొదటి విధానం. సూర్యుడు మకరరాశిని ప్రవేశించింది మొదలు కుంభ రాశిలో ప్రవేశించేవరకు ఆచరించడం రెండవవిధానం. మాఘ శుద్ధపాడ్యమి నుండి ఫాల్గుణ శుద్ధపాడ్యమి వరకు ఆచరించేది మూడవ విధానం. ఏవిధంగా చేసినా వ్రతం నెలరోజులు ఆచ రించడం ముఖ్యం. ఈ మాఘమాసంలో హరిహర బ్రహ్మ స్వరూపుడై భాస్కరరూపంతో ప్రకాశించే శ్రీమన్నారాయణుని ఎవరు పూజిస్తారో వారు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలిగి పుత్రికాపుత్రాదులతో సుఖంగా ఉంటారు. ఈ మాఘమాస వ్రత, స్నానాదుల గురించి స్కంద, లింగ, విష్ణు, పద్మపురాణాలు చెప్పాయి.

ఈ వ్రతాన్ని ఆచరించేవారు నెలరోజులు ప్రతిరోజు ప్రాతఃకాలంలో మేల్కొని స్నానధ్యానాదులు ముగించి, దానాలు చేసి సాయంత్రంవరకు ఉపవసించి నక్షత్రదర్శనమయ్యాక భుజించి, భోగాలను విసర్జించి దినంలో మూడువేళల శ్రీమహా విష్ణువుని పూజించాలి. నేలపైనే నిద్రించాలి. మొదటివిధానంలో చేసేవారు మాఘశుద్ధ ఏకాదశి రాగానే ఆరోజు నియమంతో పూర్తి ఉపవాసంచేసి మరునాడు అంటే ద్వాదశినాడు ద్వాదశి పారణచేసి బ్రాహ్మణులతో కలసి భుజించాలి. రెండవ విధానాన్ని ఆచరించేవారు సూర్యుడు కుంభరాశిలో ప్రవేశించిన దినాన వ్రత పరిసమాప్తి గావించాలి. మూడవవిధానాన్ని ఆచరించేవారు ఫాల్గుణశుద్ధపాడ్యమినాడు వ్రతాన్ని ముగించాలి. ఈ మాఘ వ్రతం ఆచరించేవారికి, వారు చేసే పాపపుణ్యాలను బట్టి వరునకు భార్య, వధువుకు భర్త లభిస్తారు. మాఘమాస స్నానాదుల వల్ల సకలవిద్యలు, సకలైశ్వర్యాలు, ధనధాన్యాదులు, నిర్మలమైన కీర్తి, ఆరోగ్యం, ఆయుష్షు మంచి భార్యాపుత్రాదులు లభిస్తారు. ఇవిగాక దేహారోగ్యం, మంచివాక్పటుత్వం, నిశ్చలమైన భగవద్భక్తి, మంచిరూపం, సదాచారం, దానధర్మాలయందు ఆసక్తి కలుగుతాయి.

మాఘమాసవ్రతం ఆచరించేవారు ఆ నెలరోజులు అరటిపండ్లు, రేగిపండ్లు, పాలు, పెరుగు, తేనె, ఉప్పు, చక్కెర, బెల్లం, జాజికాయ, ప్రత్తి, కంబళి, వస్త్రం, జన్నిదం, కమండలం, పాత్రలు, అన్నంతో నింపిన కంచుపళ్లెం, పానకం, నిమ్మపండ్లు, మాదీఫలాలు, సువాసనద్రవ్యాలు, పువ్వులు, గోపీచందనం, శంఖం, దేవతార్చనపాత్ర, సాలగ్రామం, స్ఫటికలింగం, విఘ్నే శ్వరప్రతిమ, దుర్గాప్రతిమ, ఈవిధంగా రోజుకొకటి చొప్పున దానం ఈయాలి.

మాఘవ్రతం చేసేవారు ఇహమందు సకలసంపదలు అనుభవించి చివరన వైకుంఠం చేరుతారు. ఒకవేళ భూమిపై జన్మించినా అష్టైశ్వర్యసంపన్నులై జన్మిస్తారు. మాఘమాసంలో దీపారాధన చేసేవారు, గృహ, కన్య, గోదానాలు చేసేవారు అన్నదానం, మంచినీళ్ల దానం, రోగులకు మందులిచ్చేవారు, గురుశుశ్రూష చేసేవారు, బ్రాహ్మణదంపతులకు తలంటి దంపతిపూజ చేసేవారు, వెండి, రత్నాలు మొదలైనవి దానం చేసేవారికి విశేషఫలం లభిస్తుంది. మాఘమాసంలో ప్రయాగ లోను, కోటిపల్లి క్షేత్రంలోను, గౌతమీనదిలోను, కపిలతీర్థం లోను స్నానం ఆచరించినవారు పుష్పకవిమానమెక్కి సూర్యలోకం చేరతారు. కాశి, గయ, శ్రీరంగం మొదలైన క్షేత్రాలలో మాఘవ్రతం ఆచరిస్తే శివ, విష్ణులోకప్రాప్తి కలుగుతుంది. ఈమాసంలో శ్రీసూక్త, పురుషసూక్త, నమక, చమకాలు,

అరుణం, వేదాలు పారాయణ చేసినవారికి కోరిన కోరికలు సిద్ధిస్తాయి.

ఈ మాఘవ్రతాన్ని నెలరోజులు ఆచరించలేనివారు రథ సప్తమి, శుద్ధ ఏకాదశి, పూర్ణిమ, కృష్ణచతుర్దశి మొ॥ రోజులలో ఆచరించినా సంపూర్ణఫలాన్ని పొందుతారు. మాఘమాస వ్రత స్నానాదులవల్ల నూరుఅశ్వమేధయాగాలు, నూరుకపిల గోదానాలు చేసిన ఫలం కలుగుతుంది.

ఈ మాఘమాస వ్రతమహాత్మ్యం వల్ల పురూరవుడు, దోషాలు తొలగి ఊర్వశిని భార్యగా పొందాడు. మార్కండేయుడు యముణ్ణి జయించాడు. గంధర్వుడు తనకు ప్రాప్తించిన బెబ్బులి మొఖాన్ని పోగొట్టుకోగలిగాడు. మృగశృంగుడు సత్సంతానాన్ని పొంది మోక్షం పొందాడు. సువ్రతుడు అనే బ్రాహ్మణుడు ముక్తిని పొందాడు. దేవేంద్రుడు గాడిదముఖాన్ని పోగొట్టుకున్నాడు. విశ్వామిత్రుడు వానరముఖాన్ని పోగొట్టుకున్నాడు.

పూర్వకాలంలో ఒకప్పుడు మాఘమాసవ్రతం ఆచరించాలి అనే ఇచ్ఛకతతో కొందరు గంధర్వులు పుత్రకళత్రాదులతో కూడి ఆకాశమార్గంలో అరుణోదయవేళ గంగాతీరానికి వచ్చారు. పావనగంగాతరంగాలలో మాఘస్నానం ఆచరించి అక్కడనుండి ప్రయాగ, తపతి, నర్మద మొ॥నదులలో స్నానంచేసి సిద్ధి జనార్ధన క్షేత్రానికి వెళ్లి అక్కడ కూడ స్నానాదులు ముగించి కల్యాణ వీరభద్రుని దర్శనార్థమై ఆ క్షేత్రానికేగి అక్కడకూడ స్నానాదులు భక్తిశ్రద్ధలతో నిర్వర్తించారు. ఆ గంధర్వులలో ఒకరి భార్య రూపయవ్వనగర్వంతో ఈ చన్నీటిలో మునిగితే చలితో శరీరం గడ్డకట్టడమేగాని పుణ్యం ఎక్కడనుంచి వస్తుంది? ఈ దైవదర్శనంతో ఒరిగేదేమిలేదు అని తిరస్కారభావంతో స్నానాదులు ఆచరించకుండా క్షేత్రదూషణ చేయడంవల్ల ఆకాశగమన శక్తిని కోల్పోయి ఆ ప్రాంతంలోనే మందబుద్ధియై సంచరిస్తోంది. గంధర్వులంతా తిరిగి తమ లోకానికి వెళ్లిపోయారు. ఇలా ఉండగా విశ్వామిత్రుడు మాఘస్నానం ఆచరించాలనే తలంపుతో కల్యాణవీరభద్రక్షేత్రానికి వచ్చాడు. అక్కడ నడయాడుతున్న గంధర్వకాంతను చూచి విధివశాన కామమోహితుడై ఆమెతో రమిస్తున్నాడు. ఇక్కడ గంధర్వలోకాని కేగిన గంధర్వుడు తన భార్య తిరిగిరాలేదనే విషయాన్ని తెలుసుకుని ఆమెకోసం వెదకుతూ కల్యాణ వీరభద్రక్షేత్రానికి వచ్చాడు. అక్కడ తన భార్యతో సంభోగసుఖాన్ని ఆస్వాదిస్తున్న విశ్వామిత్రుణ్ణి చూచి మహాక్రోధంతో "ఓయీ! విశ్వామిత్రా నీవు బ్రహ్మర్షివయి ఉండి అల్పబుద్ధితో పరస్త్రీ అయిన నా భార్యను కామించావు కనుక కొండముచ్చుముఖంతో బుద్ధిహీనుడవై చరించు" అంటూ శపించాడు. తన భార్యను చూచి నీవు నాతో రాకుండా ఇక్కడ పరపురుషునితో రమిస్తున్నావు. కనుక పాషాణానివి కమ్మని శపించాడు. ఆమె దీనవదనంతో "నాథా నేను ఈక్షేత్రాన్ని, మాఘవ్రతాన్ని నిందించడంవల్ల ఆకాశగమనశక్తి కోల్పోయి సంచరిస్తుంటే ఈ ఋషిపుంగవుడు నన్ను కోరాడు. అతని శాపాగ్నికి భయపడి నేను అతని వశమయ్యాను కనికరించ"మని వేడుకుంది. గంధర్వుడు జాలిపడి కొంతకాలానికి నారదమహర్షి మాఘస్నానార్థం ఈక్షేత్రానికి విచ్చేస్తాడు. అతడివలన నీకు శాపవిముక్తి కలిగి తిరిగి నన్ను చేరుకుంటావు అని చెప్పి తనలోకానికి వెళ్లిపోయాడు.

ఈ విధంగా పన్నెండు సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పుడు మాఘమాసంలో అన్ని క్షేత్రాలలో స్నానాదులు ఆచరిస్తూ నారదమహాముని కల్యాణవీరభద్రక్షేత్రానికి వచ్చాడు. అక్కడ వానరముఖంతో సంచరిస్తున్న విశ్వామిత్రుణ్ణి "ఆహా!



కాలమహిమ తన తపోమహిమతో బ్రహ్మర్షిస్థానాన్ని పొందిన ఈ మహనీయునికి ఎంతటి దుస్థితి సంభవించింది. పరస్త్రీ వ్యామోహం ఎంతటిచేటోకదా!" అని విచారించి ఆ మహనీయునికి విముక్తి కలిగించాలనే తలంపుతో అతణ్ణి తీసుకువచ్చి నది ఒడ్డున కూర్చుండబెట్టాడు. ఆ రోజు మాఘశుద్ధపూర్ణిమ. విశ్వామిత్రుని పేరుచెప్పి నారదుడే స్నానదానాదులన్ని పూర్తిచేసి శ్రీమహావిష్ణువుదశాక్షరీ అనే మహామంత్రాన్ని సహస్రపర్యాయాలు జపించి మంత్రోదకాన్ని విశ్వామిత్రునిపై చల్లాడు. మాఘస్నానవ్రతప్రభావంవల్ల, దశాక్షరీ మహామంత్రమహిమవల్ల విశ్వామిత్రుడు పూర్వరూపాన్ని, బుద్ధిని పొంది నారదునికి కృతజ్ఞతలు చెప్పి గంధర్వకాంతను గూర్చి తెలియజేసి ఆమెకు కూడ శాప విమోచనం చేయవలసిందిగా కోరాడు. నారదుడు తొల్లిటి మంత్రజలాన్ని ఆమెపై జల్లగా ఆమె యథారూపు పొందివారికి కృతజ్ఞతలు తెలిపి తనలోకానికి తరలిపోయింది.

మాఘస్నానం వల్ల బ్రహ్మ సృష్టికర్త అయ్యాడు, శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మిని భార్యగా పొందాడు, ఈశ్వరుడు పార్వతిని భార్యగా పొంది త్రిపురాసురసంహారం చేశాడు. భరద్వాజుడు సప్తఋషిమండలంలో స్థానం సంపాదించాడు. పాండవులు 12 సం॥లు మాఘస్నానవ్రతాలు చేయడంవల్లనే భారతయుద్ధంలో విజయం సాధించారు.

పూర్వం భృగువంశంలో 'ఋక్షక' అనే బ్రాహ్మణకన్య ఉండేది. ఆమెకు పిన్నవయసులోనే వైధవ్యం ప్రాప్తించగా విరక్తయై వింధ్యపర్వతప్రాంతంలో నర్మదానదికి ఉత్తరగట్టున కపిలానది సంగమించేచోట కామక్రోధాలను విసర్జించి శ్రీమహావిష్ణువుని ధ్యానిస్తూ అరువది మాఘమాసాలు వ్రతాన్ని ఆచరించి మాఘవ్రత మహత్మ్యంవల్ల విష్ణులోకాన్ని చేరింది. అక్కడ అనేక వేల సంవత్సరాలుండి, సూర్యలోకానికి వెళ్లి అక్కడ కొంతకాలం ఉండి బ్రహ్మలోకానికి వెళ్లింది. బ్రహ్మ ఆమె చేసిన వ్రతమహిమ వల్ల ఆమెను తిలోత్తమ అనే అప్సరస స్త్రీగా సృజించి సత్యలోకంలో ఉంచాడు. ఆమె సుందోపసుందులు ఒండొరులను సంహరించుకునేవిధంగా చేసి దేవకార్యాన్ని నిర్వర్తించింది. అందుచేత బ్రహ్మ సంతసించి ఆమెకు శాశ్వత సూర్యలోకప్రాప్తి కలిగించాడు.

ఈ విధంగా ఈ మాఘవ్రతం ఆధ్యాత్మిక, ఆముష్మిక పరంగా మహోత్కృష్టమైన మహిమ కలిగి ఉండడమేకాక ఆరోగ్య రీత్యా కూడ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మార్గశిర, పుష్యమాసాలు హేమంతఋతువు. జీర్ణాశయం కొంత మంద గించి ఉంటుంది. పగలు సమయం తక్కువ, రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. ఆ ఋతువు సమాప్తమై కొత్తఋతువు ప్రవేశించే ఈ మాఘమాసంలో పగలంతా ఉపవశించి రాత్రి భుజించడంవల్ల ఇటు జీర్ణకోశానికి మంచి జరగడమేకాక అటు రాత్రి దీర్ఘమవడంవల్ల, నక్షత్ర దర్శనానంతరం భుజించడంవల్ల మధ్యరాత్రిలో క్షుద్బాధకు గురయ్యే ప్రమాదంనుంచి కూడ తప్పిస్తుంది. రాత్రంతా చంద్రకిరణస్పర్శతో, ఔషధీయుక్తమై అరుణోదయవేళ గోరువెచ్చగా ఉండే నదీజలాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. దానధర్మాలు చేయడంవల్ల వితరణబుద్ధి కలిగి సాటివారికి తోడ్పడాలనే సద్బుద్ధి కలుగుతుంది. ఈ విధంగా ఈ మాఘమాసవ్రతం ఇటు ఇహానికి అటు పరానికి రెండింటికి మార్గదర్శకమై ఐహికఆముష్మిక ఫలదాయకమై విలసిల్లుతోంది.

## డిసెంబరు నెల క్విజ్-17 సమాధానాలు

| | |
|---|---|
| 01) ఏకత్వమే | 11) అయోధ్య |
| 02) ఏకత్వమే | 12) అయోధ్య |
| 03) మార్గశిరం | 13) వైకుంఠఏకాదశి |
| 04) మార్గశిరం | 14) కోలవిల్లిరామన్ |
| 05) తులసివనం | 15) చతుర్భుజుడు |
| 06) సనత్కుమారుడు | 16) కర్మయోగం |
| 07) 17 | 17) మార్గదర్శక గ్రంథం |
| 08) 6 | 18) హనుమంతుడు |
| 09) శూరపద్ముడు | 19) హనుమంతుని |
| 10) బ్రహ్మదండం | |

### సరైన సమాధానాలు వ్రాసినవారు-

01) తుంపూడి జైవీర్‌వరుణ్, హైదరాబాదు.
02) కె.సహస్ర, తిరుపతి.
03) జాహ్నవ్, ఖమ్మం.
04) కంభంపాటి రుత్విక్‌సాయి, ఖమ్మం.
05) బి.శివప్రణీత్, హిందూపురం.
06) ఎన్.గౌతమ్ మహేష్, కాకరపల్లి, తూ.గో.జిల్లా.
07) ఎన్.బాలాజీ, కుప్పం.
08) బలివాడ సాత్విక, రెడ్డిపేట(గ్రా), శ్రీకాకుళం జిల్లా.
10) యామర్తి శ్రీనివాస సత్కృత్, బెంగళూరు.
11) పులికంటి చైత్ర, బాలసముద్రం, హనుమకొండ.
12) కె.జ్ఞానశివదీప్తి, నందికొట్కూరు, నంద్యాల జిల్లా.
13) ఎన్.శమంతచౌదరి, విజయవాడ.
14) ఎ.వేంకటసాయిధన్వి, ఈదేపల్లి, మచిలీపట్నం.

పాఠం-28

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య నిర్వహణ- మహామహోపాధ్యాయ కొంపెల్ల రామసూర్యనారాయణ

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| त्वाम् | = | నిన్ను | वदितुम् | = | చెప్పన్, చెప్పుటకు | पृच्छति | = | అడుగుచున్నాడు |
| माम् | = | నన్ను | उदित्वा | = | చెప్పి | प्रक्ष्यति | = | అడుగగలడు |
| युष्मान् | = | మిమ్మును | आह्वातुम् | = | పిలువన్, పిల్చుటకు | पिबति | = | త్రాగుచున్నాడు |

## అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి?

01) ममाग्रजः त्वामाह्वयति शीघ्रमागच्छ।
02) अत्र बालकाः न सन्ति।त्वमेव उत्का आगच्छ।
03) जनकः कत्रास्ति इति अनुजं पृच्छ।
04) बालकाः क्षीरं सर्वम् अपिबन्।
05) इदानीं युष्मान् कः प्रक्ष्यति?
06) मां के अपृच्छन्?
07) अरे शीघ्रं क्षीरं पिब रे।
08) एषः त्वाम् आह्वातुं न आगच्छत्।
09) त्वम् अस्मद्गृहे भोजनार्थमागमिष्यसि वा?
10) अहं नागमिष्यामि किन्तु ममानुजमाह्वय, सः आगच्छति।

### అ) జవాబులు

01) నా అన్న నిన్ను పిలుస్తున్నాడు. తొందరగా రమ్ము
02) ఇక్కడ బాలకులు లేరు. నీవే చెప్పి రమ్ము.
03) తండ్రిగారు ఎక్కడ అని తమ్ముడిని అడుగు.
04) బాలకులు మొత్తం పాలను త్రాగారు.
05) ఇప్పుడు మిమ్ములను ఎవడు అడుగగలడు?
06) నన్ను ఎవరు అడిగారు?
07) అరే! తొందరగా పాలు త్రాగురా!
08) ఇతడు నిన్ను పిలవడానికి రాలేదు.
09) నీవు మా ఇంటికి భోజనానికి రాగలవా?
10) నేను రాలేను (రాను) కానీ నా తమ్ముడిని పిలువు; అతడు వస్తాడు.

## ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నా అన్నను పిల్చుటకు ఎవరు వెళ్లారు?
02) ఎవరూ వెళ్ళనిచో మీరే వెళ్లండి.
03) పిమ్మట నేనూ అక్కడికి రాగలను.
04) వారిపుడు భోజనానికి వస్తారో రారో; అడుగుము.
05) మీరే అడగండి.
06) మీరు ఊరక ఉండండి; వారే వస్తారు.
07) మిమ్మల్ని భోజనానికి ఎవరు పిల్చారు?
08) మీ అన్న పిలిచినాడుగా.
09) మా అన్న ఊర్లోనే లేడే; ఎలా పిలిచాడు?
10) వాడు ఈ వేళ వచ్చాడని మా తమ్ముడు మా ఇంటిలో చెప్పాడు.

### ఆ) జవాబులు

01) मम अग्रजम् आह्वातुं के अगच्छन्?
02) केऽपि न गच्छन्ति चेत् यूयमेव गच्छत।
03) अनन्तरम् अहमपि तत्र अगमिष्यामि।
04) ते इदानीं भोजनार्थम् आगच्छन्ति वा न वा : पृच्छ।
05) यूयमेव पृच्छत।
06) यूयं तूष्णीं भवत; ते एव आगमिष्यन्ति।
07) युष्मान् के भोजनार्थम् आहूतवन्तः?
08) तव अग्रजः आहूतवान् खलु।
09) मम अग्रजः ग्रामे एव नास्ति खलु कथम् आहूतवान्?
10) सः अद्य अगच्छत् इति मम अनुजः अस्माकं गृहे उक्तवान्।

# చదువులమ్మకు వందనం!

– శ్రీమతి డి.వరలక్ష్మి



ఈ ఆధునికయుగంలో సమస్తానికీ మూలకారణం విద్య ఒక్కటే. చక్కటి విద్యకారణంగానే పిల్లలు సభ్యమానవులై, మంచిజీవితాన్ని గడపగలుగుతారు. భాషాజ్ఞానం, వాక్పటుత్వం, వాక్చాతుర్యం ద్వారానే వారు ఇతరులపై తమదైన ముద్రవేయ గలుగుతారు. పవిత్రంగా, మన స్ఫూర్తిగా, నిర్మలమైన మనస్సుతో సరస్వతీదేవిని ఆరాధిస్తే చాలు ఆ చదువుల తల్లి ప్రసన్నమై కోరిన విద్యలను ప్రసాదిస్తుంది.

సకలవిద్యాస్వరూపిణి, సకలవాఙ్మయానికీ మూల కారకురాలు, భాష, లిపి, కళలకు అధిదేవత సరస్వతీమాత. వేదాలకు జనయిత్రి, వీణాపుస్తక ధారిణి అయిన ఆ తల్లి దయ ఉంటే వెర్రిబాగులవాడు కూడా వేదవేదాంగవేత్త అవుతాడు. మూర్ఖుడు సైతం మహా విద్వాంసుడుగా మారిపోతాడు. ఆమెను తృణీకరిస్తే మహాపండితుడు కూడా వివేకశూన్యునిగా మారి సర్వం పోగొట్టుకుంటాడు. అందుకే ఆ చల్లనితల్లి కరుణ అందరికీ అవసరం. ఎవరైనా సరే, తమకుగాని, తమ హితులు, సన్నిహితులు, పుత్రులు, బంధుమిత్రులకు పాండిత్యం లభించాలన్నా, కోరిన కోరికలు నెరవేరాలన్నా, ఉన్నత విద్యాప్రాప్తి, ఉన్నతోద్యోగం, పదోన్నతి లభించాలన్నా సరస్వతీదేవిని ఆరాధించాల్సిందే!

వసంతపంచమి ఉదయం పూట స్నానాదికాలు ముగించుకుని శుచి అయి, గణపతిని పూజించి, కలశంలో దేవిని ఆవాహన చేయాలి. విద్యాదాయిని సరస్వతీదేవి ప్రతిమ లేదా చిత్రపటానికి తెల్లనిపూలు, అక్షతలు, మంచిగంధం, తెల్లని నగలు అలంకరించి షోడశోపచారాలతో పూజించి, పాయసం నివేదించాలి. పూజానంతరం ఆ పాయసాన్ని ప్రసాదంగా భుజించి, అందరికీ పంచిపెట్టాలి. ఐదుగురు బాలలను అమ్మవారి ప్రతిరూపాలుగా భావించి, నూతనవస్త్రాలు కట్టబెట్టి, పలకాబలపాలు లేదా పుస్తకం, కలం ఇచ్చి సంవత్సరంపాటు వారి చదువుకు అయ్యే ఖర్చును భరించాలి.

సరస్వతీదేవికి తెలుపురంగు ప్రీతికరం కాబట్టి ఆమెను తెల్లని పూలు, తెల్లని పట్టువస్త్రంతో అలంకరించి, పెరుగు, వెన్న, వరిపేలాలు, తెల్లనువ్వులతో చేసిన లడ్లు, చెఱకురసం, బెల్లం, తేనె, పాలకోవా, చక్కెర, కొబ్బరికాయ, రేగుపళ్లువంటి వాటిని నివేదిస్తే సరస్వతీదేవి ప్రసన్నురాలై కోరిన కోరికలు తీరుస్తుందని శాస్త్రోక్తి.

**గమనిక**

**కొత్త వేరియంట్ లక్షణాలు**

- తీవ్రజ్వరం
- అలసట
- జలుబు
- తలనొప్పి
- నిరంతర దగ్గు
- నీరసం
- అతిసారం
- శ్వాస సంబంధిత సమస్యలు

**జాగ్రత్తలు ఇలా..**

- మాస్క్ ధరించాలి
- భౌతికదూరం పాటించాలి
- చేతులు శుభ్రత
- పౌష్టికాహారం తినడం
- కాచి చల్లార్చిన నీళ్లు మాత్రమే తాగడం
- జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

శ్రీవేంకటేశ్వరలీలలు

# ఎంత దయామతివయ్యా!

- శ్రీ బి.గురుకుమార్ రెడ్డి, 9440007216

నేను 2023 సం॥లో జరిగిన సాలకట్ల బ్రహ్మోత్స వాలలో స్వామివారి రథోత్సవంలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగే అవకాశభాగ్యం కల్పించమని వేడుకున్నాను.

ఆ అవకాశం రానే వచ్చింది. రథోత్సవం ప్రారంభం నుండే రథానికి దగ్గరగానే, రథాన్ని లాగుతూ, క్రిందనుండి స్వామివారిని దర్శించుకుంటూ 'గోవింద! గోవిందా!!' అంటూ ఎంతో ఉత్సాహంగా లాగుతున్నాను. అక్కడే ఉన్న ఓ వ్యక్తి ఎవరు నువ్వు? ఇక్కడ రథాన్ని లాగకూడదు. వెళ్లు వెళ్లు అని పదే పదే తోస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో రథం స్వామివారి ఆలయం ముందుకు వచ్చింది. అక్కడే స్వామి వారికి హారతి ఇస్తున్నారు. అప్పుడు ఆ స్వామివారిని దర్శించుకుంటూ "స్వామి! తమరేమో అవకాశం ఇచ్చారు. ఈయనేమో వెళ్లు వెళ్లు అంటున్నాడు. నాకేమో దిక్కుతోచడం లేదు. నీవే కాపాడు స్వామి" అని మనసారా వేడుకున్నాను. ఇంతలో రథం కదిలింది. ఇలా రథం ఓ ఇరవై ముప్పై అడుగులు కదిలి మళ్లీ ఆగింది. ఆ వ్యక్తి నన్ను మరల వెళ్లు వెళ్లు అంటూనే ఉన్నాడు. ఇంతలో ఆ అధికారి పై అధికారి దూరాన నుండి నేరుగా అక్కడికి వచ్చి, నా ప్రక్కన నన్ను వెళ్లమన్న అధికారితో "నీవు ఇక్కడ ఎందుకు ఉన్నావు? ఇక్కడ వద్దు. పక్కకు రా" అని అతణ్ణి దూరంగా పంపాడు. ఆ స్వామివారే ఆ పై అధికారి రూపంలో వచ్చి అతణ్ణి దూరంగా పంపి, రథాన్ని పూర్తిగా లాగే అవకాశాన్ని నాకు కల్పించారు.

ఇక్కడ ఆశ్చర్యమేమంటే, చిరుఉద్యోగినైన నన్ను పక్కకు వెళ్లమనకుండా, ఓ అధికారిని ఆ పై అధికారి వచ్చి పక్కకు పంపి నాకు అవకాశం కల్పించడమంటే మాటలా.. అంతా ఆ స్వామివారిలీల కాకపోతే.. మరేమిటి?

మరలా నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పెద్దరథం బదులు స్వర్ణరథం ఉంటుంది. అందువల్ల ఈ రథాన్ని కూడా లాగే అవకాశం కల్పించమని వేడుకున్నాను. తిరుపతినుండి ద్విచక్ర వాహనంలో వెళ్లి, రాంభగీచసత్రం-3 బయటవాహనం నిల్పి, స్వామివారి స్వర్ణరథోత్సవవేళకు చేరుకుని అందులో పాల్గొందా మనుకున్నాను. కొన్ని కారణాల వల్ల తిరుపతిలోనే ఆలస్యమైంది. స్వామివారిని తలచుకుంటూ ఎలాగో తిరుమల చేరాను. రాంభగీచ దగ్గరకు వెళ్లడానికి ప్రయత్నించగా, ద్విచక్రవాహనా లకు ఈ దారిలో అనుమతి లేదని చెప్పారు. స్వర్ణరథం ప్రారంభం అవడానికి ఎంతో సమయం లేదు. ఇక చేసేది లేక ఆ ప్రక్కలోనే నా వాహనాన్ని నిలిపి, పరిగెత్తుతూ వెళ్లుతున్నాను. ఒకటే ఆయాసం వస్తోంది. స్వామివారిని తలచుకుంటూ, రాంభగీచ వరకు ఎవరైనా లిఫ్ట్ ఇస్తే బాగుండు అనుకున్నాను. ఇంతలో ఒకతను ద్విచక్రవాహనంపై నా నుంచి దాదాపు వెళ్లి పోయాడు, అయినా నేను అప్రయత్నంగానే లిఫ్ట్ ఇస్తారా? అని అడిగాను. అతడు వెంటనే ఆపి రమ్మన్నాడు. నేను వెంటనే గస పోసుకుంటూ రాంభగీచసత్రాల-3 దగ్గర వరకు సార్ అని చెప్పి వాహనం ఎక్కాను. అతను వేగంగా రాంభగీచసత్రం-3 దగ్గరకు వచ్చి, రాంభగీచసత్రం-1 వైపు లోనికి తీసుకువెళ్లుతున్నాడు.

సాధారణంగా బ్రహ్మోత్సవాలలో రాంభగీచసత్రాల-3 నుండి లోపలికి బయటివాహనాలను అనుమతివ్వరు. అందులో స్వర్ణరథోత్సవం ప్రారంభమౌతోంది కాబట్టి, కేవలం వి.ఐ.పి.ల వాహనాలనే అనుమతిస్తారు. మిగతావారిని అంతా రాంభగీచ సత్రాల-3 బయట రోడ్డువరకే అనుతిస్తారు. ఇతను తి.తి.దే. గుర్తింపుకార్డు వేసుకుని, హెల్మెట్ ధరించి, రంగుప్యాంట్, రంగు షర్టు వేసుకుని ఉన్నాడు. డ్యూటీలో ఉన్న వ్యక్తి అయితే, తెల్ల షర్టు, తెల్లపంచ ధరించి ఉంటారు. ఎంత తి.తి.దే. ఉద్యోగి అయినా, గుర్తింపుకార్డు వేసుకుని ఉన్నా, డ్యూటీలో లేని అతణ్ణి వాహనంతో లోనికి అనుమతించరు. ఇతనేమో నేరుగా దాదాపు రాంభగీచ సత్రం-1 వరకు వచ్చి దింపాడు. ఆశ్చర్యం! అక్కడ ఎంతోమంది సెక్యూరిటీవారు ఉన్నా అతణ్ణి ఎవ్వరూ అపలేదు. ఆశ్చర్యంతోనే వేంకటేశ్వరస్వామివారిని స్మరిస్తూ, అతనికి మన స్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపాను. అతనేమో తల అలా ఊపి నేరుగా వచ్చిన దారిలోనే వెళ్లిపోయాడు. అంటే కేవలం నన్ను దింపడానికే అక్కడివరకు వచ్చాడు. ఆశ్చర్యంతోనే నేను స్వర్ణరథం ప్రారంభానికి కేవలం నిమిషాల వ్యవధిలో ముందుగా చేరుకుని, స్వామివారి స్వర్ణరథాన్ని స్వామివారి కృపచే ఆ రథాన్ని కూడా లాగాను. దైవం మానుషరూపేణా అంటారు కదా! అలా ఆ స్వామివారే అతని రూపంలో నాకు ఆలస్యం కాకుండా వచ్చి సహాయం చేశారు. స్వామి అనుగ్రహంతో నిండిన ఈ సంఘ టనలు నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేనివి, మరుపురానివి.

ఇలా ఒకే సంవత్సరంలో రెండు రథోత్సవాలకు నన్ను అనుగ్రహించిన ఆ స్వామివారి కృప అనంతం.

# తిరుమలకు 'తొలి గడప'

– డా॥ నొస్సం నరసింహాచార్య,
90528 44442

**పదకవితాపితామహుడైన తాళ్లపాక అన్నమచార్యుల వారు దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించారు, తమ సంకీర్తనలలో కీర్తించారు. ఈ స్వామిని గురించి 12 సంకీర్తనలు రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోకి ఈ ఆలయం వచ్చాక, ఇక్కడ అనేక నూతన సేవలు, ఉత్సవాలు ప్రవేశపెట్టారు. ఇంతటి విశిష్టత కలిగిన ఈ క్షేత్రవైభవం సంక్షిప్తంగా మీకోసం...**

- దేవునికడప ఆంధ్రప్రదేశ్, వై.ఎస్.ఆర్. కడపజిల్లా, కడపనగరంలో కడప ప్రధాన పట్టణానికి 3 కి.మీ. దూరంలో ఉంది.
- దేవునికడప శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాతే తిరుమలకు రావడం పూర్వసంప్రదాయం.
- ఈ ఆలయక్షేత్ర పాలకుడు హనుమంతుడు.
- దేవునికడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుణ్ణి జనమేజయుడు ప్రతిష్ఠించినట్లుగా ప్రతీతి.
- హరిహర, బుక్కరాయలకాలంలో ఈ ఆలయం నిర్మితం.
- సాళువనరసింహరాయలు ఆలయాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.
- శ్రీకృష్ణదేవరాయలు ఈ క్షేత్రాన్ని దర్శించుకుని, స్వామివారికి అనేక కానుకలు సమర్పించాడు.
- ఈఆలయంలోని కోనేరును 'హనుమత్ పుష్కరిణి' అంటారు.
- ఈ ఆలయంలోని శమవృక్షానికి 'సంతానవృక్షం' అని పేరు. సంతానం లేని వారు ఈ వృక్షానికి ప్రదక్షిణలు చేస్తే సంతానం కల్గుతుందని భక్తుల విశ్వాసం.
- ఇక్కడి గర్భాలయంలో రెండుఅడుగుల ఎత్తుగల పీఠంపై సుమారు నాలుగు అడుగుల ఎత్తున్న శ్రీవేంకటేశ్వర స్వామివారు కొలువుదీరి ఉన్నారు.
- శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి దేవేరి శ్రీమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఆలయానికి ఎడమవైపున ప్రత్యేకఆలయంలో కొలువుదీరిఉంది.
- దేవునికడపలో 1987వ సం॥లో ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ జరిగి మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు.

**దర్శనవేళలు**

01) ఉ॥ 06.30 గం॥ నుంచి 07.45 వరకు
02) ఉ॥ 08.30 గం॥ నుంచి 10.45 వరకు
03) ఉ॥ 11.30 గం॥ నుంచి 12.30 వరకు
04) సా॥ 03.30 గం॥ నుంచి 05.45 వరకు
05) సా॥ 06.30 గం॥ నుంచి రా॥ 08.00 వరకు

- ఈ ఆలయం పశ్చిమాభిముఖంగా విశాలమైన ప్రాంగణంలో శిల్పకళా శోభాయమానంగా ఉట్టిపడుతూ చూపరులను ఆకర్షిస్తోంది.
- ఈ ఆలయపుష్కరిణిలో ప్రతి సంవత్సరం తెప్పోత్సవాలు, బ్రహ్మోత్సవాల సమయంలో చక్రస్నానం జరుగుతుంది.
- ఇక్కడిబ్రహ్మోత్సవాల్లో రథోత్సవంచాలా ముఖ్యమైంది. ఈ ఉత్సవంలో వేలాది భక్తులు పాల్గొంటారు. ఈ రథోత్సవం 'రథసప్తమి' రోజు జరుగుతుంది.
- ఈ ఆలయాన్ని 2006 సంవత్సరంలో తి.తి.దే. తన ఆధీనంలోకి తీసుకుంది.

(వెనుకపుట కథనం)

## శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు, దేవునికడప

2024, ఫిబ్రవరి 09 నుండి 19 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 09-02-2024 | శుక్ర | దీక్షా తిరుమంజనం | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 10-02-2024 | శని | తిరుచ్చి, ధ్వజారోహణం | చంద్రప్రభవాహనం |
| 11-02-2024 | ఆది | సూర్యప్రభవాహనం | పెద్దశేషవాహనం |
| 12-02-2024 | సోమ | చిన్నశేషవాహనం | సింహవాహనం |
| 13-02-2024 | మంగళ | కల్పవృక్షవాహనం | హనుమంత వాహనం |
| 14-02-2024 | బుధ | ముత్యపుపందిరివాహనం | గరుడవాహనం |
| 15-02-2024 | గురు | కల్యాణోత్సవం | గజవాహనం |
| 16-02-2024 | శుక్ర | రథోత్సవం | ధూళిఉత్సవం |
| 17-02-2024 | శని | సర్వభూపాల వాహనం | అశ్వవాహనం |
| 18-02-2024 | ఆది | వసంతోత్సవం, చక్రస్నానం | ధ్వజావరోహణం, హంసవాహనం |
| 19-02-2024 | సోమ | ---- | పుష్పయాగం |



# అడవిపుత్రుల ఆనందోత్సవం

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 90320 44115

సనాతనగిరిజన సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ సాగే పండుగే నాగోబా జాతర. దీన్నే 'చొల్లంగి అమావాస్య' అని కూడా వ్యవహరిస్తారు.

పుష్య కృష్ణ అమావాస్యను చొల్లంగి అమావాస్య అంటారు. తూర్పుగోదావరిజిల్లా కాకినాడకు దక్షిణంగా యానాం రోడ్డు మీద మూడుమైళ్ల దూరాన 'చొల్లంగి' అనే గ్రామం ఉంది. గోదావరి ఏడుపాయలలో ఒకటైన 'తుల్యభాగ' ఇక్కడ సముద్రంలో కలుస్తుంది. జీవనదియైన గోదావరిపాయల్లో ఒకటి సాగరాన్ని సంగమించే చోటు కావడంవల్ల ఇక్కడ స్నానం చేస్తే, నదిలోనూ సముద్రంలోనూ ఏకకాలంలో స్నానం చేసిన విశేషఫలం పొందుతారు. ఈ రోజున జీవనది గోదావరి, సముద్రంలో కలిసే చోటు వద్ద స్నానమాచరించి, పితృ తర్పణం గావిస్తే వారి పితరులు 21తరాల వారు నరకలోకయాతనల నుండి విముక్తులు కాగలరని, తత్ఫలితంగా స్వర్గలోకప్రాప్తి సిద్ధి స్తుందని పురాణాలు చెబుతున్నాయి.



ఏటా జరిగే చొల్లంగి తీర్థానికి ఎంతోమంది భక్తులు వచ్చి పవిత్రస్నానాలు ఆచరించడంతో పాటు పెద్దలకు పిండ ప్రదానం చేస్తారు. ఇక్కడ వెలసిన రాఘవస్వామి వారిని అర్చిస్తారు. ఈ రోజున సింహాచలం కొండ దిగువభాగంలో ఉన్న అడవి వరంలో గల ఉద్యానవనం, పుష్కరిణి ప్రాంతాల్లో సింహాచలం అప్పన్నకు ప్రత్యేకపూజలతో పాటు తెప్పతిరు నాళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ.

## నాగోబా జాతర

పుష్యమాసం అమావాస్య రోజున గిరిజనులు నాగోబా జాతరను ఎంతో సంబరంగా జరుపుకుంటారు. ఈ రోజు వారి ఆరాధ్యదైవమైన 'నాగోబా' పురివిప్పి నాట్యంచేస్తాడని నమ్మకం. 'నాగోబా' దేవాలయం ఆదిలాబాద్‌జిల్లా ఇంద్రవెల్లి మండలం లోని కేస్లాపూర్ గ్రామంలో ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచీ లక్షలాది గిరిజనులు ఈ గ్రామానికి చేరుకుని నాగోబాజాతరలో పాల్గొంటారు. ఈ జాతరకు ఎన్నో వందల ఏళ్ల చరిత్ర ఉంది.

ఈ జాతరకు 16 రోజుల ముందు అంటే పుష్య పౌర్ణమికి ఒకరోజు ముందు కొంతమంది గిరిజనులు గోదావరి జలం తీసుకురావటం కోసం పవిత్ర నాగోబా ఆలయం నుంచి కలశం తీసుకుని కాలినడకన బయలుదేరి వెళతారు. కేస్లాపూర్‌కు సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న జన్నారం మండలం కలమడుకు వరకు నడిచి వెళ్లి అక్కడ నుంచి గోదావరి జలాన్ని తీసుకు వస్తారు. కొన్నేళ్లక్రితం ఇదేప్రాంతంలో గిరిజనుల పూర్వీకులు స్నానం చేస్తుండగా నాగదేవత దర్శన మిచ్చాడని ప్రతీతి. అందువల్ల ఇక్కడి జలాన్ని పవిత్రంగా గిరిజనులు భావిస్తుంటారు.

ఇక్కడ సేకరించిన జలంతో నిండిన కలశాన్ని నలభై కిలోమీటర్ల దూరంలోని 'పూసినగూడ' గ్రామానికి లేదా ప్రధాన పూజారి ఉండే నార్నూరు మండలం గుంజాల గ్రామానికి తెచ్చి అక్కడ ఒకరోజు ఉన్న తరువాత కేస్లాపూర్‌కు ఎనిమిది కిలో మీటర్లదూరంలోని ఇంద్రవెల్లిలో ఆగి, అక్కడ వెలసిన ఇంద్రా దేవికి సామూహికంగా పూజలు జరుపుతారు. అక్కడి నుంచి బయలుదేరి కేస్లాపూర్ చేరి ఆలయానికి కొద్దిదూరంలో ఉన్న మర్రిచెట్టు కింద నాలుగు రాత్రులు, ఒక పాకలో మూడు రాత్రులు సామూహికపూజలు జరుపుతారు. ఆ తర్వాత కేస్లాపూర్ మందిరానికి వాద్యాలతో ఊరేగిస్తూ తెచ్చి ఆలయం వద్ద ఉన్న మర్రిచెట్టుపై పవిత్రజల కలశం భద్రపరిచి 10 కి.మీ. దూరం లోని సిరికొండ చేరుకుంటారు.

పుష్య అమావాస్య రోజున కలశం ఉంచిన మర్రిచెట్టు దగ్గర పుట్టను తయారు చేసి, ఆలయం ప్రక్కన ఉన్న పూజా మందిరం మట్టితో అలికి అమావాస్య అర్ధరాత్రి కలశంలో ఉన్న జలంతో ఆలయంలో ఉన్న నాగదేవతను అభిషేకిస్తారు. గిరిజనతెగకు చెందిన మెస్రం వంశస్తులు దేశంలో ఏ మారు మూల ఉన్నా తప్పనిసరిగా ఈ జాతరకు హాజరై నాగదేవతను పూజిస్తుంటారు.

## పూర్వగాథ

నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైం దని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞమేరకు గౌరి భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపిస్తుంది. ఆ ఊరు ఉడుంపూరుగా పేరు పొందు తుంది.

ఆ తరువాత గౌరి ధర్మపురివద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూచి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరుప్రతిష్ఠలు కావాలో, సంప్ర



దాయం కావాలో తేల్చుకోమనగా గౌరిసంప్రదాయాలను లెక్క చేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ.

ఆ తరువాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతని కోసం వెతికిన గౌరి, గోదావరిలోని సత్యవసి గుండంలో కలిసి పోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్లి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెప్తుం టారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారిపోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. ఏటా పుష్యమాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమౌతాడని గిరిజనుల నమ్మకం. నాగోబాదేవతకు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు.



ఆయుర్వేదం

# లాభాల గులాబీ...

-డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

గులాబీపూలు అందంగా, ఆకర్షణీయంగా, మంచి సువాసనాభరితంగా ఉండి మన ఆరోగ్యాన్ని కాపాడే అద్భుత ఔషధగుణాలు కలిగి ఉంటాయి.

నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గులాబీపూలను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో తెలుసుకుందాం.

**ముఖం తాజాగా ఉండేందుకు:** 200 మి.లీ. నీటిలో రెండు గులాబీ పూలరేకులను వేసి మూతపెట్టి గంటసేపాగి వడగట్టిన నీటితో ముఖం కడిగితే ముఖం తాజాగా, కాంతివంతంగా, తేజోవంతంగా ఉంటుంది.

**అధిక రుతుస్రావం తగ్గేందుకు:** రోజూ రెండు, మూడుసార్లు 50-100 మి.లీ. పెరుగులో ఒక రోజా పూవురేకలు, అర టీ స్పూన్ తాటి బెల్లం కలిపి సేవిస్తుంటే స్త్రీలలో అధిక రుతుస్రావం త్వరగా తగ్గిపోతుంది.

**మానసికఒత్తిడి, ఆందోళన తగ్గేందుకు:** గులాబీరేకల పొడి, సుగంధి పాలవేర్ల పొడి, అశ్వగంధచూర్ణం ఒక్కొక్కటి 20 గ్రాములు, పటికబెల్లంపొడి 60 గ్రాములు కలిపి రోజూ ఉదయం పరగడుపున, రాత్రి పడుకునేటపుడు పూటకు 100 మి.లీ. నీటిలో అర టీస్పూన్ పొడిని కలిపి సేవిస్తే మానసిక ప్రశాంతత కలిగి చక్కటి ప్రయోజనం కలుగుతుంది.

**వేడిని తగ్గించే గులాబీ లస్సీ:** 100 మి.లీ. నీటిలో 20-30 మి.లీ. రోజ్‌వాటర్, ఒక టీ స్పూన్ పంచదార, రెండు టీస్పూన్ల తేనె, 50 మి.లీ. పెరుగు, ఒక ఏలక్కాయ విత్తనాల చూర్ణం కలిపి బాగా చిలికి గ్లాసులో పోసుకొని 3,4 పుదీనా ఆకులు పైన వేసుకొని సేవిస్తుంటే అధిక వేడి తగ్గుతుంది. కడుపులో మంట, వికారం, రక్త, జిగట విరేచనాలు తగ్గుతాయి. వేసవికాలంలో వివిధరకాల వ్యాధులనుంచి రక్షణ కలిగిస్తుంది.

**మూత్రం ధారాళంగా వచ్చేందుకు:** రోజూ ఉదయం 200 మి.లీ. నీటిలో 2,3 గులాబీ రేకులు వేసి ఉదయం ఆహార పదార్థాలన్ని మిక్సీలో కలియద్రిప్పి అర టీ స్పూన్ లేదా ఒక టీ స్పూన్ పంచదార కలిపి సేవించాలి. అలాగే రాత్రి పూట కూడా చేసి ఉదయం మిక్సీలో కలియద్రిప్పి పంచదార కలిపి సేవించాలి. ఫలితంగా మూత్రంలో మంట, దాహం, పోటు తగ్గుతాయి. మూత్రం ధారాళంగా వస్తుంది. మూత్రవ్యవస్థలో దోషాలు తగ్గిపోతాయి.

**గ్యాస్ట్రిక్ ట్రబుల్ తగ్గేందుకు:** 25 గ్రాముల చొప్పున ఎండుద్రాక్ష, ఎండుగులాబీపూలు, సునాముఖి, శుంఠి, సైంధవ లవణ చూర్ణాలు కలిపి మిక్సీలో వేసి బాగా కలియద్రిప్పి పిదప 250 మి.లీ. తేనె కలిపి నిల్వవుంచుకొని రోజూ ఒక టీ స్పూన్ సేవిస్తుంటే మంచి ఆకలి, రక్తవృద్ధి కలిగి నీరసం, నిస్త్రాణత, బలహీనత తగ్గుతాయి. కడుపులో వికారం, పొట్ట ఉబ్బరం, అజీర్ణం, అసంపూర్తి మలవిసర్జన లాంటి సమస్యలు తగ్గి జీర్ణాశయరుగ్మతల్లో మంచి ప్రయోజనకారిగా పనిచేస్తుంది.

**మంగుమచ్చలు, నల్లమచ్చలకు:** గులాబీపూల పొడి, శ్రీగంధం పొడి సమానంగా కలిపి ఉంచుకొని రోజూ ఒకసారి తగినంత పొడిలో తగినన్ని పాలు, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి లేపనం చేసి గంటసేపాగి కడిగేస్తుంటే త్వరగా ఫలితం కలుగుతుంది.



**వ్యాధినిరోధకశక్తి బాగా ఉండేందుకు:** ఒక గాజుసీసాలో 100 గ్రా. ఎండు గులాబీ పూలరెక్కలు, 100 గ్రా. పంచదార, 200 మి.లీ. తేనె కలిపి బాగా కలియబెట్టి మూడురోజులు ఎండలో ఉంచి, నిల్వచేసుకుని ఉదయం, రాత్రి ఆహారానికి గంట ముందు పూటకు ఒక టీ స్పూన్ సేవిస్తే వ్యాధినిరోధక శక్తి పెరిగి రోగాలు దరిచేరవు.

**తుమ్ములు తగ్గేందుకు:** 50మి.లీ. నువ్వులనూనెలో రెండుగులాబీ పూలరేకలు వేసి సన్నమంటపై రేకలు నల్లగా అయ్యేలా నూనెను కాచి దించి చల్లార్చి వడగట్టి రెండుపూటలా పిల్లలకు 2, 3 చుక్కలు, పెద్దలకు 4, 5 చుక్కలు ఒక్కో ముక్కు రంధ్రంలో వేస్తుంటే తుమ్ములసమస్య చాలా త్వరగా తగ్గుతుంది.

**మలబద్ధకం:** 50 గ్రా. ఎండు గులాబీపూలపొడి, 50 గ్రా. సునాముఖిపొడి, 10 గ్రా. సైంధవలవణచూర్ణం కలిపి ఉంచుకొని రోజూ రాత్రి పడుకునేటప్పుడు 2 $^1/_2$ గ్రా. నుంచి 5 గ్రా. వరకు 100మి.లీ. నీటిలో కలిపి సేవిస్తే చక్కటి ప్రయోజనం కలుగుతుంది.

గులాబీపూలను ఉపయోగించి శరీరానికి చలువ చేసే, రక్తవృద్ధి చేసే రుచికరమైన, సువాసనయుక్తమైన గుల్కందు లభ్యమవుతుంది. గులాబీ జలం లేదా పన్నీరును కూడా ఈ పూలను ఉపయోగించి తయారు చేస్తారు.

## గ్రంథసమీక్ష

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ విరచిత

# పావకవృత్త - సుజలవృత్త తారావళులు

మిత్రవ్యాఖ్య, రచయిత్రి– ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి; పుటలు– 166; వెల– రూ.200/–; ప్రతులకు– వి.నాగరాజ్య లక్ష్మి, 301, రామన్న టవర్స్, రామన్నపేట, గుంటూరు– 522 007; ఫోన్– 93941 13848.

తెలుగుధార్మిక కవితారంగంలో వాగర్థప్రమాణాలతో చిరస్థాయిగా నిలిచి ఉండగల రెండు తారావళుల సంపుటి ఇది. ఒకటి పావకవృత్త తారావళి. రెండవది సుజలవృత్త తారావళి. ఆర్షజ్ఞానభూమికపై నిలిచి ఆకాశ తారావళీ దర్శన దార్శనికులైన ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణగారి సృజనకు గీటురాళ్లు. పావకవృత్త తారావళిలోని ప్రతిపద్యమూ ఒక జ్వాలాగ్నితోరణం. అగ్ని దేవుని వైభవాన్ని పవిత్రతను రసాత్మకతతో గానం చేసింది. అగ్ని సనాతనత్వాన్ని, వైజ్ఞానికతను సమన్వయరూపంలో వర్ణించిన 27 పద్యాలు 'అగ్నిమీళేపురోహితమ్' అనే ఋగ్వేద ప్రథమసూక్తంలోని అగ్నిస్తుతి నేపథ్యంగా సాగాయి. అగ్నిసూక్తం మొదలుకొని వాల్మీకి రామాయణాది సంస్కృతకావ్యాలను, మను




చరిత్రాది తెలుగుగ్రంథాలను ప్రమాణంగా స్వీకరించి అగ్ని విశిష్టతను, పవిత్రతను వ్యాఖ్యాత్రి ఆచార్య వెలువోలు నాగ రాజ్యలక్ష్మి 'మిత్ర' వ్యాఖ్యను అందించారు.

ఈ సంపుటిలో రెండవదైన 'సుజలవృత్త తారావళి' జలవైభవాన్ని 27 పద్యాలలో అత్యంతరమణీయంగా వర్ణించిన గ్రంథం. పావకవృత్త తారావళితో రసహృదయులను చేసిన ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ ఈ తారావళితో సహృదయులను శీతలభావస్థితి మంతులను కావించారు. గంగామాహాత్మ్యాన్ని, పరిజ్ఞానాన్ని లౌకిక, అలౌకికభావనలతో ఈ పద్యకవి చిత్రించిన తీరు అనితరసాధ్యం.

గంభీరమైన, లౌకిక, అలౌకిక స్పర్శ కలిగిన ఈ రెండు తారావళుల అంతరార్థాన్ని అందిపుచ్చుకుని సంప్రదాయ కతను, శాస్త్రీయతను సాహితీప్రియులకు చక్కనివిందుగా, ధార్మికమార్గదర్శకంగా మిత్రవ్యాఖ్యతో డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మిగారు విద్వత్ వ్యాఖ్యాత్రిగా కవిత్వరసావిష్కరణ చేశారు.

ఇది తప్పక చదవాల్సిన పుస్తకమిది.

– డా॥ కె.రాధారమణ.

భాస్కరశతకం

# కాలాన్ని గౌరవించాలి!

ఉ. కట్టడ లేని కాలమున కాదు శుభంబొరులెంతవారు చే
పట్టిననైన మర్త్యునకు భాగ్యము రాదనుటెల్ల కల్ల కా
దెట్టని పల్కినన్ దశరథేశవసిష్టులు రామమూర్తికిన్
బట్టము కట్టకోరి రదిపాయక చేకుఱె నోటు భాస్కరా!

**తాత్పర్యం**

భాస్కరా! కాలం అనుకూలంగా లేనపుడు శుభాలు చేకూరవు, ఎంతటి వారైనా సరే వారు చేపట్టిన పనులు నెరవేరవు. ఎలాగంటే దశరథమహారాజు, వసిష్ఠుడు మొదలగు మహాత్ములు శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలనుకున్నారు. మరి వారు చేపట్టిన పని నెరవేరలేదు కదా!

శతక కవి కాలం యొక్క గొప్పతనాన్ని అద్భుతంగా వివరించాడీ పద్యంలో. కాలం కలిసిరానప్పుడు ఎంతటి వారికైనా ఇడుములు తప్పవు. వారి పనులేవీ నెరవేరవు. రామునంతటి వానికి వసిష్ఠులంతటి తపస్వి, దశరథు నంతటి మహారాజు పట్టాభిషేకం చేయాలని సంకల్పించినా అది నెరవేరలేదు. కనుక మన ప్రయత్నానికి తోడు కాలమూ అనుకూలించాలి అనే నిజాన్ని తెలుసుకోవాలి



మానవుడు. ప్రయత్నాలు ఫలించలేదని నిర్వేదానికి గురి కాకూడదు. అనుకూల కాలానికై వేచి ఉండాలి తప్ప విషాదాన్ని పొందరాదు. నూరేళ్లకైనా మానవుణ్ణి ఆనందం వరిస్తుంది అని రామాయణం చెబుతున్నది. కనుక, కాలాన్ని గౌరవించి అది అనుకూలపడే వరకు ఎదురుచూడడమే మానవుని కర్తవ్యం అని ఈ పద్యం బోధిస్తోంది.

– డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# పలుకువిలువ

పదుగు రాడు మాట పాటి యై ధర జెల్లు;
ఒక్క డాడు మాట యెక్క దెందు;
ఊర కాడువాని కూరెల్ల నోపదు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** పదుగురు= పదిమంది; పాటి= ఆదరంతో; ఓపదు= సహించదు.

**భావం:** పదిమంది మాట్లాడినమాట లోకంలో నిజంగా చెల్లుతుంది. ఒక్కడు మాట్లాడితే ఎక్కడా లెక్కకు రాదు. వ్యర్థంగా మాట్లాడు వాడిని ఊరంతా అసహ్యించుకుంటుంది.

**వివరణ:** ఆకాశం, వాయువు ఇవి బలమైన పంచ భూతాలు. ఈ రెండింటి కలయిక వల్ల శబ్దం పుడుతుంది. మానవుని నోటిగుండా భావప్రకటనకోసం ఆ శబ్దం వాక్కుగా మారుతుంది. ఆ వాక్కు (మాట) చాలా విలువైంది. పరిమితంగా పలికేమాటకు విలువ ఉంటుంది. ఊరకే మాట్లాడుతూ ఉండేవాణ్ణి వాగుడుకాయ అంటారు. చక్కగా మాట్లాడేవాడిని చతురుడు, మాటకారి అంటారు. మాట సత్కారాలు చేయిస్తుంది. ఛీత్కారాలూ తీసుకు వస్తుంది. అందుకే అన్నారు– మాటే మంత్రం అని.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ఇతరులతో వాదనలు మానసిక ఉద్రిక్తతను కలిగిస్తాయి. సద్గుణాలను పెంచుకుని ఆధ్యాత్మికంగా సాగడంవల్ల ప్రయోజనం ఉంటుంది. ప్రయాణాలు కలిసివస్తాయి. ఆకస్మికంగా ధనం వచ్చే అవకాశం ఉంది. దైవబలం ఉంటుంది.



**వృషభం–** దూరప్రయాణాలు వాయిదావేయడం మంచిది. కుటుంబసభ్యులతో గడపటం వల్ల మనశ్శాంతి కలుగుతుంది. ఉద్యోగవిషయాల్లో మెరుగైన ఫలితాలు ఆశించవచ్చు. తక్షణమే ఉద్యోగప్రాప్తత కలుగుతుంది. ఋణవిమోచక అంగారకస్తోత్రం పఠించటం వల్ల ఋణవిముక్తి.



**మిథునం–** గృహవాతావరణం అనుకూలం. విలాసవంతమైన జీవనం అనుభవిస్తారు. పందెములు లాభించవు. వాహన విషయాలలో జాగ్రత్త అవసరం. తెలివైన నిర్ణయాలు చేస్తారు.



**కర్కాటకం–** కుటుంబసభ్యులతో సంయమనం పాటించడం అవసరం. వృత్తి, ఉద్యోగవిషయాలలో కూడా తొందరపాటుకూడదు. సహోద్యోగులతో వివాదాలు మంచివి కావు. వ్యవహారప్రతిబంధకాలలో జాగ్రత్త అవసరం.



**సింహం–** సంతానం విషయంలో పురోగమనం కల్గుతుంది. ఉన్నత ఉద్యోగాల పోటీపరీక్షలలో వారి విజయాలు సంతోషాన్ని కల్గిస్తాయి. స్నేహితులు, కుటుంబసభ్యులు మంచిగా వ్యవహరిస్తారు. ఆనందకరమైన జీవితాన్ని అనుభవిస్తారు.



**కన్య–** ఇంట్లో ఆధ్యాత్మికశోభ వెల్లివిరుస్తుంది. ప్రణాళికతో అన్నింటా విజయం సాధిస్తారు. అదృష్టం వరిస్తుంది అధికారయోగం వస్తుంది. వ్యాపారాలలో అధికలాభాలు కల్గుతాయి. వ్యవసాయదారులకు పైరు పంటల ప్రగతి అనుకూలం అవుతుంది.



**తుల–** శుభవార్తలు వింటారు. తోబుట్టువులతో సమయాన్ని గడుపుతారు. స్నేహితులు, బంధువర్గం సహాయపడతారు. అవివాహితులకు ఈ నెలలో శుభకార్యసిద్ధి. భవిష్యత్తు ప్రణాళికలు సఫలీకృతం.



**వృశ్చికం–** సంపదవృద్ధి అవుతుంది. విద్యలలో విజయాలు, సమాజంలో గుర్తింపు, వివాహ అవకాశాలు. నూతన ప్రణాళికలను సిద్ధం చేసుకుని కార్యాచరణకు పూనుకోవటం జరుగుతుంది. పుష్కలమైన ఆరోగ్యం, మానసికవికాసం అనుభవిస్తారు. ఆశించిన పనులు సత్వరమే పూర్తవుతాయి.



**ధనుస్సు–** ధైర్యంతో తలచిన పనులను పూర్తి చేయగల్గుతారు. అందరి మన్ననలు పొందుతారు. ప్రయత్నాలు సానుకూలఫలితాల నిస్తాయి. బంధువులు, స్నేహితులు ఇంట్లో అత్యంత గౌరవాన్నిస్తారు. ఇంట్లో సంతానం కలిగి కుటుంబవృద్ధి జరుగుతుంది.



**మకరం–** నూతనపరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగస్తులకు ప్రతికూల వాతావరణం. పనిలో అధిక ఒత్తిడి నిరాశ కలిగిస్తుంది.



**కుంభం–** స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. మీరు సాధించే ప్రతిపనిలోనూ మీ స్నేహితుల ప్రమేయం ఉంటుంది. స్నేహితుల నుండి నైతిక బలం లభిస్తుంది. వృత్తివ్యాపారాలకు, ఉద్యోగస్తులకు అనుకూలమైన సమయం. అయితే ఏ రంగం వారికైనా అధిక ఒత్తిడి, శ్రమ అనుభవించక తప్పదు.



**మీనం–** సమస్త ఐశ్వర్యాలను అనుభవిస్తారు. వివిధమార్గాలనుండి అధికఆదాయాన్ని అనుభవిస్తారు. విందువినోదాలకు హాజరౌతారు, ధన వ్యయం చేస్తారు. సామాజికంగా మీ కలుపుగోలుతనం అందరికీ దగ్గరయ్యేలా చేస్తుంది. మీరు ఇతరులకు సహాయకారిగా ఉంటారు.

చిత్ర కథ

# మనదంటూ ఏదీ లేదు

కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ




అన్నట్టు నీ ముక్కుపుడక ఏది?
ఆ...! ముక్కు పుడకా.. ఉంది...
ఒక్కసారి చూపిస్తావా? తొందరేం లేదు.. భోజనం అయిన తరువాతనే..
పరంధామా! పాండురంగా! నన్ను మన్నించు! వేరే దారిలేక ఈ విషం తాగుతున్నా.
సరస్వతీబాయి విషపాత్రను నోటికి చేర్చేంతలో తన రవ్వల ముక్కుపుడక అందులో కనిపించింది. ఆమె ఆశ్చర్యపోయింది. భగవంతుడి కరుణకు ఉప్పొంగిపోయింది.
ఇదేమిటి? వేసిన తాళం వేసినట్టే ఉంది. రవ్వల ముక్కుపుడక మాయమైంది..
నేను అంగట్లో కొట్లో భద్రంగా పెట్టిన రవ్వల ముక్కుపుడక మాయమైంది.. ఆ ముసలాయన వచ్చి తన వస్తువు ఇమ్మంటే ఏం చెప్పాలి?
దీనిని తీసుకువెళ్లి ఆయనకు ఇవ్వండి...
ఇది మీ పుట్టింటివారు పెట్టింది నేను తీసుకోకూడదు..
అది ఈ రోజే ఒక ముసలి బ్రాహ్మణునికి దానమిచ్చాను. ఇది ఆ పరంధాముడిచ్చింది
అని భర్తకు జరిగిందంతా చెప్పింది
ఛీఛీ! నేను పాపిని.. ఈ సిరిసంపదలన్నీ నా ఘనత వలన వచ్చినవే అని భ్రమించాను. అంతా దైవానుగ్రహమని తెలుసుకోలేక సాటి మనుషుల కష్టసుఖాల్లో భాగం పంచుకోలేకపోయాను. దైవానికి దూరమయ్యాను...
భగవంతుడి మహిమ శీనప్పలో పెను మార్పును కలిగించింది. తన యావదాస్తిని దానంచేసి, కట్టుబట్టలతో ఇల్లాలిని వెంటబెట్టుకుని పండరీపురం చేరి ఉంఛవృత్తిలో పొట్టపోసుకుంటూ ముప్పొద్దులా రంగడి సేవలో గడిపి తరించారు.
2
శుభం

# బాలవినోదం

## గజిబిజి

క్రింది గళ్లలోని అక్షరాలను చదవండి.
అక్షరాలతో ఏర్పడే
పదాలు ప్రక్కన రాయండి?

| | | |
|---|---|---|
| ప | డ | వ |
| జ | ఈ | క |
| ల | త | గ |

01) ..........................
02) ..........................
03) ..........................
04) ..........................
05) ..........................
06) ..........................
07) ..........................
08) ..........................
09) ..........................
10) ..........................
11) ..........................
12) ..........................
13) ..........................
14) ..........................
15) ..........................

జవాబులు: 01)పడవ 02)ఈక 03)లత 04)జలగ 05)వడ 06)ఈగ 07)జత 08)గడప 09)జడ 10)ఈత 11)తల 12)పడక 13)వల 14)ఈల 15)పడగ

## గళ్లనుడికట్టు

క్రింది బొమ్మల ఆధారంగా గళ్లనుడికట్టును పూరించండి



| | | 3 | | 4 |
|---|---|---|---|---|
| | 1 | ప | | వ |
| | | | | |
| 2 | | క | | |

జవాబులు: 1)పడవ 2)ఈక 3)పలక 4)వల

## జతచేయండి

ఒకవైపు ఉన్న పేర్లను రెండోవైపు తిథులతో
కలిపితే ఓ పండుగ వస్తుంది.
మరి ఆ జోడీని గుర్తించగలరా?

1) భీష్మ - చవితి
2) దీపావళి - అష్టమి
3) వినాయక - పౌర్ణమి
4) నాగ - నవమి
5) రథ - ఏకాదశి
6) దుర్గ - అమావాస్య
7) శ్రీరామ - దశమి
8) కార్తిక - పంచమి
9) విజయ - సప్తమి

జవాబులు

1)భీష్మఏకాదశి 2)దీపావళిఅమావాస్య 3)వినాయకచవితి
4)నాగపంచమి 5)రథసప్తమి 6)దుర్గఅష్టమి
7)శ్రీరామనవమి 8)కార్తికపౌర్ణమి 9)విజయదశమి

## మీకు తెలుసా?

మనలో చాలామందికి నవగ్రహాల పేర్లు తెలుసు.
కాని, వారి తల్లితండ్రులు, భార్యల పేర్లు తెలియవు.
నవగ్రహపూజలో సంస్కృత శ్లోకాలలో
ఉండే ఆ వివరాలు మీ కోసం...

| గ్రహం | తల్లిదండ్రులు | భార్యపేరు |
|---|---|---|
| 01) రవి | అదితి, కశ్యపుడు | ఉష, ఛాయ |
| 02) చంద్రుడు | అనసూయ, అత్రిమహర్షి | రోహిణి |
| 03) కుజుడు | భూమి, భరద్వాజుడు | శక్తిదేవి |
| 04) బుధుడు | తార, చంద్రుడు | జ్ఞానశక్తిదేవి |
| 05) గురుడు | తార, అంగిరసుడు | తారాదేవి |
| 06) శుక్రుడు | ఉష, భృగుమహర్షి | సుకీర్తి దేవి |
| 07) శని | ఛాయ, సూర్యుడు | జ్యేష్ఠాదేవి |
| 08) రాహువు | సింహిక, కశ్యపుడు | కరాళిదేవి |
| 09) కేతువు | సింహిక, కశ్యపుడు | చిత్రాదేవి |

# తిథులు

పదిహేను తిథులకొక పక్షం, రెండు పక్షాలు ఒక నెల. అంటే నెలలో రెండు పక్షాలు ఉంటాయి. అవి (1) శుక్ల పక్షం (2) బహుళ పక్షం (లేక) కృష్ణ పక్షం. ప్రతి పక్షంలో మొదటి దినం నుండి 15 దినముల వరకు లెక్క పెట్టడానికి ఉపయోగించే మాటలను తిథులు అంటారు. పాడ్యమి నుండి పౌర్ణమి వరకు 15 తిథులు ఒక పక్షం. దీన్ని శుక్ల పక్షం అంటారు. పౌర్ణమి తర్వాత పాడ్యమి నుండి అమవాస్య వరకు 15 తిథుల్ని బహుళ పక్షం (లేక) కృష్ణ పక్షం అంటారు.



| శుక్ల పక్షము | బహుళ/ కృష్ణ పక్షము |
|---|---|
| పాడ్యమి | పాడ్యమి |
| విదియ | విదియ |
| తదియ | తదియ |
| చవితి | చవితి |
| పంచమి | పంచమి |
| షష్ఠి | షష్ఠి |
| సప్తమి | సప్తమి |
| అష్టమి | అష్టమి |
| నవమి | నవమి |
| దశమి | దశమి |
| ఏకాదశి | ఏకాదశి |
| ద్వాదశి | ద్వాదశి |
| త్రయోదశి | త్రయోదశి |
| చతుర్దశి | చతుర్ధశి |
| పౌర్ణమి | అమావాస్య |



## చెప్పే విధానంలో రెండు రకాలు

నువ్వు బాగా చదువుకోకపోతే అతనిలా అవుతావు



నెగిటివ్‌గా చెప్పడం

నువ్వు బాగా చదువుకొని ఇలాంటి వాళ్లకు మంచి జీవితాన్ని ఇవ్వాలి



పాజిటివ్‌గా చెప్పడం




పిల్లలూ..! అంకెలు కలిపి, రంగులు వేస్తే ముచ్చటైన **గులాబీ** మీదే!!

బాలనీతి

# దేనికైనా ధైర్యముండాలి

- శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
9393662821

మునికృష్ణ, సతీష్ ఇద్దరూ స్నేహితులు. మునికృష్ణ పదవతరగతి ఫస్ట్‌క్లాస్‌లో ప్రథమశ్రేణిలో పాసయ్యాడు. మార్కుల జాబితా సంచిలో పెట్టుకుని మొక్కుబడి చెల్లించంకోసం, సతీష్‌ను తోడు తీసుకుని కాలినడకన తిరుమల బయలుదేరాడు.

అలిపిరిపాదాలమండపం చేరి శ్రీవారి లోహ పాదాలు తలమీద పెట్టుకుని, ప్రదక్షణలు చేశారు. కొండ ఎక్కేటప్పుడు ఏ అవాంత రాలు, కాలినొప్పులు లేకుండా ఉండాలని వెంకన్నకు మ్రొక్కుకున్నారు.

ఇద్దరూ అవీ ఇవీ మాట్లాడు కుంటూ గాలిగోపురం చేరారు. అక్కడ చల్లటి చిరుగాలులు చిన్నచిన్నగా వీస్తు న్నాయి. అప్పటిదాకా వారుపడ్డ కష్ట మంతా ఆ చల్లదనానికి మటుమాయమై పోయింది. గాలిగోపురం నిర్మాణాన్ని, నామాల సౌందర్యాన్ని తిలకిస్తూ అక్కడే కూర్చున్నారు.

ఎక్కడినుంచి వచ్చిందో ఓ కోతి... మునికృష్ణ చేతిలోని సంచి సరుక్కున లాక్కొంది. హఠాత్తుగా జరిగిన ఈ పరిణా మానికి ఇద్దరూ బెంబేలెత్తారు. సంచిలో ఉన్న సర్టిఫికేట్ గుర్తుకొచ్చి "అయ్యో... నా మార్కుల లిస్టు" అంటూ మునికృష్ణ ఏడవటం ప్రారంభించాడు. 'సర్టిఫికేట్‌ను ఎక్కడ చించేస్తుందో, ఎత్తుకుని పారిపోతుందో...' అని మునికృష్ణ భయపడసాగాడు.

సతీష్ 'పో... పో' అని గట్టిగా అరిచాడు. కోతి కోపంగా "గుర్... గుర్" అంటూ ఉరిమి చూసింది. ఎలాగైనా మిత్రుడికి సహాయం చేయాలనుకున్న సతీష్ ధైర్యం తెచ్చుకుని పక్కనే ఉన్న గులకరాయి తీసి దాని మీదకి విసిరేయబోయాడు.

అప్పుడే... డబుక్కున, సతీష్ భుజాని కున్న సంచి నేలమీద పడింది. సంచినుంచి 'టంగు'మని శబ్దం వచ్చింది.

సతీష్‌కి అప్పుడు గుర్తుకొచ్చింది... 'దారిలో తినడానికి అమ్మ వేడివేడిగా చేసి క్యారియర్‌లో పెట్టిన సజ్జ వడల సంగతి'.

తళుక్కున మెరుపులాంటి ఆలోచన వచ్చింది సతీష్‌కి. గబగబా బ్యాగు తీసి క్యారియర్‌లోని వడలను కోతి ముందరికి విసిరాడు. అంతే... ఆ కోతి, మార్కుల లిస్టు ఉన్న బ్యాగును పక్కన పడేసి వడలను ఎత్తుకుని పరుగులు తీస్తూ వెళ్ళిపోయింది.



మునికృష్ణ "హమ్మయ్య" అనుకుని సంచిని తీసేసు కున్నాడు. మార్కులలిస్టు భద్రంగా ఉందని చాలా సంతోషిం చాడు.

*'ఆపద ఎదురైనప్పుడు భయపడకూడదు. ధైర్యంగా ఎదుర్కోవాలి. ఒకరికొకరు సహాయం చేసుకోవాలి'* అని అను కుంటూ ఇద్దరూ కొండకెళ్లి స్వామివారి దర్శనం చేసు కున్నారు.

# క్విజ్ 19

01) పుష్యబహుళ అమావాస్యకు మరొకపేరు? జ)..........
02) కేస్లాపూర్ ఏ జిల్లాలో ఉంది? జ)..........
03) సూర్యుడిని మొత్తం ఎన్ని పేర్లతో కీర్తించడం పరిపాటి? జ)..........
04) భారతంలోని యుద్ధపర్వాలలో మొదటిది జ)..........
05) త్రిపురాసుర సంహారం చేసిందెవరు? జ)..........
06) రాత్రికి ముందు వచ్చే సంధ్య జ)..........
07) తాళ్లపాక అన్నమయ్య మనమడు జ)..........
08) సాక్షాత్కారవైభవం జరిగే ఆలయం జ)..........
09) విభీషణుడి భక్తిమార్గం జ)..........
10) శుకుడి భక్తిమార్గం జ)..........
11) దక్షునికి కూతుళ్లు ఎంతమంది? జ)..........
12) కళలకు అధిదేవత జ)..........
13) నాగోబాదేవతకు పూజలు నిర్వహించే వంశీయులు? జ)..........
14) మలయవానుని సౌందర్యానికి ఆకర్షితురాలైంది ఎవరు? జ)..........
15) అగ్నిస్తుతి నేపథ్యంగా సాగిన తారావళి ఏది? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-02-2024.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................................... తేది : ..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 97



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)మాఘశుద్ధపంచమికి గల పేరు(6); 3)మాఘబహుళత్రయోదశి రోజున వచ్చే పండుగ(4); 7)విష్ణుమూర్తి దశావతారాలలో ఒకటి(6); 9)పార్వతిభర్త(3); 10)విష్ణుమూర్తి వాహనం(5) 12)కుమారుడు(5); 13)మాఘశుక్ల ఏకాదశికి గల పేరు(2); 16)మఘనక్షత్రం పేరుతో పిలిచే మాసం(5); 17)స్వారోచిషమనుకాలంలో వేదశిరుడనే బ్రాహ్మణుని కూతురు(3); 20)దిష్టిచుక్క(2); 21)శివుడు(3); 22)పుష్యబహుళ అమావాస్యకు గల పేరు(3); 23)రఘుమహారాజు తండ్రి(4)

### నిలువు

1)మాఘమాసానికి మరొక పేరు (4); 2)కుబేరుని కొడుకు(6); 4)మరీచిభార్య(2); 5)ఇతని పేరుతో ఒక స్వర్గం ఉద్భవించింది(4); 6)దండ(3); 8)మన్మథుని చెలికాడు(4); 9)మాఘ, ఫాల్గుణమాసాలు ఈ ఋతువు(6); 11)మాఘబహుళ ఏకాదశిని ఏమంటారు (3); 14)పాపం(3); 15)నవ్వు(3); 18)పరీక్షిత్తును కాటేసిన సర్పం(4); 19)శూర్పణఖ సోదరుడు(3); 20)సూర్యుని కూతురు(3).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

\- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, గౌ॥ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌గారు 19-12-2023న తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చిత్రం. గౌరవ గవర్నర్ గారికి తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. గార్లు స్వాగతం పలికి, దర్శనానంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, తి.తి.దే. డైరీ, క్యాలెండర్ అందజేశారు.



19-12-2023న తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన **కోయిల్ ఆళ్వారు తిరుమంజనం**లో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,గార్లు.



26-12-2023న జరిగిన తి.తి.దే. పాలకమండలి సమావేశంలో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి, తి.తి.దే.కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. గార్లు, పాలకమండలి ఇతర సభ్యులు 20 పేజీల **'మానవులందరికీ భగవద్గీత'** పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం.



తి.తి.దేవస్థానం స్విమ్స్‌లో అంకాలజీ ప్రత్యేకాధికారి **డా॥ మెట్టా జయచంద్రారెడ్డి** గారు **'యంగ్ సర్జన్ ఆఫ్ ఇండియా'** ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.,లు ఆయనను అభినందించిన దృశ్యం.



23-12-2023న తి.తి.దే. ఆధ్వర్యంలో జరిగిన **గీతాజయంతి** కార్యక్రమంలో భగవద్గీత శ్లోక పఠన పోటీ విజేతలకు, తి.తి.దే. సంయుక్తకార్యనిర్వహణాధికారిణి (విద్య & వైద్యం) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారు బహుమతులు అందజేస్తున్న దృశ్యం.




శ్రీవేంకటేశ్వర ఆయుర్వేదకళాశాల, తి.తి.దే.లో ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన **సి.ఎం.ఈ. శిక్షణా కార్యక్రమం**లో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి (విద్య & వైద్యం) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., పాల్గొని ప్రసంగిస్తున్న దృశ్యం.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-01-2024 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2024-2026 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" posting on 5th of Every Month.



కరుణించి నన్నేలితి కడపరాయ నీ
గరిమలెల్లాఁ గంటి కడపరాయ - అన్నమయ్య

దేవుని కడప, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
(09-02-2024 నుండి 18-02-2024 వరకు)